

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 229

గురువారం 9-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నంబర్‌వన్ గిల్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానానికి.. బౌలింగ్‌లో సిరాజ్‌కు మళ్లీ టాప్ ర్యాంక్

-9లో



భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో?

నాలుగో బెర్త్ రేసులో న్యూజిలాండ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్

-9లో


ఆసియాలోనే అతిపెద్ద
ఫర్నీచర్
అమ్మకం
63% వరకు తగ్గింపు
త్వరపడండి!
చివరి 3 రోజులు మాత్రమే!!
లక్కీ డ్రాలు లేవు | స్క్రాచ్ కార్డులు లేవు | ఖచ్చితమైన బహుమతులు
ఉచితం
42" టివి
₹39,999
ఫర్నీచరు కొనుగోలుతో
ఉచితం
గోల్డ్ కాయిన్
₹59,999
ఫర్నీచరు కొనుగోలుతో
ఉచితం
యాక్టివా 6G
₹99,999
ఫర్నీచరు కొనుగోలుతో
ఇప్పుడే కొనండి, మీ 1వ ఇఎంఐ 120 రోజులు - మరుసటి సంవత్సరం 2024 తరువాత ప్రారంభమవుతుంది 36 నెలల వరకు ఇఎంఐ ఆప్షన్లు కలవు (కేవలం బాంటియాలోనే)
ఈ దశాబ్దపు డీల్
థాయిలాండ్ ప్రీమియం క్వాలిటీ రిక్లైనర్ కార్నర్ సోఫా 2 రిక్లైనర్స్ మరియు 2 కప్ హోల్డర్స్‌తో + రూ. 30,000 విలువ గల ఉచిత కార్పెట్ మరియు టీవీ స్టాండ్
MRP ₹2,09,499 ₹69,999 PER DAY EMI ₹75
కార్పెట్, టీవీ స్టాండ్ ఉచితం
అన్ని మోటరైజ్డ్ : 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 3 సీటర్ + 2 ఎలక్ట్రిక్ రిక్లైనర్స్‌తో 2 సీటర్ + 1 ఎలక్ట్రిక్ రిక్లైనర్‌తో 1 సీటర్ ఉచిత యుఎస్‌బి ఛార్జర్‌లు + ఉచిత కన్సోల్ టేబుల్
MRP ₹2,91,499 ₹99,999 PER DAY EMI ₹108
రిక్లైనర్ సోఫా సెట్ : 3+2+1 (2 రిక్లైనర్స్‌తో 3 సీటర్ + రిక్లైనర్స్‌తో 2 సీటర్ + రిక్లైనర్‌తో 1 సీటర్)
MRP ₹2,04,499 ₹89,999 PER DAY EMI ₹97
కార్పెట్ ఉచితం
యాక్టివా ప్యాకేజ్ : 3+2 సోఫా సెట్ + మార్బుల్ డైనింగ్ టేబుల్ + హైడ్రాలిక్ కింగ్ సైజ్ బెడ్ + 4 పీస్‌ల బెడ్ షీట్ సెట్ + టివి స్టాండ్ + చిల్డ్రన్ స్టడీ టేబుల్ + ఉచిత యాక్టివా 6G
MRP ₹3,02,999 ₹99,999 PER DAY EMI ₹108
లండన్ ప్రీమియం ఫ్యాబ్రిక్ సోఫా సెట్ 3+2+1
LOWEST PRICE
MRP ₹83,499 ₹59,999 PER DAY EMI ₹65
సోఫా సెట్ : 3+2+1+ డివైడర్ + రూ. 7,000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
MRP ₹63,999
₹32,999 PER DAY EMI ₹36
FREE
ఎల్ టైప్ సోఫా సెట్ + రూ. 20,000 విలువ గల కప్ హోల్డర్ ఉచితం + సెంటర్ టేబుల్ ఉచితం
MRP ₹98,999 ₹49,999 PER DAY EMI ₹54
బెడ్‌రూం సెట్ : కింగ్‌సైజ్ బెడ్ + 2 బెడ్ సైడ్ టేబుల్స్ + 6 డోర్ వార్డురోబ్ + 2 డ్రెస్సింగ్ మిర్రర్స్
MRP ₹2,14,999
₹79,999 PER DAY EMI ₹86
ITALIAN DESIGN
సింగపూర్ ప్రీమియం క్వాలిటీ బెడ్ హైడ్రాలిక్ స్టోరేజ్‌తో + రూ. 30,000 విలువ గల టీవీ / వాల్ యూనిట్ ఉచితం
MRP ₹63,999 ₹39,999 PER DAY EMI ₹43
Hydraulic
ఉచితం
ఎల్ టైప్ సోఫా సెట్ + రూ. 7000 విలువ గల సెంటర్ టేబుల్ ఉచితం
ఉచితం
MRP ₹52,999 ₹26,999
PER DAY EMI ₹29
ప్రీమియం క్వాలిటీ బెడ్ రూం సెట్ : 2 బెడ్ సైడ్ టేబుల్స్‌తో హైడ్రాలిక్ బెడ్ + స్టూల్‌తో డ్రెస్సింగ్ టేబుల్ + 3 డోర్ వార్డురోబ్
ఉచితం రూ. 65,000 విలువ గల రిక్లైనర్ మసాజర్
MRP ₹2,16,999
₹99,999 PER DAY EMI ₹108
బాటమ్ డ్రా స్టోరేజ్‌తో బెడ్
ఉచితం రూ. 9,000 విలువ గల డ్రెస్సింగ్ మిర్రర్
కింగ్ సైజ్
MRP ₹43,999
₹20,999
క్వీన్ సైజ్
MRP ₹42,499 ₹19,999 PER DAY EMI ₹22
ప్రీమియం క్వాలిటీ వార్డు రోబ్
MRP ₹39,799
₹10,999
PER DAY EMI ₹12
MRP ₹45,499 ₹15,999
MRP ₹58,999 ₹21,999
మార్బుల్ డైనింగ్ టేబుల్
4 కుర్చీలతో
MRP ₹32,999
₹14,999
PER DAY EMI
₹36
6 కుర్చీలతో
MRP ₹39,499
₹17,999
ప్రీమియం ఉడెన్ డైనింగ్ టేబుల్ + టీవీ స్టాండ్ ఉచితం
4 కుర్చీలతో
MRP ₹38,999
₹16,999
PER DAY EMI ₹18
టీవీ స్టాండ్ ఉచితం
6 కుర్చీలతో
MRP ₹33,999
₹21,999
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ + స్టడీ టేబుల్ ఉచితం
ఉచితం
4 కుర్చీలతో MRP ₹43,999 ₹18,999 PER DAY EMI ₹20
6 కుర్చీలతో MRP ₹56,999 ₹23,999 PER DAY EMI ₹26
సింగిల్ బెడ్
MRP ₹13,499
₹5,999
PER DAY EMI
₹6
ఫ్రాన్స్ ప్రీమియం క్వాలిటీ స్టడీ టేబుల్
Credit Card EMI ₹146 (24 months)
MRP ₹7,499 ₹2,999
ఎక్స్ఛేంజ్ 20% వరకు తగ్గింపు
ఇప్పుడే బుక్ చేయండి - అదే రోజు డెలివరీ తీసుకోండి!
ఉ. 10 గం.ల లోపు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేయండి, అదనంగా 5% తగ్గింపు పొందండి కూపన్‌కోడ్ : BantiaDiwali ఉపయోగించండి www.bantia.in
మ. 1 గం.లోపు షాపింగ్ చేయండి
An ISO-9001:2015 Certified Company
BANTIA
Furnitures
Affordable Lifestyles Since 1955
79950 00930 / 040-2784 1562 / 79933 33351 / 63014 32711
సికింద్రాబాద్ | ఎ.ఎస్.రావు నగర్ | నాగోల్ | హైటెక్ సిటీ | కొంపల్లి | బోడుప్పల్
దిల్‌సుఖ్‌నగర్ | కర్మన్‌ఘాట్ | కూకట్‌పల్లి | వరంగల్ | అత్తాపూర్ | సిద్దిపేట్ | జగిత్యాల్ | www.bantia.com
పొడిగించిన షాపింగ్ వేళలు 10am-10:30pm

సత్యమేవ జయతే

సాక్షి




'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 229

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నితీశ్ కుమార్ క్షమాపణ

జనాభా నియంత్రణ అంశంపై అసెంబ్లీలో తాను చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో బిహార్ సీఎం నితీశ్ క్షమాపణ చెప్పారు.

- వివరాలు 6లో

పలు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

మానవ అక్రమ రవాణా కేసులకు సంబంధించి ఎన్ఐఏ ఎనిమిది రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాడులు చేసింది.

- వివరాలు 6లో

పొదరిల్లు చేసుకున్నం!

ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఒక్కొక్కటీ సర్దుకుంటూ వచ్చినం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తుంది: కేసీఆర్

అభివృద్ధిలో దూసుకెళ్లాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యం

- ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ వల్ల 50 ఏళ్లు గోసపడ్డాం
- ధరణి తీసేస్తే మళ్లీ దళారుల వ్యవస్థే..
- కాంగ్రెస్, బీజేపీలకు ఢిల్లీలో స్విచ్ వేస్తే ఇక్కడ లైటు వెలుగుతుంది
- ప్రజల కోసం కష్టపడే పార్టీనే ఎన్నుకోవాలి
- అందరూ ఆలోచించి విచక్షణతో ఓటు వేయాలని పిలుపు
- సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

మళ్లీ మొరాయించిన సీఎం హెలికాప్టర్



బుధవారం సిర్పూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సాక్షి, ఆసిఫాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పుడు ఏమీ లేకుండేదని.. ఎంతో కష్టపడి తెచ్చుకున్న రాష్ట్రంలో ఒక్కొక్కటీ సర్దుకుంటూ పొదరిల్లుగా మార్చుకున్నామని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఆంధ్రాలో కలపడం వల్ల 50ఏళ్లకుపైగా గోసపడ్డామన్నారు. ఇప్పుడు మళ్లీ ఆ గోస మనకు అవసరమా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో అందరూ ఆలోచించి విచక్షణతో ఓటు వేయాలని, లేకపోతే మోసపోయి గోస పడతామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కుము రంభీం జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌తోపాటు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''రాష్ట్రం వచ్చినప్పుడు ఏమీ లేకుండే. సాగు, తాగు నీరు లేదు. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు జరిగేవి. అన్నింటా దళారీ వ్యవస్థ ఉండేది. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణలో ఒక్కొక్కటీ సర్దుకుంటూ పోతున్నాం. రాష్ట్రం ఓ పొదరిల్లుగా మారింది. అవినీతి లేని పాలన అందిస్తున్నాం. భూముల ధరలు పెరిగాయి. రాష్ట్రంలో తండాలకు సైతం శుద్ధమైన నీరు అందుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా

మిగతా 2వ పేజీలో ▶

తప్పులుంటే చెప్పండి

- అఫిడవిట్‌లో సరిదిద్దేందుకు అభ్యర్థులకు అవకాశం ఇవ్వండి
- సీఈఓకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వినతి
- ఎన్నికల ఏర్పాట్లపై పార్టీలతో సీఈఓ సమావేశం
- రేవంత్‌పై చర్యలు తీసుకోవాలన్న బీఆర్ఎస్

7లో

క్లుప్తంగా...

బీసీ సీఎం కంటే బీసీ బిల్లు ముఖ్యం: కృష్ణయ్య



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల అభివృద్ధికి బీసీ బిల్లు ఎంతో ముఖ్యమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్రానికి బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రి చేస్తామని ప్రకటించడం శుభపరిణామమే అని, కానీ అంతకంటే ముఖ్యమైంది బీసీ బిల్లు అని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలంటూ 30 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో మహిళాబిల్లు పెట్టినప్పుడు బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలని పలు పార్టీలు మద్దతు తెలిపాయని, అన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా బీసీ సబ్‌కోటాకు ఇబ్బందులేమున్నాయని కృష్ణయ్య ప్రశ్నించారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులున్నారని చెప్పారు. బీసీల అభివృద్ధికి ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పథకాలు దేశానికి ఆదర్శనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే బీసీ బిల్లుపై దృష్టి పెట్టాలన్నారు. ఈమేరకు కృష్ణయ్య ప్రధానికి బుధవారం లేఖరాశారు.

బీసీలకు చట్టసభల్లో 27% రిజర్వేషన్లు ఇవ్వాలి

ప్రధాని మోదీకి దాసు సురేశ్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: బీసీలకు చట్టసభల్లో కనీసం 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోదీని బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్ కోరారు. తెలంగాణలో బీజేపీ బీసీని ముఖ్యమంత్రి చేస్తామనడాన్ని స్వాగతిస్తున్నామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన బీజేపీ బీసీ సభలో ప్రధానిని సురేశ్ కలిశారు. ఈ సందర్భంగా బీసీల రాజకీయ సామాజిక ఆర్థిక స్థితిగతులు, బీసీల నాయకత్వంపై కొనసాగుతున్న వివక్షను, బీసీలు కోల్పోతున్న అవకాశాలను బీసీల సమగ్రాభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యాచరణను సురేశ్ ప్రధానికి వివరించారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు, బీసీలకు ప్రత్యేకమైన బడ్జెట్ (సబ్ ప్లాన్), ప్రభుత్వ బీసీ ఉద్యోగుల క్రిమీలేయర్‌ను రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంపు, బీసీలకు ప్రత్యేకమైన పారిశ్రామిక విధానం, బీసీ మంత్రిత్వ శాఖ, బీసీల కులగణన వంటి తదితర డిమాండ్లతో కూడిన నివేదికను ప్రధానికి అందించారు.

సాఫ్ట్‌వేర్ నిపుణులకు 'పార్ట్‌టైమ్' ఆఫర్!

- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ బోధనలో కొత్త దారులు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం ఇంజనీరింగ్ కాలేజీల వేట
- వారానికి మూడు రోజులు ఆన్‌లైన్ క్లాసులు
- ఫ్యాకల్టీ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం

సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ కొలువులిస్తామంటూ ఇంజినీరింగ్ కాలేజీల వెంటపడే ఐటీ కంపెనీలు కామన్! కట్ చేస్తే... పాఠాలు చెప్పాలంటూ సాఫ్ట్‌వేర్ నిపుణుల కోసం వేట మొదలెట్టాయి కాలేజీలు. ఫ్యాకల్టీగా చేరాలని.. కనీసం పార్ట్‌టైమ్‌గా అయినా విద్యార్థులకు బోధించాలంటూ ఇంజనీరింగ్ కాలేజీలు వారిని ఆహ్వానిస్తున్నాయి. ఆన్‌లైన్‌లోనైనా శిక్షణ ఇవ్వాలని కోరుతున్నాయి. మంచి వేతనాలివ్వడానికీ సిద్ధపడుతున్నాయి.

రాష్ట్రంలో ఈ ఏడాది కంప్యూటర్ కోర్సుల్లో 14 వేల సీట్లు పెరిగాయి. మరోపక్క సివిల్, మెకానికల్ బ్రాంచీల్లో సీట్లు తగ్గాయి. విద్యార్థుల నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సులను డిమాండ్ పెరగడమే దీనికి కారణం. అయితే, వీటిని బోధించే ఫ్యాకల్టీకి మాత్రం తీవ్రంగా కొరత నెలకొంది. ఈ విభాగాల్లో ఎంఎస్ చేసిన వాళ్లు కూడా బోధన వైపు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇప్పటివరకూ సీఎస్‌సీ బోధించే వారితోనే పాఠాలు చెప్పిస్తున్నారు. దీనివల్ల నాణ్యత పెరగడం లేదని అఖిల భారత సాంకేతిక విద్య మండలి (ఏఐసీటీఈ) గుర్తించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో నిపుణులతో బోధించే ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ తరహా బోధన ఉంటే తప్ప వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ కోర్సులకు అనుమతించవద్దని రాష్ట్రాల కౌన్సిళ్లకు తెలిపింది. దీంతో సాఫ్ట్‌వేర్ నిపుణులకు గాలంవేసే పనిలోపడ్డాయి కాలేజీలు.



వాళ్లెవరో చెప్పాల్సిందే...


రాష్ట్రంలోని 174 కాలేజీల్లో కంప్యూటర్ కొత్త కోర్సులను బోధించే వారి జాబితాను గుర్తింపు ఇచ్చే యూనివర్శిటీకి విధిగా సమర్పించాల్సి ఉంటుంది. ఆయా ఫ్యాకల్టీ అర్హతలను యూనివర్సిటీ కమిటీలు పరిశీలిస్తాయి. ఏఐ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీకి ఆయా రంగాల్లో నిష్ణాతులను నియమించాలని ఏఐసీటీఈ సూచించింది. అయితే, వాళ్ల అర్హతలేంటనేది స్పష్టం చేయలేదు. దీని స్థానంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ప్రొఫెషనల్స్‌తో బోధన చేయించాలని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో 58 శాతం కంప్యూటర్ కోర్సులున్నాయి. ప్రతీ కాలేజీలోనూ ఒక ఏఐ బ్రాంచీ ఉంటోంది. ఈ లెక్కన ఈ ఏడాది ప్రతీ కాలేజీ ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ ఇతర కోర్సుల కోసం కనీసం ఐదుగురి చొప్పున ప్రొఫెషనల్స్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీన్నిబట్టి రాష్ట్రంలో దాదాపు 250 మంది సాఫ్ట్‌వేర్ నిపుణులకు అవకాశాలు దక్కే వీలుంది.

ఆన్‌లైన్ క్లాసులు...

ఫుల్‌టైమ్ ఫ్యాకల్టీ కొరత నేపథ్యంలో... ఆన్‌లైన్ ద్వారా కొత్త కోర్సులను బోధించేందుకు యూనివర్సిటీలు, ఏఐసీటీఈ, రాష్ట్ర ఉన్నత విద్యా మండళ్లు అనుమతిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు వివిధ దేశాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారిని బోధనకు ఒప్పించేందుకు కాలేజీలు కృషి చేస్తున్నాయి. వారానికి కనీసం 10 క్లాసులు చెప్పించే ఏర్పాటు చేస్తున్నామని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ప్రైవేటు కాలేజీలు కూడా ఇదే బాట పడుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వారికి శని, ఆదివారాల్లో సెలవులుంటాయి. అయితే, కోవిడ్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను కంపెనీలు తిరిగి ఆఫీసులకు రప్పిస్తున్నాయి. ఈ కారణంగా వారాంతపు సెలవుల్లో బోధనకు నిపుణులు సిద్ధపడటం లేదని ఓ ప్రైవేటు కాలేజీ నిర్వాహకుడు తెలిపాడు. దీంతో అమెరికాకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ నిపుణుడిని ఏఐ కోసం నియమించినట్టు తెలిపారు. సాధారణ ఫ్యాకల్టీకి ఇచ్చే వేతనం కన్నా పార్ట్‌టైమ్ పనిచేసే నిపుణులు రెండింతలు డిమాండ్ చేస్తున్నారని కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి.

భాగ్యనగర్‌ను షరాబ్‌నగర్‌గా మార్చేశారు

- కాంగ్రెస్, బీఆర్ఎస్ బిల్లా-రంగాలుగా మారాయి
- కేంద్ర సహాయ మంత్రి అశ్విని కుమార్ చౌబే ధ్వజం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్...భాగ్యనగర్‌ను షరాబ్ నగర్‌గా మార్చేసిందని కేంద్రమంత్రి అశ్విని కుమార్ చౌబే మండిపడ్డారు. ప్రజల్ని మద్యానికి బానిసలుగా తయారుచేసి రాష్ట్రాన్ని నరకప్రాయంగా మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నాలు నిమగ్నమైందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ప్రమాదకరమైన బిల్లా-రంగాలుగా మారాయని ధ్వజమెత్తారు. బుధవారం బీజేపీ మీడియాసెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...కేసీఆర్ సర్కార్ పెద్దెత్తున అవినీతికి పాల్పడుతూ, ఢిల్లీ ఆప్ సర్కార్‌తో కలిసి మద్యం కుంభకోణానికి పాల్పడిందన్నారు. కేజ్రీవాల్, కేసీఆర్.. ఇద్దరూ కలిసి ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కేసీఆర్ కుమార్తె కవిత లిక్కర్ స్కామ్‌లో త్వరలోనే శిక్షపడి ఆమె జైలుకు వెళ్తారని చెప్పారు. గోవా ఎన్నికల్లో కేజ్రీవాల్ వంద కోట్ల అవకతవకలకు పాల్పడితే, మిషన్ భగీరథ పథకంలో కూడా ఇక్కడ కమీషన్లు తీసుకున్నారని విమర్శించారు. గత తొమ్మిదిన్నరేళ్లలో..రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీలేదని బీఆర్ఎస్ సర్కారు సింగరేణిని కూడా ఆగం చేసిందన్నారు. ధరణి పోర్టల్ ద్వారా భూములు లాక్కుంటున్నారని, అది ధరణిని (భూమిని) దోచుకునే పోర్టల్ అని ఆరోపించారు. బీఆర్ఎస్ కు సీ టీంగా కాంగ్రెస్ పనిచేస్తోందని ఆరోపించారు.

వారెవరు గెలిచినా మళ్లీ ఎన్నికలే!

- కేటీఆర్‌ను సీఎం చేస్తే బీఆర్ఎస్‌లో చీలిక తప్పదు
- కుర్చీ కొట్లాటలతో కాంగ్రెస్ కుప్పకూలడం ఖాయం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



కరీంనగర్ పాతబజార్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ కరీంనగర్‌టౌన్: రాష్ట్రంలో బీఆర్ఎస్సో, కాంగ్రెస్సో అధికారంలోకి వస్తే మళ్లీ ఎన్నికలు వచ్చే ప్రమాదముందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీఎం కుర్చీ కోసం కొట్లాటలు తప్పవని, తద్వారా కొద్దిరోజులకే ఆ ప్రభుత్వం కుప్పకూలుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కేటీఆర్ సీఎం అవుతారని, అప్పుడు ఆ పార్టీలో చీలికలొచ్చి ప్రభుత్వం పడిపోతుందని జోస్యం చెప్పారు. రాష్ట్రం సుస్థిరంగా ఉండాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వ్యక్తిని సీఎంను చేసి తీరుతామన్నారు. నారాయణపేట నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.రతంగ్‌పాండురెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ బండి మాట్లాడారు. కేసీఆర్ లేకుంటే నిన్ను కుక్కలు కూడా దేకవు అని కేటీఆర్‌ను బండి దుయ్యబట్టారు. ''అమెరికాలో చిప్పలు కడుక్కునే వాడివి...2004లో నెలకు జీతం రూ.4 లక్షలు అన్నావు...ఇప్పుడేమో కోటి అంటావు...నెలకు కోటి లెక్క చేసిన ఐదేళ్లకు దాదాపు వంద కోట్లు అనుకో...మరి లక్షల కోట్ల రూపాయలు దోపిడీ చేసినవ్ కదా..ముందు ఆ లక్ష కోట్ల సంగతి తేల్చు''అని సవాల్ విసిరారు.

హెలికాప్టర్‌లో ఎన్నికల ప్రచారానికి బండి

బండి సంజయ్‌ను స్టార్ క్యాంపెయినర్‌గా ఎంపిక చేసిన బీజేపీ అధిష్టానం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సభల్లో పాల్గొనేందుకు ఆయనకు హెలికాప్టర్‌ను కేటాయించింది. దీంతో బుధవారం కరీంనగర్ నుంచి నారాయణపేట జిల్లాకు సభలో పాల్గొనేందుకు సంజయ్ హెలికాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. రెండోరోజు బుధవారం పాదయాత్రలో భాగంగా కరీంనగర్‌లోని 6, 29, 30 పాతబజార్ శివాలయం నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గంగుల కమలాకర్‌కు ఊరట

ఆయనపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయన ఎన్నిక చెల్లదంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. పిటిషనర్ ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని చెప్పింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో గంగుల కమలాకర్ పరిమితికి మించి ఎన్నికల ఖర్చు చేశారంటూ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ హైకోర్టులో ఎన్నికల పిటిషన్(ఈపీ) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ చిల్లకూర్ సుమలత బుధవారం తీర్పు వెల్లడించారు. 'గంగుల కమలాకర్ ఎన్నికల్లో అదనపు వ్యయం చేశారు. ఆయన సమర్పించిన రోజువారీ లెక్కల ప్రకారం.. 2018, డిసెంబర్ 7 వరకు చేసిన మొత్తం ఖర్చు రూ. 50,36,531.85. దీనిని అసిస్టెంట్ రిజిస్ట్రార్ కూడా ధ్రువీకరించారు. 1961 ఎన్నికల నియమావళిలోని రూల్ 90 ప్రకారం అసెంబ్లీ నియోజకవర్గానికి నిర్దేశించిన ఎన్నికల ఖర్చు గరిష్ట పరిమితి రూ.28,00,000. ప్రజాప్రతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(6) ప్రకారం ఎక్కువ మొత్తాన్ని ఖర్చు చేయడం ద్వారా గంగుల అవినీతి పాల్పడ్డారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, అక్రమ పద్ధతిలో గెలిచిన కమలాకర్ ఎన్నిక రద్దు చేయాలి'అని పిటిషనర్ తరఫున టి.సూర్య సతీశ్ వాదనలు వినిపించారు.

సాక్ష్యంలేదు.. అనర్హుడిగా ప్రకటించలేం..

'కమలాకర్ ఎన్నికల్లో రూ.27,46,037.35 మాత్ర మే వ్యయం చేశారు. ఆ మేరకు వివరాలు కూడా సమర్పించారు. ఇది నిబంధనల మేరకు రూ.28, 00,000 కంటే తక్కువే. పొన్నం ప్రభాకర్ ఎలాంటి సాక్ష్యం లేకుండా ఆయనపై ఆరోపణలు చేస్తున్నారు. రోజువారీ ఖర్చుల వివరాలకు సంబంధించి పేజీలను పిటిషన్‌కు జత చేయడంలో తప్పులకు పాల్పడ్డారు' అని గంగుల తరఫున సీనియర్ న్యాయవాది శ్రీపాద ప్రభాకర్ వాదించారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న న్యాయమూర్తి తీర్పు వెల్లడిస్తూ.. కమలాకర్ ఎన్నిక రద్దు చేయడానికి ఎలాంటి మెరిట్ కనిపించడం లేదన్నారు. ఆయనను అనర్హుడిగా ప్రకటించలేమని పేర్కొంటూ.. పిటిషన్‌ను కొట్టివేశారు. మరోవైపు గంగుల ఎన్నికను రద్దు చేయాలంటూ బీజేపీ ఎంపీ బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టనుంది.

13 జిల్లాలకు బీజేపీ సమన్వయకర్తలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. 13 జిల్లాలకు బీజేపీ జిల్లా సమన్వయకర్తలను కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. ఆదినాథ్ (ఆదిలాబాద్), అశోక్ వర్ధన్ (మంచిర్యాల), మేడిసెమ్మె రాజు (నిర్మల్), ఎ.భరత్ (కామారెడ్డి), సీహెచ్ గోవర్ధన్‌గౌడ్ (రంగారెడ్డి-అర్బన్), నలగామ శ్రీనివాస్ (సిద్దిపేట), యాదగిరి (నల్లగొండ), కట్టా సుధాకర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), పి.రాజేంద్రప్రసాద్ (హనుమకొండ), గుడిపల్లి రాజేశ్వర్‌రావు (వరంగల్), శివరాజ్ యాదవ్ (జనగామ), కుంచె వెంకటరంగ కిరణ్ (భద్రాద్రి కొత్తగూడెం), జమలాపూర్ శంకర్ (భాగ్యనగర్-మలక్‌పేట) తదితరులు సమన్వయకర్తలుగా నియమితులైనట్టు బుధవారం పార్టీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రధానికి వీరశైవ లింగాయత్, లింగబలిజల కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వీరశైవ లింగాయతులు, ఆరె క్షత్రియ మరాఠాలు, నాన్ బ్రాహ్మిణ్ మరాఠాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలన్న విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించడం పట్ల ప్రధాని మోదీకి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమన్వయ సమితి ధన్యవాదాలు తెలిపింది. ఈ అంశంపై ప్రధానికి వినతిపత్రాన్ని సమర్పించగా వచ్చే కేబినెట్ మీటింగ్‌లో దీనిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు సమితి నాయకుడు, బీజేపీ నేత అశోక్ ముస్తాపురే ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ ముఖ్యనేతలు జి.కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ సమక్షంలో మోదీ ఈ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 229

గురువారం 9-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బెన్‌స్టోక్స్ సెంచరీ

ప్రపంచకప్‌లో నెదర్లాండ్స్‌పై 160 రన్స్ తేడాతో ఇంగ్లండ్ గెలుపు. - 9లో



జర్మనీ నుంచి టెస్లా దిగుమతులు!

భారత మార్కెట్లో ఎంట్రీ ఇవ్వాలని ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా భావిస్తోంది. -బిజినెస్‌లో



వందే సాధారణ్ ట్రయల్ రన్ సక్సెస్

రైల్వే శాఖ దేశంలో తొలిసారిగా ప్రవేశపెడుతున్న 'వందే సాధారణ్' రైలు ట్రయల్ రన్ విజయవంతమైంది.

- వివరాలు 6లో



అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు

పాఠశాల ఉద్యోగాల కేసులో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి ఈడీ మరోసారి సమన్లు జారీ చేసింది.

- వివరాలు 6లో



ఇండోనేసియాలో భూకంపం

ఇండోనేసియాలోని చియాన్ ద్వీపం బుధవారం వరుస ప్రకంపనలతో వణికిపోయింది. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

- వివరాలు 6లో



నెల రోజులుగా నెత్తురోడుతోంది..

ఇజ్రాయెల్ సైన్యం గాజా అంతటా క్షిపణులు, రాకెట్లు ప్రయోగించింది. గత 24 గంటల్లో 214 మంది మరణించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

టికెట్ రాలేదని ఆత్మహత్యాయత్నం



కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో ఆ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్..బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. నిజామాబాద్ ఆస్పత్రిలో ఐసీయూలో ఉన్న ఆయన కోలుకుంటున్నట్లు తెలిసింది.

- వివరాలు 7లో

ఆదిలాబాద్ @ 16.7



రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుండడం, రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తుండడంతో చలి పెరుగుతోంది. మరో మూడురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 5లో

డిసెంబర్ 9న రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం

ఆదిలాబాద్, ఉట్నూర్, రాజేంద్రనగర్ సభల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం
- తెలంగాణ వచ్చినా నీళ్లు.. నిధులు అందలేదు.. నియామకాలు జరగలేదు
- మోదీ మేడిగడ్డకు ఎందుకు వెళ్లలేదు? కేసీఆర్‌కు ఎందుకు భయపడుతున్నారు?
- తెలంగాణలో కాదు.. గుజరాత్‌లో బీసీని సీఎం చేయాలని సవాల్
- కేసీఆర్‌ను పొలిమేరలు దాటే వరకు తరమాలని పిలుపు



ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలతో కేసీఆర్ ఖేల్ ఖతం అవుతుందని, దుకాణం బంద్ అవుతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 9న రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వస్తుందని,6గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో నిర్వహించిన విజయభేరి సభల్లో ఆయన ప్రసంగించారు.

ఆ రెండేళ్లు రైతుబంధు ఎలా ఇచ్చారు?

'ప్రజలకు ఏమీ చేయని బీఆర్‌ఎస్‌కు ఓటెందుకు వేయాలి? తెలంగాణ వచ్చినా ఇక్కడి ప్రజలకు నీళ్లు.. నిధులు అందలేదు.. నియామకాలు జరగలేదు. సీఎం అబద్ధాలతో ప్రజలను నమ్మించాలని చూస్తున్నారు. ధరణి రాకముందు రెండేళ్లు రైతుబంధు ఎలా ఇచ్చారు? వైఎస్ హయాంలో రైతులకు రుణమాఫీ చేయలేదా? పైగా ధరణి తెచ్చి దందాలు చేసి భూములు కొల్లగొట్టారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి స్థానంలో కొత్త మెరుగైన సాంకేతికతను తీసుకొస్తాం. 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నారని నిరూపిస్తే మేము నామినేషన్లు కూడా వేయం. రైతులకు ఉచిత కరెంటు ఇచ్చేది కాంగ్రెస్సే. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు, హనుమంతుడి గుడి లేని ఊరు లేదు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోట మేము ఓట్లు అడుగుతాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చిన చోట మీరు ఓట్లు అడగండి..'అని రేవంత్ సవాల్ చేశారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటే..

'బీజేపీకి ఓటు వేసినా బీఆర్‌ఎస్‌కు వేసినట్టే. ఈ రెండు పార్టీలు ఒకటే. కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎం అని గతంలో మాట్లాడిన మోదీ.. నిన్న మేడిగడ్డకు మిగతా 2వ పేజీలో ▶

జంగ్ తెలంగాణ

నేడు ఇక్కడ రేపు ఢిల్లీలో..

కాంగ్రెస్ గెలుపు ఖాయం

- బీఆర్‌ఎస్ నేతలు గల్లీలో గులాబీలు.. ఢిల్లీలో గులాములు
- కేటీఆర్‌వి ఉద్దెర మాటలు... కర్ణాటక పోలీసులు వచ్చి గుంజుకుపోతే తెలుస్తుంది
- బీఆర్‌ఎస్‌కు 25 కంటే ఎక్కువ రావు

సాక్షి ఇంటర్వ్యూలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

- వివరాలు జంగ్ తెలంగాణలో

రేపటితో ముగియనున్న నామినేషన్లు..

- నేడు ఏకాదశి కావడంతో భారీగా దాఖలుకు అవకాశం
- గజ్వేల్, కామారెడ్డిలలో నామినేషన్ వేయనున్న సీఎం కేసీఆర్
- రేపు కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పోటీకి రేవంత్‌రెడ్డి నామినేషన్
- 13న పరిశీలన.. 15 వరకు ఉపసంహరణ గడువు -2లో

బీఆర్‌ఎస్ సర్కారుతోనే పారిశ్రామిక అభివృద్ధి

తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య సమావేశంలో మంత్రి కేటీఆర్



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు
- రాష్ట్రానికి కావలసింది స్థిరమైన ప్రభుత్వం, సమర్థ నాయకత్వం
- అంతర్జాతీయ స్థాయిలో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి
- ఢిల్లీ ఆదేశాలతో నడిచే సర్కారు వస్తే రాష్ట్రానికి అధోగతే!
- ఈసారి గెలిచాక రైతుబంధుపై నియంత్రణ
- ఆర్థికసాయాన్ని 4 లేదా 5 ఎకరాలకు పరిమితం చేసే ఆలోచన ఉందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ''రైతుబంధు పెద్దవాళ్లకే ఇస్తున్నారని కొందరు విమర్శిస్తున్నారు. నాకు రెండెకరాలు ఉంది. సంవత్సరానికి 20వేలు వస్తుంది పెట్టుబడికి. మరొకాయనకు 10 ఎకరాలకు లక్ష రూపాయలు వస్తుంది. నాకు వస్తున్న 20వేల మీద సంతోషం లేదు. పక్కాయనకు వచ్చే లక్ష రూపాయల మీద దృష్టి ఉంది. పొలం ఎంత ఉంటే అంత వస్తుంది. అయినా డబ్బులున్న వాళ్లకు ఎందుకు ఇస్తున్నారన్న ప్రజల బాధను నేను అర్థం చేసుకోగలను. దీన్ని సరిదిద్దే అవకాశాన్ని పరిశీలిస్తాం. నాలుగు లేదా ఐదు ఎకరాలకు తగ్గించే విషయాన్ని ఆలోచిస్తున్నాం. ఈసారి ప్రభుత్వం వచ్చాక తప్పుని సరిగా సరిదిద్దుతాం''అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె.తారక రామారావు చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు మునిగిపోయిందని, లక్ష కోట్లు నష్టమని చెబుతూ.. ప్రతిపక్షాలు ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టిస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని మిగతా 2వ పేజీలో ▶

కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా.?

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు పునరావృతం

సంగారెడ్డిలో రోడ్‌షో, బహిరంగసభలో మంత్రి కేటీఆర్ - 2లో

బెల్లంపల్లి ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సీఎం కేసీఆర్



పొదరిల్లు చేసుకున్నం!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 24 గంటల కరెంటు ఇస్తున్నాం. వైద్య, విద్యా రంగాల్లో అభివృద్ధి సాధించాం. ప్రత్యేక గురుకులాలు ఏర్పాటు చేసుకున్నాం. అప్పట్లో తలసరి ఆదాయంలో రాష్ట్రం దేశంలో 15 నుంచి 20 ర్యాంకులో ఉండేది. ఇప్పుడు నంబర్‌వన్‌గా మారింది. ఇదంతా మంత్రమో, మాయ చేస్తేనో అయితదా? పట్టుదలతో పనిచేస్తున్నాం. నిజాం స్థాపించిన సింగరేణికి 134 ఏళ్ల చరిత్ర ఉంది. 100% రాష్ట్ర వాటా ఉండాల్సిన కంపెనీలో కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి 49% వాటా ఇచ్చింది. వాళ్లు ఉన్నన్ని రోజులు కంపెనీకి లాభాలు రాలేదు. ఇప్పుడు లాభాలు వస్తున్నాయి. కార్మికులకు బోనస్‌లు పెంచాం.

రాష్ట్రాన్ని జాప్యం చేసి గోస పెట్టింది

బీఆర్ఎస్ 24 ఏళ్ల కింద పుట్టింది. తెలంగాణ ప్రజల హక్కుల కోసం 14 ఏళ్లు పోరాడి తెలంగాణను సాధించుకున్నాం. అంతకుముందు 50ఏళ్లు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కాంగ్రెస్ పాలకులు బలవంతంగా తెలంగాణను ఆంధ్రలో కలిపారు. దానివల్ల మనం చాలా నష్టపోయాం. గోస పడ్డాం. ఉప్పెనలా ఉధృతంగా ఉద్యమం చేస్తే 2004లో ఎన్నికల ముందు తెలంగాణ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఎన్నికలు కాగానే మాట తప్పింది. మళ్లీ గోస పెట్టింది. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అన్నట్లు పోరాడితే.. చివరికి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది.

ధరణి తీసేస్తే దళారుల రాజ్యమే

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ ఎందుకని.. పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వేస్ట్ పథకమని అంటున్నారు. భూవివాదాలు ఉండకూడదనే ధరణి పోర్టల్ తీసుకొచ్చాం. కాంగ్రెస్ హయాంలో లంచం ఇస్తేనే రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఇప్పుడు ఎలాంటి లంచం ఇవ్వకుండానే అరగంటలో అయిపోతున్నాయి. అలాంటి ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అలా అంటున్నవారినే బంగాళాఖాతంలో వేయాలి. ధరణి తీసేస్తే రైతులకు భూములపై ఉన్న హక్కులు పోతాయి. మళ్లీ దళారుల వ్యవస్థ వస్తుంది. రైతుబంధు, ఉచిత విద్యుత్ ఉండాలంటే.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్లాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తేనే సాధ్యం.


సిర్పూర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

వారికి అధికారమిస్తే రాష్ట్రాన్ని అమ్మేస్తారు

పీసీసీ అధ్యక్షుడు టికెట్లు అమ్ముకున్నారని గాంధీ భవన్‌లో ఆ పార్టీ నేతలే రోజూ లొల్లి చేస్తున్నారు. అలాంటి వారికి అధికారమిస్తే రాష్ట్రాన్నే అమ్మేస్తారు. అందుకే ప్రజల కోసం పనిచేసే వారిని, కష్టపడే పార్టీని ఎన్నుకోవాలని కోరుతున్నాం. కాంగ్రెస్, బీజేపీలకు ఢిల్లీలో స్విచ్ వేస్తే ఇక్కడ లైటు వెలుగుతుంది. కానీ మాకు తెలంగాణ ప్రజలే బాసులు.

గిరిజనేతరులకూ పట్టాలిస్తాం

పారిశ్రామికంగా సిర్పూర్ కాగజ్‌నగర్‌ను అభివృద్ధి చేస్తాం. తెలంగాణ తెచ్చుకోబట్టే ఆసిఫాబాద్ జిల్లా అయ్యింది. గతంలో వానాకాలం వచ్చిందంటే 'మంచం పట్టిన మన్యం' అని పత్రికల్లో వచ్చేది. ఇప్పుడు ఆసిఫాబాద్‌లో మెడికల్ కాలేజీ, వంద పడకలతో ఆస్పత్రి వచ్చాయి. ఆసిఫాబాద్‌లో 47వేలు, సిర్పూరులో 16 వేల మంది గిరిజనులకు పోడు పట్టాలిచ్చాం. గిరిజనేతరులకూ త్వరలో పట్టాలు ఇస్తాం. ఈ విషయంలో కేంద్రం అడ్డంకిగా మారింది.

ఆలోచించి ఓటు వేయండి

ఓటు వేసే ముందు ఎవరు గెలిస్తే మంచిదని ఆలోచించాలి. అభ్యర్థుల వెనుక ఉన్న పార్టీలను, వాటి నడవడికను విచారించి ఓటు వేయాలి. మీరు వేసే ఓటు వచ్చే ఐదేళ్లు మీ తలరాతను నిర్ణయిస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వానికి కులం, మతం లేదు. అందరినీ కలుపుకొని పోతున్నాం. ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నా.. బీఆర్ఎస్ కంటే ముందు ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పాలన చేసింది. ముస్లింల కోసం వాళ్లు రూ.900 కోట్లు ఖర్చు పెడితే.. మేం రూ.12 వేల కోట్లు ఖర్చు పెట్టాం. అన్నీ ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి..'' అని సీఎం కేసీఆర్ కోరారు. ఈ సభల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీలు దండే విఠల్, రఘోత్తంరెడ్డి, ఎంపీ వెంకటేశ్‌నేత, తదితరులు పాల్గొన్నారు. సీఎం సమక్షంలో పలువురు ఇతర పార్టీల నేతలు బీఆర్ఎస్‌లో చేరారు.

మరోసారి మొరాయించిన హెలికాప్టర్

సీఎం కేసీఆర్ పర్యటనల కోసం వినియోగిస్తున్న హెలికాప్టర్ మరోసారి మొరాయించింది. మూడు రోజుల కింద బీఆర్ఎస్ సభల కోసం బయలుదేరిన ఆయన హెలికాప్టర్‌లో సమస్య వల్ల ఫామ్‌హౌజ్‌కు వెనుదిరిగి.. మరో హెలికాప్టర్ తెప్పించుకుని వెళ్లిన విషయం తెలిసిందే. బుధవారం కాగజ్‌నగర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు హెలికాప్టర్‌లో వెళ్లిన సీఎం.. అది ముగిశాక ఆసిఫాబాద్‌కు వెళ్లడానికి సిద్ధమయ్యారు. కానీ హెలికాప్టర్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో రోడ్డు మార్గాన ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. ఇక్కడ సభ ముగిసేలోపు పైలట్ హెలికాప్టర్‌లో సాంకేతికలోపాన్ని సవరించి ఆసిఫాబాద్‌కు తీసుకొచ్చారు. దీంతో కేసీఆర్ హెలికాప్టర్‌లో బెల్లంపల్లి సభకు హాజరై, తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లారు.

రేపటితో నామినేషన్ల ముగింపు

- నేడు ఏకాదశి కావడంతో భారీగా దాఖలుకు అవకాశం
- గజ్వేల్, కామారెడ్డిలలో నామినేషన్ వేయనున్న సీఎం కేసీఆర్
- రేపు కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పోటీకి రేవంత్‌రెడ్డి నామినేషన్
- 13న నామినేషన్ల పరిశీలన.. 15 వరకు ఉపసంహరణ గడువు
- బరిలో ఉండే తుది అభ్యర్థుల పేర్లు అదే రోజు సాయంత్రం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల ఘట్టం శుక్రవారంతో ముగియనుంది. గురువారం ఏకాదశి సుముహూర్తం ఉండటంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేయనున్నారు. ఈ మేరకు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకున్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ఉదయం 11 గంటలకు గజ్వేల్ నియోజకవర్గంలో, మధ్యాహ్నం 2 గంటలకు కామారెడ్డి నియోజకవర్గంలో నామినేషన్లు వేస్తారని ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. అదే రోజున సాయంత్రం 4 గంటలకు కామారెడ్డిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగించనున్నారు. సిరిసిల్లలో మంత్రి కేటీఆర్, సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు కూడా గురువారమే నామినేషన్లు వేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం కేసీఆర్‌పై కామారెడ్డి స్థానంలో పోటీ చేసేందుకు టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ వేయనున్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌లలో కొన్ని సీట్లు పెండింగ్

ఇప్పటికే ప్రధాన పార్టీల్లోని కొందరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థులంతా ఖరారుకాగా.. బీజేపీ నుంచి ఇంకా 11 సీట్లకు, కాంగ్రెస్ పార్టీ నాలుగు సీట్లకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉంది. ఏ క్షణంలో అయినా అభ్యర్థులను ప్రకటిస్తారన్న ఆశతో ఆశావహులు ఉన్నారు. ఎంపికైనవారు వెంటనే నామినేషన్లు దాఖలు చేయాల్సి రానుంది. ఇక 13వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 15వ తేదీ వరకు ఉపసంహరణకు చాన్స్ ఉంటుంది. ఆ రోజున సాయంత్రం గడువు ముగియగానే.. అన్ని నియోజకవర్గాల్లో పోటీలో ఉండే అభ్యర్థులెవరో తేలిపోతుంది. నవంబర్ 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయి.

డీకే, పీకేలు వచ్చినా.. ఏకే 47లాంటి
కేసీఆర్‌ను ఏం చేయలేరు

మంత్రి హరీశ్‌రావు

- తెలంగాణను దెయ్యాలపాలు చేయొద్దు
- బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటవుతున్నాయ్


గజ్వేల్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీశ్

గజ్వేల్/అల్వాల్: బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఏకమవుతున్నాయని, పోరాడి సాధించుకున్న తెలంగాణను దెయ్యాలపాలు చేయొద్దని మంత్రి హరీశ్‌రావు ప్రజలను కోరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో గురువారం సీఎం కేసీఆర్ నామినేషన్ వేయనున్న నేపథ్యంలో బుధవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్ నుంచి హెలికాప్టర్‌లో గజ్వేల్‌కు వచ్చి నామినేషన్ వేసిన అనంతరం కామారెడ్డిలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు వెళ్తారని మంత్రి విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్ష పార్టీల తీరుపై విరుచుకుపడ్డారు. డీకే, పీకే (పవన్‌కల్యాణ్)లు వచ్చినంత మాత్రన ఏకే 47 లాంటి కేసీఆర్‌ను ఏం చేయలేరని అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటనతోతనకు అన్నం తినబుద్ధి కాలేదని చెప్పిన పవన్‌కల్యాణ్ బీజేపీ ముసుగులో, మరో పక్కకాంగ్రెస్‌పార్టీ ముసుగులో షర్మిల దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తమ రాష్ట్రంలో వ్యవసాయానికి 5గంటలే కరెంటు ఇస్తున్నామని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఒప్పుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో మంచితనానికి, రౌడీయిజానికి మధ్య పోటీ

మల్కాజిగిరిలో మంచితనానికి, రౌడీయిజానికి మధ్య పోటీ జరుగుతోందని, ఈ పోటీలో మంచితనమే గెలుస్తుందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని నేరేడ్‌మెట్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మంత్రి హరీశ్‌రావు.. మరో మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావుపై ఘాటు విమర్శలు చేశారు. మైనంపల్లి డబ్బు మైనాన్ని ఓటుతో కరిగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. హన్మంతరావు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. అయితే తాను ఆయనలా దిగజారి మాట్లాడదలుచుకోలేదన్నారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ ప్రశాంతంగా ఉందన్నారు. హైదరాబాద్ ఇలాగే ప్రశాంతంగా ఉండాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

డిసెంబర్ 9న రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం


ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ సభకు హాజరైన జనం

టికెట్ రానివారికి సముచిత స్థానం

'కాంగ్రెస్ టికెట్ రాని వారికి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తాం. ఎవరూ భావోద్వేగానికి లోను కావద్దు.. క్షణికావేశానికి గురికావద్దు.. మిమ్మల్ని కాపాడుకునే బాధ్యత నాది. దొరల తెలంగాణ కావాలో.. ప్రజల తెలంగాణ కావాలో ఓటర్లు తేల్చుకోవాలి. కేసీఆర్‌ను పొలిమేరలు దాటే వరకు తరమాలి..' అని రేవంత్ అన్నారు. ఖానాపూర్ అభ్యర్థి వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే రేఖానాయక్, ఆదిలాబాద్ అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

ఎందుకు వెళ్లలేదు? చర్యలు ఎందుకు తీసుకోలేదు? కేసీఆర్‌ను చూసి ప్రధాని మోదీ ఎందుకు భయపడుతున్నారు? కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా తెలంగాణకు వచ్చి మోదీ తొండను కూడా పట్టలేకపోయారు. కమీషన్ల కక్కుర్తితోనే మేడిగడ్డ కుంగిపోయింది.. అన్నారం పగిలిపోయింది.. సుందిళ్ల త్వరలో పోతుంది. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ రీడిజైన్ పేరుతో లక్ష కోట్లు దోచుకున్న దొంగ కేసీఆర్..'అని ఆరోపించారు.

గుజరాత్‌లో బీసీని సీఎం చేయాలి..: 'బీజేపీ పది రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఒక్క రాష్ట్రంలోనే బీసీని సీఎం చేసింది. నాలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముగ్గురు బీసీలను ముఖ్యమంత్రుల్ని చేసింది. తెలంగాణలో బీసీని సీఎం చేస్తామని చెబుతున్న మోదీ.. ముందు గుజరాత్‌లో బీసీని సీఎం చేయాలి. తెలంగాణలో బీజేపీకి వంద స్థానాల్లో డిపాజిట్లు కూడా రావు. కాంగ్రెస్‌లో కోట్లు ఉన్నోళ్లకే టిక్కెట్లు ఇస్తారని బీఆర్ఎస్ సన్నాసులు ప్రచారం చేస్తున్నారు. డబ్బులు లేకపోయినా ఖానాపూర్‌లో వెడ్మ బొజ్జుకు కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది కనిపించడం లేదా?..'అని రేవంత్ ప్రశ్నించారు.

ఆదివాసీ, లంబాడాల పంచాయితీ తెంచేస్తాం

'దళిత, గిరిజనులపై కాంగ్రెస్‌కు ఉన్న ప్రేమ ఇంకెవరికీ లేదు. లంబాడాలు, ఆదివాసీలు నాకు రెండు కళ్ల లాంటివారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వీరి మధ్య ఉన్న పంచాయతీ తెంచుతాం. పోడు భూములకు పట్టాలిచ్చి వాటిని అమ్ముకునే హక్కు కల్పిస్తాం. ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేసే బాధ్యత మాది. గిరిజనేతరుల భూములకు రక్షణ కల్పిస్తాం. కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఇస్తే పదేళ్లయినా ఈ ప్రభుత్వం వర్సిటీ ఏర్పాటు చేయలేదు. కేసీఆర్ ధన దాహానికి ప్రాణహిత–చేవెళ్ల బలైపోయింది. కడెం ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం కడితే.. ఈ ప్రభుత్వం దాని నిర్వహణ చూసుకోలేకపోతోంది..'అని విమర్శించారు.

కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా?

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు పునరావృతం.. కర్ణాటకలో కాంగ్రెస్ వచ్చింది.. అక్కడ కరెంట్ పోయింది..

తెలంగాణలో బీజేపీ ఖతమైంది.. ఇక కాంగ్రెస్‌తోనే పంచాయితీ

సంగారెడ్డిలో రోడ్‌షో, బహిరంగసభలో మంత్రి కేటీఆర్



సంగారెడ్డి సభకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కేటీఆర్. చిత్రంలో చింతా ప్రభాకర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ''కరెంట్ కావాలా.. కాంగ్రెస్ కావాలా..? తేల్చుకోండి.. కర్ణాటకలో కాంగ్రెస్ వచ్చింది.. అక్కడ కరెంట్ కష్టాలు మొదలయ్యాయి, మొసళ్లను సబ్‌స్టేషన్లలో వదిలి రైతులు నిరసన చేస్తున్నారు.. కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే.. అర్ధరాత్రి కరెంట్ కష్టాలు పునరావృతం అవుతాయి..''అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీ రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని గంజిమైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలంటున్నారని విమర్శించారు. కరెంట్ మీద మాట్లాడేందుకు కాంగ్రెస్‌కు ఇజ్జత్.. మానం ఉందా..? అని ప్రశ్నించారు.

తీగలు పట్టుకొని చూడండి

తెలంగాణలో కరెంట్ ఎక్కడుందంటున్న రేవంత్ రెడ్డి, జగ్గారెడ్డిలు తెలంగాణలో ఏ పల్లెకైనా పోయి విద్యుత్ తీగలు పట్టుకుని చూస్తే తెలుస్తుందన్నారు. ఒక్క చాన్స్ ఇవ్వాలంటున్న కాంగ్రెస్‌కు ఇప్పటికే 11 సార్లు 55 సంవత్సరాలు పాలించే అవకాశం వచ్చినా.. కనీసం కరెంట్, తాగునీరు, సాగునీరు ఇవ్వలేదని కేటీఆర్ నిప్పులు చెరిగారు. జల్సాలకు అలవాటు పడి మద్యం మత్తులో తల్లిదండ్రులను చంపిన యువకుడే.. తల్లిదండ్రులు లేని వాడినని, శిక్ష వేయకుండా వదిలేయాలని జడ్జిని వేడుకున్నట్టు కాంగ్రెస్ తీరు ఉందని చిన్న కథతో కేటీఆర్ వివరించారు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి క్రిమినల్ అని కేటీఆర్ నిందించారు. తెలంగాణలో బీజేపీ ఖతమైందని.. ఇక కాంగ్రెస్‌తోనే పంచాయితీ ఉందన్నారు.

కేసీఆర్ కర్ణాటక, మహారాష్ట్ర వస్తారనే భయం

తెలంగాణలో కేసీఆర్ మళ్లీ గెలిస్తే కర్ణాటక, మహారాష్ట్రలకు వెళ్లి అక్కడ పోటీకి వస్తారని కాంగ్రెస్, బీజేపీలకు భయం పట్టుకుందని కేటీఆర్ పేర్కొన్నా రు. అందుకోసమే బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు బీటీం అని మోదీ ఆరోపిస్తారని, బీజేపీకి బీటీం అని రాహుల్ ఆరోపిస్తున్నారని అన్నారు. రాహుల్, సోనియాలపై ఈడీ దాడులు జరిగినప్పటికీ వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు.

తెలంగాణ సింహం కేసీఆర్: తెలంగాణకు ఉన్న ఏకైక గొంతుక కేసీఆర్ అని.. ఆ గొంతును నొక్కేందుకు మోదీ, అమిత్‌షా, రాహుల్‌గాంధీ, ఖర్గే, సోనియా వంటి నాయకులు వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ సింహం కేసీఆర్ అని.. సింహం సింగిల్‌గానే వస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో 90 నుంచి వంద సీట్లు బీఆర్ఎస్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతానికి మౌనంగా ఉంటా

అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అబ్రహం



అలంపూర్: ప్రస్తుతానికి రాజకీయాల్లో మౌనంగా ఉంటానని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధిష్టానం తనను అభ్యర్థిగా ప్రకటించి, బీఫాం మరొకరికి ఇవ్వడంపై ఆయన స్పందించారు. పార్టీ తనకు తీరని అన్యాయం చేసిందని, అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత బీఫాం అనామకుడికి ఇవ్వడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని అన్నారు. 22 రోజులుగా బీఫాం ఇవ్వకపోవడంతో తాను.. తన కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైనట్లు చెప్పారు. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి ఏ పార్టీలో చేరడం లేదని స్పష్టం చేశారు. కాగా, ఎస్సీ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా పెత్తనం ఏమిటని, ఆయన బలం ఉన్న నాయకుడే కాదని అబ్రహం ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ చల్లా, ప్రస్తుతం బీఫాం తీసుకున్న వ్యక్తి ఏనాడైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 22 ఏళ్ల వైద్యుడిగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేశానని, ఓడిపోయినా ప్రజల మధ్యే ఉన్నానని గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం సేవ చేస్తూనే పార్టీ అభివృద్ధికి పాటుపడితే.. చివరికి బీఫాం ఇవ్వకుండా మోసం చేశారని, అదేదో అభ్యర్థిగా ప్రకటించకుండా ఉంటే బాగుండేదని అసహనం వెలిబుచ్చారు.

బీఆర్ఎస్ సర్కారుతోనే పారిశ్రామిక అభివృద్ధి

▶ మొదటి పేజీ తరువాయి

రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామని.. 147 టీఎంసీల నీరు లభ్యతగా ఉండేలా ప్లాన్ చేశామని చెప్పారు. రూ.80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించడం శోచనీయమన్నారు. మేడిగడ్డ బ్యారేజీ ఖర్చు రూ.1,839 కోట్లు అని.. అందులో రెండు పిల్లర్లు కుంగితే లక్ష కోట్లు మునిగినట్టు ప్రచారం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రాజెక్టులకు ఇంజనీరింగ్ సమస్యలు సాధారణమేనని చెప్పారు.

స్థిరమైన ప్రభుత్వంతోనే అభివృద్ధి

సమర్థవంతమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వంతోనే రాష్ట్రం పురోగతి సాధిస్తుందని.. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర సాధించిన ప్రగతి దీనికి నిదర్శన మని కేటీఆర్ చెప్పారు. స్థిరమైన ప్రభుత్వం ఉండటం వల్లే ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడికి పరిశ్రమలు వస్తున్నాయని.. ప్రభుత్వంలో స్థిరత్వం లేకపోతే ముందుగా దెబ్బతినేది పరిశ్రమలేనని పేర్కొన్నారు. రాష్ట్రానికి వచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసే పరిశ్రమలకు భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహకాలు కల్పించడంతోపాటు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితులను తెచ్చామన్నారు. హైదరాబాద్ శివార్లతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ స్థాయి కంపెనీలు కూడా ముందుకు వచ్చాయని వివరించారు. తాను పూర్తి రాజకీయ నాయకుడిగా పారిశ్రామికవేత్తల మద్దతు కోసం ఈ సమావేశానికి వచ్చామన్నారు. రాష్ట్రంలో వేరేవాళ్లు అధికారంలోకి వస్తే వారు ప్రతిదానికి ఢిల్లీ వెళ్లి పర్మిషన్ తీసుకోవాలని, అన్ని రకాలుగా మెప్పించాల్సి వస్తుందని పేర్కొన్నారు. నాడు విద్యుత్ సమస్య ఎంత తీవ్రంగా ఉండేదో అందరికీ తెలుసని, ఇప్పుడు 10 నిమిషాలు కూడా కరెంట్ పోతే తట్టుకోలేని స్థితికి వచ్చామని చెప్పారు. 2014కు ముందు హైదరాబాద్ శివార్లలో 14 రోజులకోసారి మంచినీళ్లు ఇచ్చేవారని.. ఇప్పుడు రోజూ వస్తున్నాయని తెలిపారు. రోజుకు 24 గంటలు నీళ్లు ఇవ్వాలనేది తమ ఆలోచన అని వివరించారు. ఈ సమావేశంలో సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రేవంత్ భాష అభ్యంతరకరం: జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వాడుతున్న భాష అత్యంత అభ్యంతరకరంగా ఉందని మంత్రి జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి ,చిరుమర్తి లింగయ్యతో కలిసి బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో రాజకీయాలు ఇంతగా దిగజారడం బాధాకరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడే మాటలను చూస్తే ఒక నాయకుడు మాట్లాడే మాటలు ఇవేనా అనిపిస్తుందన్నారు. కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను, వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, కాంగ్రెస్ పార్టీ యువతను మోసం చేస్తోందని, కాంగ్రెస్ నోటికొచ్చిన అబద్ధాలు ప్రచారం చేస్తుందన్నారు. జానారెడ్డి, ఉత్తమ్, శ్రీధర్ బాబు, భట్టి చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, మీరు ఏరికోరి తెచ్చుకున్న పీసీసీ చీఫ్ ఇలా మాట్లాడితే సమర్థిస్తారా? అని ప్రశ్నించారు.

డీఏ విడుదలకు అనుమతించాలి: టీఎన్జీవో



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ కరవు భత్యం (డీఏ) విడుదలకు ఎన్నికల కమిషన్ అనుమతించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం కోరింది. ఈమేరకు సంఘం నేతలు బుధవారం ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్ రాజ్‌కు వినతిపత్రం అందించారు. దీపావళి పండుగను దృష్టిలో ఉంచు కుని తమ పట్ల సానుకూలంగా స్పందించాల ని సంఘం నేతలు కోరారు. ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వాళ్లలో టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేని, కేంద్ర సంఘ ప్రతినిధి పర్వతాలు తదితరులు ఉన్నారు.

కేసీఆర్‌పై గజ్వేల్ చెరుకు రైతుల పోటీ



మల్లాపూర్(కోరుట్ల): నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలన్న డిమాండ్‌తో కేసీఆర్‌పై పోటీ చేసేందుకు జగిత్యాల జిల్లా మల్లాపూర్‌కు చెందిన చెరుకు రైతులు గజ్వేల్‌కు బయల్దేరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఏకైక వ్యవసాధారిత పరిశ్రమ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలంటూ చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సంఘం డైరెక్టర్ న్యావనంది లింబారెడ్డి, రైతు ఉద్యమ నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు నామినేషన్ పత్రాల తో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ముత్యంపేట నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మూతపడిందన్నారు. సీఎం కేసీఆర్‌తోపాటు బీజేపీ ఎంపీ అర్వింద్ కూడా మాట ఇచ్చి విస్మరించారని విమర్శించారు.

బీఎస్పీలో చేరిన రేపల్లె ప్రసన్నకుమార్

సాక్షి, హైదరాబాద్: పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రేపల్లె ప్రసన్న కుమార్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. ఆయన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌కు స్వయాన తమ్ముడు. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా ప్రసన్నకుమార్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు బీఎస్పీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆలంపూర్ నియోజకవర్గం పార్టీ టికెట్‌ను ప్రసన్నకుమార్‌కు ప్రవీణ్ ప్రకటించారు. గురువారం ఆయన అలంపూర్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ తెలిపారు.

ఇదండీ సంగతి



గెలుస్తావో లేదో అని చెప్పకుండా పిట్ట ఎగిరిపోయిందంటే నీ డిపాజిట్ గల్లంతేమో!

'కాళేశ్వరం.. వరల్డ్ బ్లండర్'

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం 40 డిజైన్లతో చేసిన ప్రాజెక్ట్ కాదని, ఫాల్ట్ ఎస్టిమేట్‌తో, ఫాల్ట్ డిజైన్లతో చేశారు. అది వరల్డ్ వండర్ కాదు..వరల్డ్ బ్లండర్ అని మాజీ డీజీపీ, బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణ ప్రసాద్ అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటుతో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలలో నీటిని వదిలేశారని, వీటికి ఎప్పుడు రిపేర్ చేసి నీళ్ల ఇస్తారో రైతులకు సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పిల్లర్ల కుంగుబాటుతో మొత్తం 10 టీఎంసీల నీటిని వృథాగా వదిలేయడంతో ఇప్పుడు పంటలకు చుక్క నీరందించే పరిస్థితి లేదని ఆందోళన వెలిబుచ్చారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాజెక్టుల పేరుతో రూ.5 లక్షల కోట్లు అప్పుచేయడంతో ఈ భారం అందరిపై ప్రతీ ఏడాది లక్ష అప్పుగా పడుతోందన్నారు.

'గాంధీ'లో అందుబాటులో ఫ్రీజర్స్

హైకోర్టుకు ఆస్పత్రి సూపరింటిండెంట్ అఫిడవిట్ సమర్పణ



సాక్షి, హైదరాబాద్: గాంధీ ఆస్పత్రిలో ఫ్రీజర్‌బాక్సులు అందుబాటులో లేవన్న సమస్యే ఉత్పన్నం కాదని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నందున సాంకేతిక సమస్యలు కూడా తలెత్తవని ప్రస్తుతం ఆస్పత్రిలో 62 ఫ్రీజర్ బాక్సులున్నాయని ఆస్పత్రి సూపరింటిండెంట్ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. గాంధీ ఆస్పత్రిలో కోల్డ్ స్టోరేజీ బాక్సులు అందుబాటులో లేకపోవడంతో మార్చురీలో మృతదేహాలు కుళ్లిపోతున్నాయని ఓ పత్రికలో ప్రచురితమైన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా...' గాంధీ ఆస్పత్రిలో ప్రస్తుతం 62 ఫ్రీజర్ బాక్సులున్నాయి. రోజుకు 15 నుంచి 20 మృతదేహాలు ఆస్పత్రికి వస్తాయి. ఇందులో 3 నుంచి 4 గుర్తుతెలియనివి ఉంటాయి. నిబంధనల మేరకు అన్ని చర్యలు తీసుకున్న తర్వాత గుర్తించిన మృతదేహాలను బంధువులకు అందజేస్తారు. గుర్తు తెలియని వాటిని 72 గంటల పాటు ఫ్రీజర్‌లో భద్రపరిచి ఆ తర్వాత పోస్టుమార్టం నిర్వహించి.. మున్సిపాలిటీ అధికారులకు అందజేస్తారు. వారు నిబంధనల మేరకు అంత్యక్రియలు నిర్వహిస్తారు. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం రాత్రి సమయాల్లోనూ అవసరమైతే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. పలు కారణాల రీత్యా వ్యక్తి మృతిచెందిన రోజే పోస్టుమార్టం సాధ్యం కాదు. 60 బాక్సులకు 25 మాత్రమే పని చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనం అవాస్తవం'అని ఆస్పత్రి సూపరింటిండెంట్ ధర్మాసనానికి సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఆస్పత్రి సూపరింటిండెంట్ సమర్పించిన అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం..ఫ్రీజర్స్ అందుబాటులో ఉన్నందున విచారణ అవసరం లేదని అభిప్రాయపడింది.



సమృద్ధి అనేది... ఆఖరికి మంచి విషయాలకైనా సరే, విలువ ఇవ్వడాన్ని నిరోధిస్తుంది.
- మిగెల్ డె సెర్వాంటిస్

సాక్షి
గురువారం, 9 నవంబర్ 2023

ఈ నరమేధం ఆగాలి!

నెల దాటిపోయినా, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి వ్యవహారానికి ముగింపు కనిపించడం లేదు. గాజా భూఖండంపై భూతల దాడిని ఇజ్రాయెల్ ముమ్మరం చేయడంతో మారణహోమం ముమ్మరమవుతోంది. ఆ ప్రాంతమంతటినీ నిర్జనవాసంగా మార్చేంత వరకు నెతన్యాహూ నిద్ర పోయేలా లేరు. పైపెచ్చు, గాజా ప్రాంతపు భద్రత బాధ్యత ఇకపై తమదేనంటూ ఇజ్రాయెల్ ప్రధాని సోమవారం మరో బాంబు పేల్చారు. దాని భావమేమిటో ఆయన విడమరిచి చెప్పనప్పటికీ, గాజాను తన హస్తాల్లో బిగించనున్నట్టు అర్థమవుతూనే ఉంది. గాజాను పునరాక్రమించుకోవడం, లేదంటే కనీసం 2005 సెప్టెంబర్ ముందు లాగా గాజా అంతటా తమ సైన్యమే ఉండేలా చూసుకోవడం ఇజ్రాయెల్ మనసులో మాటగా కనిపిస్తోంది. అదేమీ లేదని నెతన్యాహూ సహచరులు పైకి చెబుతున్నా, ఆ మాటలను నమ్మడం కష్టమే.

సాక్షాత్తూ అమెరికా సైతం తనతో సహా పశ్చిమ దేశాలన్నీ తీవ్రవాద సంస్థగా భావిస్తున్న హమాస్‌తో రేపెప్పుడో యుద్ధం ముగిశాక గాజాను ఇజ్రాయెల్ పునరాక్రమించుకోరాదంటూ బుధవారం హెచ్చరించాల్సి వచ్చింది. అదే సమయంలో గాజాలో హమాస్ పాలన కొనసాగరాదనీ, అదే జరిగితే మళ్ళీ మొన్న అక్టోబర్ 7 తరహా దాడులు పునరావృతం కావచ్చనీ అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సన్నాయినొక్కు నొక్కారు. గాజా దిగ్బంధనం, భూభాగాన్ని తగ్గించడం, బలవంతాన జనాన్ని ఖాళీ చేయించడం లాంటివేమీ చేయరాదనీ, వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్ అథారిటీ పాలన సాగించాలనీ అన్నారు. హమాస్‌ను నిర్వీర్యం చేయడమే లక్ష్యమని పైకి చెబుతున్నప్పటికీ, ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న ధోరణి చూస్తే అలా అనిపించడం లేదు.

సరిహద్దులు దాటి హమాస్ చేసిన అక్టోబర్ 7 నాటి దాడిలో ఇజ్రాయెల్‌లో 1400 మంది ప్రాణాలు కోల్పోగా, 240 మంది దాకా బందీలయ్యారు. ఇజ్రాయెల్ నెల రోజుల పైగా సాగిస్తున్న ప్రతీకార దాడిలో ఇప్పటికి 11 వేల మంది దాకా ప్రాణాలు కోల్పోయారని లెక్క. దాడికి ప్రతిదాడిగా మొదలై, తీవ్రవాదం పేరు చెప్పి, అమాయక ప్రజలు సహా అందరినీ కబళిస్తున్న యుద్ధం ఆందోళన కలిగిస్తోంది. పొరుగున ఉన్న భూఖండంలో నరమానవుడు మిగలకుండా నేలమట్టం చేయాలన్న ఇజ్రాయెల్ దుందుడుకుతనం తీవ్రమైనది. ఇదే దూకుడు కొనసాగితే... అప్పుడిక పాలస్తీనా పక్షాన ఇరాన్ తదితర దేశాలు నేరుగా బరిలోకి దిగితే... పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు.

దేశదేశాల ప్రపంచ వేదిక ఐక్యరాజ్య సమితి (ఐరాస)లో మెజారిటీ దేశాలు శాంతిస్థాపన వైపు మొగ్గి, యుద్ధ విరమణకు తీర్మానం చేయకపోలేదు. అయితే, ఆ శాంతి వచనాలను పట్టించుకున్న నాథుడు లేడు. ఆ తీర్మానాన్ని అమలు చేసేందుకు సమకట్టాల్సిన అగ్రదేశాల్లో అధికభాగం ఈ యుద్ధంలో ఏదో ఒక పక్షం వెనుక పరోక్షంగానైనా నిలబడడం పెద్ద సమస్య. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆ మధ్య అన్నట్టు... ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి ఉన్నట్టుండి ఏ శూన్యం నుంచో జరగలేదు. అదే సమయంలో ఆయనే వ్యాఖ్యానించినట్టు... పాలస్తీనియన్ల కష్టాలు, కన్నీళ్ళకు పరిష్కారం ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన భయానక దాడి కూడా కాదు. నాణానికి ఉన్న ఈ రెండు వైపులనూ సమగ్రంగా చూడగలిగితేనే ప్రపంచ దేశాలు ఈ సంక్లిష్ట సమస్యకు సరైన జవాబు ఆలోచించగలవు.

అసలు తాజా పరిణామాలకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ బాధ్యత కూడా చాలానే ఉంది. అక్టోబర్ 7 హమాస్ దాడికి దారితీసిన ఇజ్రాయెల్ గూఢచర్య వైఫల్యానికీ, అసలు హమాస్ తీవ్రవాదం పెచ్చరిల్లడానికీ, నెల రోజులుగా పాలస్తీనా - ఇజ్రాయెల్‌లలో సాగుతున్న ప్రాణనష్టానికీ ఆయనే బాధ్యుడని సొంత పౌరులే తప్పుబడుతున్నారు. ఇజ్రాయెల్ రాజకీయాల్లోని అస్థిరత సైతం గడచిన కొన్ని వారాల పరిస్థితికి పాక్షికంగా కారణమే. వాటి నుంచి దృష్టి మరల్చడానికే అన్నట్టుంది నెతన్యాహూ వ్యవహారం. హమాస్‌కు అడ్డాలుగా మారాయంటూ, ఆయన ఆస్పత్రులపై బాంబులు వేయించారు. చివరకు నిరాశ్రయులైన పాలస్తీనీయులకు ఆశ్రయమిస్తున్న గాజాలోని అతి ప్రాచీన గ్రీకు ఆర్థొడాక్స్ చర్చినీ వదల్లేదు. గాజాలోని నివాస వసతుల్లో దాదాపు సగానికి పైగా దాడుల్లో నేలమట్టమైన పరిస్థితి. హమాస్ పేరిట సామాన్యులపై సాగుతున్న ఈ అసాధారణ యుద్ధ నేరంపై సహజంగానే నిరసన తలెత్తింది. ఇజ్రాయెల్ పక్షీయులతో సహా అన్ని దేశాలపై ఇప్పుడు తక్షణ కాల్పుల విరమణకు అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది.

జీ-7 దేశాల విదేశాంగ మంత్రులు తమ తాజా సమావేశంలో శాశ్వత యుద్ధ విరమణ ఊసెత్తకుండా, అమాయక పాలస్తీనా పౌరులకు సాయం అందించడానికి వీలుగా మానవతా దృక్పథంతో దాడులకు విరామాలు ఇవ్వాలని కోరారు. విస్తృత శాంతి ప్రక్రియకు పూనుకోవాలని మాత్రం అనగలిగారు. ఇవి కంటితుడుపు మాటలే. గాజాలో నరమేధాన్ని మౌనంగా చూస్తున్న ప్రపంచ మానవాళి మొత్తం సమష్టి బాధ్యత వహించాల్సిందే. ఎవరి అంతరాత్మకు వారు జవాబు చెప్పుకోవాల్సిందే. రోజూ 160 మంది పాలస్తీనా పసివాళ్ళ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా ఒక పోరులో పదుల సంఖ్యలో జర్నలిస్టులు అసువులు బాశారు. గాజాలో తిండి, నీరు లేక, ఎక్కడికి వెళ్ళాలో తెలియక విలపిస్తూ, ఆత్మీయుల మృతదేహాలను గుర్రపుబండ్లల్లో తీసుకెళుతున్న దృశ్యాల్ని చూసి మనసు కరగనివారు మనుషులు కారు. ఇది త్రాసులో తప్పొప్పుల లెక్కలు తేల్చే తరుణం కాదు. అన్నెం పున్నెం ఎరుగని పిల్లల్నీ, అమాయకుల్నీ ఈ మతి లేని మహా విధ్వంసం నుంచి కాపాడాల్సిన సమయం. చిన్నారుల మరుభూమిగా మారుతున్న గాజా మరింత విధ్వంసంలోకి జారిపోక ముందే యుద్ధానికి తెర దించడం అత్యవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ఏకాదశి ఉ.9.32 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.9.45 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.34 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.08 వరకు, **అమృత ఘడియలు:** ప.1.50 నుండి 3.36 వరకు, మతత్రయ ఏకాదశి.

సూర్యోదయం : 6.05
సూర్యాస్తమయం: 5.23
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

శాస్త్ర విజ్ఞానంలోనూ రాజకీయాలా?

విశ్లేషణ



దినేశ్ శర్మ

దేశంలో గడచిన దశాబ్దాల్లో అంతరిక్షం, అణుశక్తి, వాతావరణం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచారు. రాజకీయ నేతలు కూడా ఈ విషయంలో ఆరోగ్యకరమైన, స్పష్టమైన విభజనను పాటించారు. అయితే రాజకీయ మద్దతుకూ, సైన్స్‌ను రాజకీయం చేయడానికీ మధ్య చాలా తేడా ఉంది. శాస్త్ర పరిశోధనలకు కావాల్సినన్ని నిధులు సమకూర్చేందుకు రాజకీయ వర్గాల మద్దతు అవసరం. దేశ విస్తృత ప్రయోజనాలు, లక్ష్యాలు, ఆర్థిక వృద్ధికీ, పరిశోధనలకూ మధ్య పొంతన కుదరాలన్నా ఇది అవసరమే. కానీ చంద్రయాన్ -3 విజయం 2014 తరువాతి ఘనతగా కీర్తించడం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ దశాబ్దాలుగా విజయవంతంగా అనుసరిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ పద్ధతులను అవమానించడమే!


దేశంలోని చాలా శాస్త్రీయ సంస్థలు, పరిశోధన సంస్థలు ఇటీవలి కాలంలో 'సెల్ఫీ పాయింట్'లు ఏర్పాటు చేశాయి. ఇక్కడ సందర్శకులు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయొచ్చు. ఇన్‌స్టాగ్రామ్ రీళ్లు, ఫేస్‌బుక్ స్టోరీల కాలంలో ప్రభుత్వ సంస్థలు ఇలాంటి గిమ్మిక్కులకు తెగబడటం ఎక్కువైంది. అయితే పరిశోధన సంస్థల విషయంలో ఉద్దేశం వేరు. సెల్ఫీ కేంద్రాలను ఒక నిర్దిష్ట శైలిలో నిర్మించాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రతిదాంట్లో ప్రధాని ఛాయాచిత్రం ఒకపక్క, ఆ సంస్థ విజయాలు ఇంకోపక్క ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశారు.

ప్రాథమిక జ్ఞానం ఉన్నవారికి కూడా దీని వెనుక మతలబు ఏమిటో అర్థం అవుతుంది. ఆయా సంస్థల విజయాలు ఒక వ్యక్తి దయాదాక్షిణ్యాలని పరోక్షంగా చెప్పే ప్రయత్నం ఇది. శాస్త్రీయ పరిశోధన సంస్థలు కూడా సులభంగా ఇందుకు అంగీకరించడం ఆశ్చర్యకరమైన విషయం కాదు. కొందరు ఇంకో అడుగు ముందుకేసి చిన్న పోస్టర్ల స్థానంలో పెద్ద పెద్ద కటౌట్లు పెట్టేశారు.

భారతీయ సైన్స్‌కు ప్రధాని దైవదూత అన్న మాదిరిగా సందేశాలివ్వడం కేవలం సెల్ఫీ పాయింట్లకే పరిమితం కాలేదు. వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్, సైంటిఫిక్ ల్యాబ్స్‌తోపాటు పాఠ్య పుస్తకాల్లోకీ చేరుతోంది. 'ఎన్సీఈఆర్టీ' గత నెలలో విడుదల చేసిన 'చంద్రయాన్ ఉత్సవ' పుస్తక శ్రేణిలోనూ ఇది కనిపించింది. పది పుస్తకాలతో కూడిన ఇవి వేర్వేరు తరగతులకు ఉద్దేశించారు. అన్నింటిలోనూ ప్రధాన ఇతివృత్తం చంద్రయాన్-3 విజయానికి ప్రధాన సూత్రధారి ప్రధాని అని చూపడమే. అది కూడా 2019 నాటి చంద్రయాన్-2 వైఫల్యం తరువాత! సెకండరీ స్టేజ్ (కోడ్ 1.4ఎస్)లో 'గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వ లక్షణాల ఫలితంగానే చంద్రయాన్ -3 విజయం సాధించింది' అని స్పష్టంగా చెప్పారు. చంద్రయాన్-2 పాక్షిక విజయంపై విశదీకరిస్తూ... 'వనరులు, శ్రమ, డబ్బు నష్టపోయినా ప్రధాని నిరుత్సాహ పడలేదు. బదులుగా మరింత ఆత్మవిశ్వాసంతో ఇస్రో శాస్త్రవేత్తలు, ప్రజలను చైతన్యవంతులను చేశారు. సరికొత్త దార్శనికత ప్రదర్శించారు' అని రాశారు. ఇందులో ప్రధాని ప్రస్తావన తొమ్మిది సార్లుంది. కానీ 2008లో చంద్రయాన్-1 ద్వారా జాబిల్లిపై నీటి ఉనికిని మొదటిసారిగా గుర్తించిన కీలకమైన విషయాన్ని మాత్రం విస్మరించారు.

ఆత్మ విశ్వాసానికి దెబ్బ...

చంద్రయాన్-3 విజయం 2014 తరువాతి ఘనతగా కీర్తించడం భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ దశాబ్దాలుగా విజయవంతంగా అనుసరిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ పద్ధతులను అవమానించడమే. ఓ ప్రాజెక్టు విజయానికి రాజకీయ నేతలను కర్తలుగా చేస్తూ పొగడటం సైన్స్‌ను రాజకీయం చేయడమే అవుతుంది. రాజకీయ మద్దతుకూ,



సైన్స్‌ను రాజకీయం చేయడానికీ మధ్య చాలా తేడా ఉంది. శాస్త్ర పరిశోధనలకు కావాల్సినన్ని నిధులు సమకూర్చుకునేందుకు రాజకీయ వర్గాల మద్దతు అవసరం. దేశ విస్తృత ప్రయోజనాలు, లక్ష్యాలు, ఆర్థిక వృద్ధికీ, పరిశోధనలకూ మధ్య పొంతన కుదరాలన్నా ఇది అవసరమే. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్వయంగా దేశ శాస్త్ర పరిశోధన రంగాల తీరుతెన్నులను పర్యవేక్షించారు. సైన్స్‌లో పెట్టుబడుల ఆవశ్యకత గురించి అటు ప్రజలకు, ఇటు అధికారులకు, పార్లమెంటేరియన్లకు అర్థమయ్యేందుకు కృషి చేశారు. ఇవన్నీ ఆయన వెసులుబాటు కల్పించే వాడిగా చేశారు కానీ, నేరుగా పరిశోధన కౌన్సిళ్ల వ్యవహారాల్లో తలదూర్చలేదు.

గడచిన కొన్ని దశాబ్దాల్లోనూ అంతరిక్షం, అణుశక్తి, వాతావరణం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచారు. రాజకీయ నేతలు కూడా ఆరోగ్యకరమైన, స్పష్టమైన విభజనను పాటించారు. శ్రీహరికోట నుంచి జరిగిన ముఖ్యమైన ప్రయోగాల్లో అప్పట్లో ప్రధాని రాజీవ్ గాంధీ రాజకీయంగా బద్ధ శత్రువైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావును వేదిక పైకి ఆహ్వానించిన విషయం గుర్తుచేసుకోవాలి. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా చంద్రయాన్-1 ఆలోచన రూపుదిద్దుకుంది. కానీ పలు పార్లమెంటరీ కమిటీల్లో దీనిపై చర్చలు జరిగిన తరువాత గానీ ఆమోదించలేదు. తన పంద్రాగస్టు ప్రసంగంలో వాజ్‌పేయి చంద్రయాన్-1 గురించి తొలిసారి ప్రకటించారు. ఇస్రో ఈ ప్రాజెక్టుకు సోమయాన్ అని పేరు పెడితే వాజ్‌పేయి దాన్ని చంద్రయాన్ అని మార్చారు. అయితే దీన్ని ఎప్పుడూ ఆయన తన వ్యక్తిగత విజయంగా చెప్పుకోలేదు. భారత్- అమెరికా అణు ఒప్పందం తుది దశ చర్చల వివరాలు ప్రతిపక్షాలకూ అందించేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తన సీనియర్ సలహాదారును నియమించారు. అలాగే ప్రతిపక్ష పార్టీల పార్లమెంటు సభ్యులను వాతావరణ మార్పులపై జరిగే సదస్సులకు హాజరయ్యే ప్రతినిధి బృందాల్లో భాగస్వాములను చేశారు.

జోక్యంతో ప్రమాదం...

శాస్త్ర పరిశోధనల విషయంలో రాజకీయాలు ప్రమాదకరం. కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖల మంత్రి జితేంద్ర సింగ్ పలు మార్లు తన బాస్ అయిన ప్రధాని మోదీ నేతృత్వం కారణంగానే 2014 తరువాత శాస్త్ర రంగంలో అనేక విజయాలు నమోదయ్యాయని పదేపదే చెప్పుకొన్నారు. ఇదే ఇప్పుడు ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లోనూ వ్యక్తమైంది. ఇలాంటి ప్రకటనలు ఏళ్లుగా పని చేస్తున్న శాస్త్రవేత్తల నిబద్ధతను తక్కువ చేసి చూపుతాయి. చంద్రయాన్ -1 ఆలోచనకు బీజం 1999లో పడితే వాస్తవరూపం దాల్చింది 2008లో. దీని తరువాత చేపట్టిన ప్రయోగాలు... ఉదాహరణకు చంద్రయాన్ -3, ఆదిత్య ఎల్-1 కూడా 2014కు ముందే మొదలైనవి. వీటి విజయాలకు 2014 తరువాతి రాజకీయ నేతృత్వం కారణమని చెప్పుకోవడం అత్యంత కచ్చితత్వంతో ఎంతోకాలంగా విజయవంతంగా ఇస్రో అమలు చేస్తున్న ప్రాజెక్ట్ ప్లానింగ్, మేనేజ్‌మెంట్ వ్యవస్థలను అవమానించడమే. 2014 కంటే ముందు ప్రయోగించిన ఉపగ్రహాల సంఖ్యను, తరువాతి సంఖ్యను పోల్చడం కూడా సరికాదు. 2014 తరువాత ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాల్లో అత్యధికం మైక్రో శాటిలైట్ల మార్కెట్ పెరగడం పుణ్యంగా వచ్చినవి అని గుర్తుంచుకోవాలి.

ఇంకో విషయం... సైన్స్ విషయాల్లో రాజకీయ జోక్యం పరిశోధన సంస్థల స్వతంత్రత తగ్గిపోయేందుకూ కారణమవుతుంది. ఇది కేంద్రీకృత నిర్ణయాల అమలును ప్రోత్సహిస్తుంది. పరిశోధనల దిశను మారుస్తుంది. శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఇప్పుడు కేటాయిస్తున్న నిధులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇలాంటి చర్యల వల్ల రాజకీయ సిద్ధాంతాలకు నప్పని శాస్త్రీయ పరిశోధనల ఫలితాలను తొక్కిపెట్టడం వంటివి జరగొచ్చు. జోషీమఠ్‌కు సంబంధించిన ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఇస్రో తన వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి రావడం గమనించాలి. సైన్స్ అవార్డులను ప్రస్తుత గవర్నమెంటు రద్దు చేసింది. గుట్టుచప్పుడు కాకుండా అనేక పరిశోధన కేంద్రాలను కూడా మూసేసింది. ఫ్యామిలీ హెల్త్ సర్వేల ఇన్‌ఛార్జ్ శాస్త్రవేత్తను ఇటీవలే సస్పెండ్ చేసి, రాజీనామా చేసేలా చేశారు. జన్యుమార్పిడి పంటల విషయంలో గతంలో స్వతంత్రంగా వ్యవహరించిన 'ద ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ' కూడా ఇప్పుడు సెల్ఫీ పాయింట్ల ఏర్పాటుకు సంతోషంగా అంగీకరిస్తోంది. ఎగిరే యంత్రాల విషయంలో భారతీయుల జ్ఞానానికి డాక్యుమెంటరీ రుజువుగా వైమానిక శాస్త్రాన్ని ఎన్సీఈఆర్టీ ప్రస్తావిస్తే శాస్త్రవేత్తలు నోరెత్తకుండా ఉన్నారు. ఇవన్నీ సైన్స్ పురోగతికి ఏమాత్రం మేలు చేసేవి కావు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ది ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

భయమే!



జూలియన్ అసాంజ్ ఒక రాజకీయ నేరస్థుడు. ఆయన రాజకీయ నేరస్థుడిగా ఉన్న ఒకే ఒక్క కారణం... ఆయన మాట్లాడే విషయాలకు వైట్‌హౌస్ (యూఎస్) భయపడటమే!

- ఎడ్వర్డ్ స్నోడెన్, యాక్టివిస్ట్

కొత్త నిర్వచనం



పరిశోధన అంటే... ధనం గురించో, కీర్తి గురించో, మన భావానికి ఒప్పుదల తెచ్చుకోవడం గురించో కాదు. చదవకపోయినా రిటైర్ అయ్యేవరకు వీలైనన్ని పీడీఎఫ్‌లు డౌన్‌లోడ్ చేసిపెట్టుకోవడం!

- నీల్ రెనిక్, పరిశోధకుడు

జనమే పూనుకోవాలి



జరుగుతున్న ఈ పిచ్చితనం మొత్తంలో ఒక్క విషయం గురించైతే నేను నిశ్చయంగా చెప్పగలను. 'ఒకవేళ' ఎప్పటికైనా శాంతి అంటూ వస్తే, అది రెండు సమాజాల్లోని కింది నుంచి పై (బాటమ్ అప్) వ్యవస్థలోని అత్యుత్తమ మనుషుల ద్వారా వస్తుంది. మన పాత, అవినీతిమయ, స్వార్థ, స్వానురక్త 'నాయకులు' ఎప్పటికీ శాంతిని తేలేరు. ఆ బాధ్యత మన మీదే ఉంది.

- ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

పట్టుకుని వేలాడతాం!



చైనీయులు, భారతీయులు, అరబ్బులు వలసవాదం అనుభవించారు. అయినా వాళ్లు బ్రిటిష్ సంస్కృతిని తిరస్కరించారు. ఒక్క ఆఫ్రికన్లు మాత్రమే విదేశీ సంస్కృతులను రక్షించడానికి తమ జీవితాలను త్యాగం చేస్తారు.

- అడేమోలా, పాన్-ఆఫ్రికనిస్ట్

ఇంత కపటమా?



ప్రపంచంలో అత్యంత కపట మనుషులం మనమే. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా ఉండటంలో మనకేమీ సిగ్గుండదు. కానీ ఒక ముఖ్యమంత్రి(నితీశ్ కుమార్) బహిరంగంగా కుటుంబ నియంత్రణ చర్యల గురించి మాట్లాడితే మాత్రం సిగ్గుపడతాం.

- సంజయ్ ఘోష్, న్యాయవాది

అది అసభ్యం



ఆయన (బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్) బయటికి మాట్లాడటం కాదు, శాసనసభలో అసభ్యంగా మాట్లాడారు. అది కూడా గుమికూడిన మగ సభ్యుల నవ్వులను స్పష్టంగా మనసులో ఉంచుకున్నారు. దాన్నే శాస్త్రీయ భాషలో అసభ్యతకు తావు లేకుండా చెప్పొచ్చు. ఇలాంటి భాష వల్ల అక్కడ కూర్చున్న మహిళలు సౌకర్యంగా ఉండగలరా?

- అమీత్ దత్తా, న్యాయవాది

ఖండించకూడదా?



యూఏఈ మంత్రి రీమ్ అల్-హాషిమి మీద 'ఫ్రీ పాలస్తీనా' కార్యకర్తలు బురదజల్లే ప్రచారం చేస్తున్నారు. ఇదంతా కూడా న్యాయబద్ధమైన పాలస్తీనా హక్కు కోసం ఆమె నిలబడుతూనే, కేవలం హమాస్ తీవ్రవాదాన్ని ఖండించినందుకు జరుగుతోంది. హమాస్‌ను బట్టబయలు చేసినందుకు కొందరు కోపంగా ఉన్నారు.

- జాహాక్ తన్వీర్, కాలమిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

తెలుగు సముద్ధరణ వైతాళికుడు

సందర్భం




డా॥ చింతకుంట శివారెడ్డి

'1825లో తెలుగు మృతి చెంది ఉండడం చూశాను, 30 ఏళ్లలో దానిని పునరుజ్జీవింపచేశాన'ని గర్వంగా చెప్పుకొన్నారు బ్రౌన్. తాళపత్రాలలో అగ్గిపురుగులకు ఆహుతి అవుతున్న తెలుగు సాహిత్యాన్ని శుద్ధ ప్రతులుగా చేసి, తెలుగుకు తిరిగి ప్రాణంపోసిన మహనీయుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (1798- 1884).

జాతి రీత్యా బ్రౌన్ ఆంగ్లేయుడైనప్పటికీ పుట్టుకతో భారతీయుడు. 1798 నవంబర్ 10వ తేదీన రివరెండ్ డేవిడ్ బ్రౌన్, కౌలే దంపతులకు కలకత్తాలో జన్మించారు. మద్రాసు ఫోర్ట్ సెయింట్ జార్జి కాలేజీలో చేరి వెలగపూడి కోదండరామయ్య పంతులు దగ్గర తెలుగులో అక్షరాభ్యాసం చేశారు. శిక్షణలో ఉన్న సివిల్ సర్వెంట్స్ సమావేశంలో అప్పటి మద్రాస్ గవర్నర్ మన్రో 'ఎప్పుడైతే ఇంగ్లీష్ సివిల్ ఆఫీసర్లు - ఆ యా ప్రాంతీయ భాషలు నేర్చుకొని ఆ భాషల్లో స్థానికులతో సంభాషించగలరో ఆనాడే భారతీయులు ఆంగ్లేయులమైన మనల్ని గుర్తిస్తారు, గౌరవిస్తారు' అని ఉద్బోధించారు. అదే సమావేశంలో ఉన్న బ్రౌన్‌పై ఈ మాటలు మంచి ప్రభావాన్ని చూపాయి. దీంతో ప్రాంతీయ భాషల పట్ల ఆయన పరిశోధనాత్మక దృష్టి సారించారు.

మూడేళ్ళపాటు మద్రాసులో ఉద్యోగ శిక్షణ పొందిన తరువాత బ్రౌన్ 1820 ఆగస్టు 20న కడపలో అడుగుపెట్టారు. కలెక్టరుకు అసిస్టెంట్‌గా పనిచేసి అక్కడ నుండి మచిలీపట్నం బదిలీ అయిన తరువాత తిరిగి మూడేళ్ళపాటు కోర్టులో రిజిస్ట్రార్‌గా కడపలో ఉద్యోగ జీవితం గడిపారు. పుస్తకాల ద్వారా మాత్రమే తెలుగు నేర్చుకోవడం కుదరదని గుర్తించి కోర్టులోని వాదులు, ప్రతివాదులు, నేరస్థులు, పరిచారకుల ద్వారా నేర్చుకుని కేవలం రెండేళ్ళ కాలంలోనే తెలుగు మాట్లాడడంలో



ప్రావీణ్యం గడించారు.

కడపలో 15 ఎకరాల తోటను ఒక బంగ్లాతో సహా 1,000 వరహాలకు కొని పదిహేను, ఇరవై మంది పండితులతో కలసి ఆయన 'తెలుగు సాహిత్య సముద్ధరణ మహాయజ్ఞం' జరిపించారు. ఇదే బంగళాలో ఒకవైపు బడి, మరొకవైపు తన సొంత గ్రంథాలయాన్నీ ఏర్పాటుచేసుకున్నారు. ఇదే పవిత్ర క్షేత్రంలోనే జూలూరి అప్పయ్య 'వసుచరిత్ర', 'మనుచరిత్ర'లకు వ్యాఖ్యలు వ్రాశారు. పైడిపాటి వెంకట నరసయ్య వేమన పద్యాలను పరిష్కరించారు. కంభం నరసింహాచార్యులు 'రాఘవ పాండవీయా'నికి వ్యాఖ్య రూపొందించారు. ఈ బంగళా తోటను, అక్కడ సాగే సాహిత్య కృషిని అజమాయిషీ చేస్తూ బ్రౌన్‌కు అత్యంత విశ్వాసపాత్రుడుగా అయోధ్యాపురం కృష్ణారెడ్డి ఉండేవారు .

తన అధ్యయన క్రమంలో 'వేమన' అనే ఒక తెలుగు కవి విస్మరించబడ్డాడని గ్రహించి వేమనకు సంబంధించిన తాళపత్ర గ్రంథాలను సేకరించి వేమన పద్యాలను 'వెర్సెస్ ఆఫ్ వేమన' పేరుతో ఇంగ్లీషులోకి 3238 పద్యాలను అనువదించారు. దాదాపు ముప్ఫైకిపైగా తెలుగు గ్రంథాలను వెలుగులోకి తెచ్చారు. ఆయన పేరును చిర స్థాయిగా నిలిపిన మహోత్కృష్టమైన రచనలు 'ఇంగ్లీషు-తెలుగు', 'తెలుగు-ఇంగ్లీషు' నిఘంటువులు. వీటితోపాటు 'జిల్లా నిఘంటువు', 'మిశ్ర భాషా నిఘంటువు'లను కూడా రూపొందించారు.

ఆయన 1884 డిసెంబర్ 12వ తేదీన తన 81వ ఏట ఇంగ్లండ్‌లో కన్నుమూశారు. 1970వ దశకంలో కడపలో బ్రౌన్ నివసించిన బంగళా తోటను గుర్తించి అక్కడ ఆయన స్మారకార్థం ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. నేడు ఆ గ్రంథాలయం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం'గా విరాజిల్లుతూ సాహిత్య సేవలందిస్తూ ఉంది.

వ్యాసకర్త సహాయ పరిశోధకులు, సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడప ၊ 94408 59872
(నవంబరు 10న సి.పి. బ్రౌన్ 225 జయంతి)

చైనాకు దీటుగా ఎదుగుతోన్న భారత్!

అభిప్రాయం



జయసూర్య

ప్రపంచంలో అయిదవ భారీ ఆర్థిక వ్యవస్థగా భారత్ తలెత్తుతోంది. 'అంతర్జాతీయ మోనిటరీ ఫండ్' ఇటీవలి నివేదిక ప్రకారం ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్ దాదాపు చైనా స్థాయిలో దోహదం చేయగల పటిష్టత సాధిస్తోంది. ప్రపంచ జనాభాలో 35 శాతం పైగా చైనా, భారత్‌లే కలిగి ఉన్నాయి. ఇరుదేశాలూ ఆర్థిక వ్యవస్థ మెరుగుదల కారణంగా చైనా 80 కోట్లు, భారత్ 41 కోట్ల జనాభాను పేదరికం నుంచి తప్పించగలిగాయి. ఐక్యరాజ్య సమితి 'ప్రపంచ స్థాయి 2022 పెట్టుబడుల నివేదిక' ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రంగంలో 2023లో అగ్రస్థానంలో ఉన్న 7వ దేశంగా భారత్ స్థానం పొందింది. 2022-23 'ఇండియన్ ఎకానమిక్' సర్వే నివేదిక ప్రకారం రానున్న కాలంలో అతి వేగంగా ఆర్థికాభివృద్ధి సాధించగల దేశంగా 82,000 స్టార్టప్‌లు, 107 యూనీకార్న్ కంపెనీలతో భారత్ డిజిటల్ ఆర్థిక రంగంలో దూసుకుపోతోంది. 2023 జూలైలో మనదేశం 'షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్' ఆతిథ్య, అధ్యక్ష బాధ్యత, నిర్వర్తించడం విశేషాంశం అయింది.

ప్రపంచం సాధిస్తున్న మొత్తం ఉత్పత్తులలో 20 శాతం పైగా భారత్, చైనాలు భాగస్వామ్యం కలిగి ఉన్నాయి. 2030 నాటికి జీడీపీ వృద్ధి రేటు 7.3 ట్రిలియన్ డాలర్లు సాధించే లక్ష్యంతో మనదేశం చైనాతో సయోధ్య కోరుతోంది. అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనాల మధ్య వైరుధ్యం కొనసాగుతున్న తరుణంలో అమెరికాతో భారత్ పరస్పర సహకారం, విశ్వాసం నెలకొల్పే దిశలో అడుగులు వేస్తోంది. భారత రక్షణ రంగాన్ని మరింత స్వయం సమృద్ధితో పటిష్టం చేసుకొనే కృత నిశ్చయంతో ప్రధాని నరేంద్ర మోదీ జూన్‌లో, జెట్ ఇంజిన్ సాంకేతిక ఒప్పందాలకు శ్రీకారం చుట్టారు. మన దేశం కంటే 5.5 రెట్లు ఎక్కువ జీడీపీ వృద్ధి రేటు



ఉన్న చైనాతో ఆచితూచి వ్యవహరించే రాజకీయ విజ్ఞత, మెలకువతో కేంద్రం వ్యవహరిస్తోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపు దిద్దుకొంటున్న చైనా కూడా కార్పొరేట్ రంగంలో భారీ రుణాల ఒత్తిడి, ఆస్తి సంబంధితంగా తీవ్రమైన అంతర్గత సంక్షోభం, రియల్ ఎస్టేట్ రంగంలో విపరీత వ్యతిరేక పరిణామాల వంటి సవాళ్లను ఎదుర్కోక తప్పడం లేదు. ఒక పక్క సరిహద్దు వివాదాలు కొనసాగుతున్నా సుస్థిర అభివృద్ధి, జన సంక్షేమం, వినూత్న ఆవిష్కరణలు, ఇరు పక్షాల ప్రయోజనాలు లక్ష్యంగా రెండు దేశాల ద్వైపాక్షిక బాంధవ్యం కొనసాగుతోంది.

2049 నాటికి, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 'పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ'ని అమెరికాకు ధీటుగా 'వరల్డ్ క్లాస్' మిలటరీగా సంసిద్ధం చేసే కార్యాచరణకు నడుం బిగించింది. 60వ దశకం నుంచి నేటి వరకు కమ్యూనిస్ట్ డ్రాగన్ మన సరిహద్దుల్లో సవాళ్లు విసురుతూనే ఉంది. తాజాగా అరుణాచల్, అక్సాయ్ చిన్ తమ సరిహద్దులలోనివే అంటూ '2023 ఎడిషన్'గా చైనా సహజవనరుల మంత్రిత్వ శాఖ, 'నేషనల్ మ్యాపింగ్ అవగాహనా ప్రచార వారం'లో ఓ మ్యాప్ విడుదల చేసింది.

ఈ పరిస్థితుల్లో అమెరికా మన దేశం పట్ల అత్యంత అనుకూల ప్రోత్సాహ వైఖరితో వ్యవహరిస్తోంది. రక్షణ ఉత్పత్తుల్లో మనం కొనుగోలు చేసేవాటి 80 శాతం ఉత్పత్తి సాంకేతికతలను మనకు బదలాయింపు చేయడానికి ఒప్పుకోవడం చారిత్రాత్మకం. జవహర్‌లాల్ నెహ్రూ 'పంచశీల'కు తూట్లు పొడిచిన చైనా 2023 నాటికి కూడా అదే దుర్నీతి, దురాక్రమణల దాహంతో నేటికీ వెంపర్లాడుతూ ఉండడం కళ్లముందున్న వాస్తవం. అందుకే ఇటు ఆర్థికాభివృద్ధితోపాటూ అటు సైనిక పరంగానూ చైనాకు ధీటుగా ఎదగడంలో రాజీలేని కృషి సల్పుతోంది భారత్.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 90149 48336

ఒక్క దెబ్బకు మూడు పిట్టలు!

ఓటుతో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలను దెబ్బతీయాలి: సీపీఐ నేత నారాయణ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రశ్నించే వారు ఉండకుండా చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓటు అనే ఆయుధంతో దెబ్బ తీయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు బుధవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నారాయణ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్ కూటమిని గెలిపించడం ద్వారా ఒక్క దెబ్బతో మూడు పిట్టలను కొట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ నీతి, నిజాయితీ అంటూ పదేపదే మాట్లాడుతున్నారని, కానీ వాస్తవ పరిస్థితులు అలా లేవని విమర్శించారు. లిక్కర్ కేసులో ఆప్ నేతలు, మంత్రులు అరెస్టయి జైళ్లకు వెళ్తున్నారు తప్పితే, కల్వకుంట కవిత నేటికీ అరెస్టు కాకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రస్థాయిలో వచ్చే మార్పు జాతీయ స్థాయిలో మార్పునకు నాంది పలుకుతుందని, అందుకే ఎన్నికల పొత్తులో ఒక్క కొత్తగూడెం సీటు దక్కినా, జాతీయ స్థాయిలో మార్పే లక్ష్యంగా ముందుకు పోతున్నామని నారాయణ వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెంలో ధర్మానికి, అధర్మానికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, తనకు ఓటేసి ధర్మంగా ఉండే సీపీఐని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారెక్కిన సీపీఐ కౌన్సిలర్లు..

గత నాలుగు రోజులుగా అజ్ఞాతంలో ఉన్న కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు సీపీఐ కౌన్సిలర్లు బుధవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరారు. ఇందులో ఆ పార్టీకి చెందిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కూడా ఉండటం గమనార్హం.

ఆదిలాబాద్ @16.7

రాష్ట్రంలో క్రమంగా పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి బలంగా గాలులు
- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు గాలులతో పెరుగుతున్న చలి
- మూడురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత క్షీణించే అవకాశం
- రానున్న రెండ్రోజుల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. సాధారణంగా ఈశాన్య రుతుపవనాల ప్రవేశంతోనే చలి తీవ్రత మొదలవుతుంది. కానీ ఈసారి ఈశాన్య రుతుపవనాల రాక ఆలస్యం కావడం... వాతావరణంలో నెలకొన్న మార్పులతో కొంత కాలంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతూ వచ్చాయి. మధ్యలో రెండు మూడురోజులు చలి పెరిగినా తర్వాత పెరిగిన ఉష్ణోగ్రతలు ఇప్పుడు క్షీణించడం ప్రారంభించాయి. పగటి ఉష్ణోగ్రతలతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతుండడం, రాష్ట్రానికి తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తుండడంతో చలి పెరుగుతోంది. మరో మూడు రోజుల తర్వాత ఉష్ణోగ్రతలు మరింత తగ్గనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఖమ్మంలో 34 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదిలాబాద్‌లో 16.7 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్‌తో పాటు మెదక్, నల్లగొండల్లో చలి పెరిగింది. రానున్న మూడురోజులు ఇదే తరహాలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఆ తర్వాత మరింత తగ్గుతాయని చెబుతున్నారు. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఇదే సమయంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. ప్రస్తుతం సాధారణ స్థితిలోనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్)

కేంద్రం	గరిష్ట	కనిష్ట
ఆదిలాబాద్	33.0	16.7
భద్రాచలం	32.0	24.0
హకీంపేట్	30.0	21.6
దుండిగల్	30.0	22.8
హనుమకొండ	30.5	22.5
హైదరాబాద్	30.0	22.7
ఖమ్మం	34.0	23.6
మహబూబ్‌నగర్	31.2	24.0
మెదక్	29.5	17.6
నల్లగొండ	29.2	19.0
నిజామాబాద్	32.1	22.9
రామగుండం	33.0	23.6



సీపీఐ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తున్న పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ. చిత్రంలో అజీజ్ పాషా, కూనంనేని, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

ఎకరాకు రూ. 20 వేల పెట్టుబడి సాయం

ఒకేసారి రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ.. సీపీఐ ఎన్నికల మేనిఫెస్టోలో కీలక అంశాలు

సాక్షి, హైదరాబాద్: రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని సీపీఐ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ, రైతు శ్రేయస్సు కోసం రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి, వృద్ధ రైతు దంపతులకు 57 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు మేనిఫెస్టోను విడుదల చేశారు.

మేనిఫెస్టోలోని కొన్ని అంశాలు...

- పేదలు, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్
- పేద, మధ్య తరగతి కుటుంబాలకు సగం ధరకే గ్యాస్ సిలిండర్
- ప్రతీ జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్మారక కేంద్రాలు.
- అమరవీరుల కుటుంబాలందరికీ రూ. 25 లక్షల ఆర్థిక సాయం, హైదరాబాద్‌లో 200 గజాల ఇంటి స్థలం కేటాయింపు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం. ఉద్యోగం చేసే స్థితిలో లేని కుటుంబంలో ఒకరికి రూ. 25 వేల పింఛన్. 1969 ఉద్యమంలో పాల్గొన్న అమరుల కుటుంబాలకు కూడా వర్తింపు. 1969 ఉద్యమంలో అర్హులైన ఉద్యమకారులకు పెన్షన్, వైద్యం, బస్‌పాస్ సదుపాయం.
- ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, వారు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ. 10 లక్షల ఆర్థికసాయం.
- భూమిలేని కౌలు రైతులకు మూడెకరాల భూమి
- దళితుల్లో భూమిలేని వారికి మూడెకరాలు భూమి
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం
- 8వ తరగతి నుంచి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఉచితం.
- గిరిజనుల విదేశీ వైద్య విద్య కోసం ఇస్తున్న రూ. 20 లక్షల సాయాన్ని రూ. 50 లక్షలకు పెంచడం.
- అర్హులైన వారికి 10 లక్షలు గిరిజన బంధు అమలు
- దేశంలో జనగణనలో బీసీ కులాల గణన
- బీసీ బంధు ద్వారా రూ. 10 లక్షల ఆర్థికసాయం.

‘కూనంనేనికి మద్దతిస్తాం’

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెంలో కాంగ్రెస్ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు పూర్తి మద్దతు తెలుపుతున్నామని, ఆయన గెలుపునకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్రంలో తొలగించిన 26 బీసీ కులాల పోరాట సమితి అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం మఖ్దూం భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డిని 26 బీసీ కులాల పోరాట సమితి ప్రతినిధి బృందం కలిసి తమ నిర్ణయాన్ని తెలిపింది. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ తరతరాలుగా తెలంగాణలో నివసిస్తున్న ఆంధ్రా ప్రాంతానికి చెందిన అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత సీఎం కేసీఆర్ వివక్షాపూరితంగా బీసీ కులాల జాబితా నుండి తొలగించి అన్యాయం చేశారని ఆరోపించారు.

క్లుప్తంగా...

డిసెంబర్‌లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు !

న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారంలో మొదలవుతాయని సమాచారం. డిసెంబర్ 3న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనుండటం తెలిసిందే. ఆ తర్వాత కొద్ది రోజులకే పార్లమెంటు సమావేశాలు మొదలవుతాయని, డిసెంబర్ 25న క్రిస్మస్‌కు ముందు ముగుస్తాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి, సాక్ష్యాధారాల చట్టాల స్థానంలో స్టాండింగ్ కమిటీ ఇటీవలే ఆమోదించిన కొత్త చట్టాలు ఈ సమావేశాల్లో పార్లమెంటు ముందుకు రానున్నాయి. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లు సైతం పార్లమెంటు వద్ద పెండింగ్‌లో ఉంది. శీతాకాల సమావేశాలు సాధారణంగా నవంబర్ మూడో వారంలో మొదలై క్రిస్మస్ ముందు ముగియడం ఆనవాయితీగా వస్తోంది.

ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయను: సదానంద గౌడ

బనశంకరి: ఇకపై ఏ ఎన్నికల్లోనూ పోటీచేయబోనని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ డీవీ సదానంద గౌడ ప్రకటించారు. ప్రస్తుతం బెంగళూరు ఉత్తర లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన ఎంపీగా ఉన్నారు. బుధవారం హాసన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పార్టీలో అనేక పదవులు అలంకరించాను. ఇంకా ఎక్కువ ఆశించబోను. ఇక ఎన్నికల్లో పాల్గొనబోను. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పార్టీ నాకు అన్ని పదవులు ఇచ్చింది. 10 ఏళ్లు ఎమ్మెల్యేగా, 20 ఏళ్లు ఎంపీగా, ఏడాది పాటు ముఖ్యమంత్రిగా, నాలుగేళ్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా, ఏడేళ్లు నరేంద్రమోదీ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించా. ఇంకా పదవులు ఆశిస్తే 'స్వార్థపరుడు' అని జనం పిలుస్తారు'' అని ఆయన అన్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయకపోయినా రాజకీయాల్లో కొనసాగుతారని ఆయన సన్నిహితులు చెప్పారు.

గిరిజనులు వనవాసీలు కాదు.. ఆదివాసీలు: రాహుల్

అంబికాపూర్: గిరిజనులను అభివృద్ధి చెందడం అధికార బీజేపీకి ఇష్టం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. గిరిజనులను ఆదివాసీలు అనడానికి బదులు వనవాసీలు అని బీజేపీ సంబోధిస్తుండడాన్ని ఆయన తప్పుపట్టారు. వనవాసీ, ఆదివాసీకి మధ్య చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఆదివాసీ అనే పదం నీరు, అడవి, భూమిపై గిరిపుత్రుల హక్కును సూచిస్తుందని పేర్కొన్నారు. అడవుల్లో నివసించేవారిని వనవాసీ అంటారని చెప్పారు. బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాహుల్ ప్రసంగించారు. బీజేపీ నాయకులు వారి సొంత బిడ్డలను ఇంగ్లిష్ మీడియం స్కూళ్లకు పంపిస్తూ, ఇంగ్లిష్ నేర్చుకోవద్దని గిరిజనులకు చెబుతున్నారని విమర్శించారు. గిరిజనులు గొప్ప కలలు కనడం కూడా బీజేపీ నేతలకు ఇష్టం లేదన్నారు.

ఇండోనేసియాలో భూకంపం

జకర్తా: శక్తిమంతమైన భూకంపం బుధవారం ఇండోనేసియాను వణికించింది. తూర్పు ప్రాంతంలోని చియాన్ ద్వీపం వరుస ప్రకంపనలతో చిగురుటాకులా వణికిపోయింది. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ద్వీపంలో జనాభా తక్కువగా ఉంటుంది. 'ముందుగా మలుకు ప్రావిన్స్‌లో తీర పట్టణం తువాలుకు 341 కిలోమీటర్ల దూరంలో 6.9 తీవ్రతతో భూమి కంపించింది. తర్వాత అక్కడే 7 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. అనంతరం 5.1 తీవ్రతతో పలుమార్లు భూమి కంపించింది' అని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. వీటివల్ల సునామీ ప్రమాదమేమీ లేదని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రాన్ని భూఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో గుర్తించారు. 27 కోట్ల జనాభా ఉన్న ఇండోనేసియా తరచూ భూకంపాల బారిన పడటం తెలిసిందే. 2004లో ఇక్కడ వచ్చిన 9.1 తీవ్రతతో కూడిన పెను భూకంపం పెను సునామీకి దారి తీయడం, ప్రపంచవ్యాప్తంగా డజను దేశాల్లో 2,30,000కు పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

వ్యక్తిని చంపేసిన రోబో!

సియోల్: దక్షిణ కొరియాలో రోబో బుధవారం ఒక రోబోటిక్స్ సంస్థ ఉద్యోగస్తుడిని పొట్టన పెట్టుకుంది. ఇతను ఆ రోబోను పరీక్షిస్తుండగా ఈ దారుణం జరిగింది. తన సమీపంలో ఉన్నది 'వ్యక్తి' అని ఆ రోబో గుర్తించలేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. అతడిని కూరగాయల బాక్సుగా పొరబడ్డ రోబో అమాంతంగా అతడిని ఎత్తి కన్వేయర్ పట్టీకేసి నొక్కేసి తల, ఛాతి భాగాలను ఒత్తేసింది. దీంతో అతను రక్తసిక్తమయ్యాడు. విషయం తెల్సుకున్న అక్కడి సిబ్బంది హుటాహుటిన ఆ బాధితుడిని ఆస్పత్రికి తరలించినా లాభం లేకపోయింది. పప్పెర్ బాక్స్‌లను ఎత్తి వాటిని అక్కడే ఉన్న ప్యాలెట్ మీదకు మార్చేలా రోబోట్‌ను డిజైన్‌చేశారు. అది సరిగా పనిచేస్తుందో లేదో అని పరీక్షించేందుకు టెస్ట్‌రన్ జరిపారు. ఆ రోబో సెన్సార్ పనితీరును తనిఖీ చేస్తున్న సమయంలోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానిక వార్తాసంస్థ యాన్‌యాప్ తన కథనంలో పేర్కొంది. దక్షిణ గియాంగ్‌సాంగ్ రాష్ట్రంలో ఈ దారుణం చోటుచేసుకుంది. గత మార్చిలో సైతం దక్షిణ కొరియాలో ఆటోమొబైల్ విడి భాగాల తయారీ పరిశ్రమలో ఒక వ్యక్తి ఇదే తరహాలో రోబోట్ చేతిలో తీవ్ర గాయాల పాలయ్యాడు.

సిగ్గుపడాలి

అసెంబ్లీలో నితీశ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం

- మహిళ పట్ల గౌరవం లేని నాయకుల వల్ల ఉపయోగం ఏమిటని ధ్వజం
- మహిళల గౌరవాన్ని కాపాడుతానని హామీ
- మధ్యప్రదేశ్‌లో మోదీ ఎన్నికల ప్రచారం

దమోహ్/గుణ: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సాక్షాత్తూ అసెంబ్లీలో మహిళలను ఉద్దేశించి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. మహిళలను దారుణంగా అగౌరవపర్చినా ప్రతిపక్ష 'ఇండియా' కూటమి నేతలు నోరు విప్పడం లేదని, కనీసం ఖండించడం లేదని తప్పుపట్టారు. అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యల



గుణ జిల్లాలో సభావేదికపై ప్రధాని మోదీని గదతో సత్కరిస్తున్న దృశ్యం

పట్ల నితీశ్ సిగ్గుపడాలని అన్నారు. తల్లులు, అక్కచెల్లెమ్మల పట్ల ఏమాత్రం గౌరవం లేని నాయకులతో ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. మహిళలను చిన్నచూపు చూసే వ్యక్తులకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు మోదీ సూచించారు. మహిళల గౌరవాన్ని కాపాడడానికి తాను చేయాల్సిందంతా చేస్తానని హామీ ఇచ్చారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని దమోహ్, గుణ పట్టణాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తనకు వ్యతిరేకంగా ప్రపంచంలో ఏ కోర్టుకు వెళ్లినా సరే ఉచిత రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. ప్రతి ఇంట్లోనూ సౌర విద్యుత్ ఉత్పత్తి విధానాన్ని అమలు చేస్తున్నామని, ఇంట్లో వాడుకున్న తర్వాత మిగిలిన కరెంటును ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. దేశంలో ప్రతి పౌరుడూ విద్యుత్ ఉత్పత్తిదారుడే అవుతారని వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావడంతో అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ రూ.80 వేల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిస్తే అభివృద్ధి ఆగిపోతుందని అన్నారు.

'ఉచిత రేషన్' పొడిగింపుపై కాంగ్రెస్ అక్కసు

పేదల ప్రజలకు ఉచిత రేషన్ సరుకుల పంపిణీ పథకాన్ని మరో ఐదేళ్లపాటు పొడిగిస్తామంటూ తాను హామీ ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. వారిని ఆ పాపం చేయనిద్దామని అన్నారు. తాను మాత్రం పేదల సంక్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటానని చెప్పారు. 80 కోట్ల మందికి వచ్చే ఏదేళ్లపాటు ఉచితంగా రేషన్ సరుకులు ఇవ్వబోతున్నామని తెలిపారు. తనను చాలామంది ఇష్టానుసారంగా దూషిస్తున్నారని, అయినప్పటికీ అవినీతిపై పోరాటం ఆపబోనని తేల్చిచెప్పారు. ఎవరెంత తిట్టుకున్నా తాను లెక్కచేయనని అన్నారు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే ఆ పార్టీ ముఖ్యమంత్రులు బెట్టింగ్‌ల్లో భాగస్వాములవుతున్నారని, నల్లధనం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న మన దేశం తాము 2014లో అధికారంలోకి వచ్చాక ఐదో స్థానానికి చేరుకుందని, 200 ఏళ్లపాటు మన దేశాన్ని పరిపాలించిన ఇంగ్లాండ్‌ను వెనక్కి నెట్టేశామని మోదీ ఉద్ఘాటించారు. ప్రపంచమంతా సంభ్రమాశ్చర్యాలతో మనవైపు చూస్తోందని అన్నారు. తాను మూడోసారి ప్రధానమంత్రి కావడం తథ్యమని, భారత్‌ను ప్రపంచంలో మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే '85 శాతం కమిషన్ వ్యవస్థ' మళ్లీ అమల్లోకి వస్తుందంటూ ప్రజలను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.



బుధవారం బిహార్ అసెంబ్లీ ఆవరణలో ఆందోళనకు దిగిన బీజేపీ ఎమ్మెల్యేలు



ఢిల్లీలోని బిహార్ భవన్ వద్ద బీజేపీ మహిళా కార్యకర్తల నిరసన ప్రదర్శన


నితీశ్ కుమార్ క్షమాపణ

తన వ్యాఖ్యలపై బిహార్ ముఖ్యమంత్రి వివరణ

జనాభా నియంత్రణలో మహిళల అక్షరాస్యత ప్రాధాన్యతను చెప్పాలనుకున్నా..

- నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా..
- శాసన సభ, శాసన మండలిలో, అసెంబ్లీ బయట క్షమాపణ కోరిన నితీశ్

పాట్నా/న్యూఢిల్లీ: జనాభా నియంత్రణ అంశంపై అసెంబ్లీలో తాను చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగడంతో బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ బుధవారం క్షమాపణ చెప్పారు. శాసన సభ, శాసన మండలిలో, అసెంబ్లీ బయట క్షమాపణ కోరారు. మహిళలు విద్యావంతులైతే గర్భం రాకుండా భర్తతో శృంగారం ఎలా చేయాలో నేర్చుకుంటారని, దానివల్ల జనాభా పెరుగుదల ఆగిపోతుందని నితీశ్ కుమార్ మంగళవారం అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులు, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దారుణంగా కించపర్చారని నితీశ్‌పై మండిపడ్డారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నితీశ్ వెంటనే రాజీనామా చేయాలని బిహార్ ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. బుధవారం రాష్ట్ర అసెంబ్లీలో అలజడి సృష్టించాయి. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఆయనకు ప్లకార్డులతో స్వాగతం పలికారు. అన్ని వైపుల నుంచి దాడి పెరగడంతో నితీశ్ దిగొచ్చారు. అసెంబ్లీ ప్రాంగణంలో మాట్లాడారు. ''నిన్న సభలో నేను మాట్లాడిన మాటలు కొందరికి నచ్చలేదని అర్థమైంది. మహిళా సాధికారత కోసం మా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజెప్పాలన్నదే నా అసలు ఉద్దేశం. జనాభా నియంత్రణలో మహిళల అక్షరాస్యత పాత్ర నానాటికీ పెరుగుతోందని చెప్పాలనుకున్నాను. ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే వారిని క్షమాపణ కోరుతున్నా. నా వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా'' అని నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. అనంతరం శాసన సభ, శాసన మండలిలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. పోడియం వద్దకు చేరుకొని నినాదాలు చేశాయి. ఉభయ సభల్లోనూ నితీశ్ క్షమాపణ కోరారు.



బిహార్ సీఎం నితీశ్

రేఖా శర్మ, చతుర్వేది మాటల యుద్ధం

నితీశ్ కుమార్ వ్యాఖ్యల విషయంలో జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ, శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ ప్రియాంకా చతుర్వేది మధ్య మాటల యుద్ధం కొనసాగింది. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తూ రేఖ శర్మ తొలుత సోషల్ మీడియాలో పోస్టుచేశారు. నితీశ్ వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. ప్రియాంకా చతుర్వేది సహా వివిధ పార్టీల ప్రముఖ మహిళా నేతలను ట్యాగ్ చేశారు. రేఖా శర్మ పోస్టుపై ప్రియాంకా చతుర్వేది స్పందించారు. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికి రేఖాశర్మ న్యాయం చేయడం లేదని, పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కీలక పదవిలో ఉన్నవారికి రాజకీయ దురుద్దేశాలు ఉండకూడదని సూచించారు. గతంలో మహిళలకు అవమానాలు ఎదురైనప్పుడు రేఖా శర్మ నోరు మెదపలేదని, నిందితులపై చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. ప్రియాంకా చతుర్వేది పోస్టుపై రేఖా శర్మ ప్రతిస్పందించారు. గతంలో మీ పార్టీలో(శివసేన)లో ఉన్న ఓ నాయకుడు తప్పు చేస్తే అప్పుడు మీరెందుకు మాట్లాడలేదని నిలదీశారు. సదరు నాయకుడి పేరును ప్రస్తావించలేదు. నితీశ్ కుమార్ క్షమాపణ చెప్పిన తర్వాత కూడా రేఖా శర్మ, ప్రియాంకా చతుర్వేది మధ్య మాటల యుద్ధం కొనసాగింది.

నితీశ్‌పై చర్యలు తీసుకోండి

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాతీయ మహిళా కమిషన్ బిహార్ అసెంబ్లీ స్పీకర్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్పీకర్ అవధ్‌బిహారీ చౌదరికి లేఖ రాసింది. అసెంబ్లీలో మంగళవారం నితీశ్ చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరింది. మహిళలను కించపర్చేలా ఎవరు మాట్లాడినా సహించబోమని తేల్చిచెప్పింది. నితీశ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని పేర్కొంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి మహిళలను ఉద్దేశించి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దారుణమని వెల్లడించింది. నితీశ్ కుమార్ క్షమాపణ జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ డిమాండ్ చేశారు.

ఢిల్లీలో బీజేపీ ఆందోళన

మహిళల పట్ల బిహార్ సీఎం నితీశ్ కుమార్ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలో బీజేపీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఢిల్లీలోని బిహార్ భవన్ వద్ద బైఠాయించారు. నితీశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నితీశ్ క్షమాపణ చెప్పాలని అన్నారు. ఆయన తక్షణమే పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

అభిషేక్ బెనర్జీకి ఈడీ సమన్లు

తొమ్మిదో తేదీన హాజరుకావాలని ఆదేశం

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. పాఠశాల ఉద్యోగాల కుంభకోణం దర్యాప్తులో భాగంగా నవంబర్ తొమ్మిదో తేదీన(నేడు) కోల్‌కతాలో తమ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మహిళా మంత్రి, పార్టీ అధికార ప్రతినిధి అయిన శశి పంజా చెప్పారు. ' మా పార్టీ జాతీయ స్థాయి ప్రధాన కార్యదర్శి అభిషేక్‌ను ఈడీ కక్షపూరిత రాజకీయాలకు బాధితుడిగా మార్చేసింది' అని ఆమె ఆరోపించారు. సమన్లలో పేర్కొన్న మేరకు అభిషేక్ బెనర్జీ గురువారం ఈడీ ఎదుట హాజరుకానున్నారు. ''వచ్చే సంవత్సరం కీలకమైన ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమ నేతలను బెదిరించడానికి బీజేపీ ఇటువంటి రాజకీయాలకు పాల్పడుతోంది'' అని శశి అన్నారు. దీనిపై పశ్చిమబెంగాల్ బీజేపీ రాష్ట్ర విభాగం స్పందించింది. ' కక్షసాధింపు రాజకీయాలపై మాకు నమ్మకం లేదు. జాతీయ దర్యాప్తు సంస్థలు కోర్టు ఆదేశాల మేరకే ఇలా సమన్లు జారీ చేస్తాయి. మీకేమైనా అభ్యంతరాలుంటే కోర్టును ఆశ్రయించండి' అని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో బెనర్జీ ఈడీ ఎదుట హాజరైన విషయం విదితమే. సెప్టెంబర్ 13వ తేదీన ఆయనను ఈడీ అధికారులు ఏకంగా తొమ్మిది గంటలపాటు సుదీర్ఘంగా విచారించారు. కీలక 'ఇండియా' కూటమి సమావేశంలో పాల్గొనకుండా టీఎంసీ నేతలను అడ్డుకునేందుకే ఈడీ ఆనాడు అలా చేసిందని అప్పుడే అభిషేక్ ఆరోపించారు. గతంలో బొగ్గు కుంభకోణం కేసులో 2021, 2022 సంవత్సరాల్లో అభిషేక్‌ను ఈడీ అధికారులు రెండు పర్యాయాలు ప్రశ్నించారు.

మహువాపై సీబీఐ విచారణ

- లోక్‌పాల్ ఆమేరకు ఆదేశించింది: బీజేపీ ఎంపీ దూబే వెల్లడి
- నేడు నైతికవిలువల సభా సంఘం భేటీ
- ఆమెపై నివేదికకు ఆమోదం!

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా లోక్‌సభలో ప్రశ్నలడిగేందుకు డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణలపై సీబీఐ విచారణ జరపనుందని బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే తాజాగా వెల్లడించారు. తన ఫిర్యాదు ఆధారంగా లోక్‌పాల్ ఈ మేరకు ఆదేశించినట్లు వివరించారు. ఈ మేరకు బుధవారం తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. దీనిపై మొయిత్రా తీవ్రంగా స్పందించారు. ''సీబీఐ ముందుగా అదానీ గ్రూప్ రూ.13 వేల కోట్ల బొగ్గు కుంభకోణం తదితరాలపై విచారణ జరిపితే బాగుంటుంది. ఆ తర్వాత నా అంశానికి రావచ్చు. నాకు ఎన్ని పాదరక్షలున్నాయో లెక్కపెట్టుకోవచ్చు'' అని ఎద్దేవా చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీకి మేలు చేసేలా అదానీ గ్రూప్‌పై లోక్‌సభలో మొయిత్రా పలుమార్లు ప్రశ్నలు అడిగారంటూ గత నెలలో దుబే ఆరోపించడం తెలిసిందే. ఇందుకు బదులుగా హీరానందానీ నుంచి డబ్బులతో పాటు ఇతరత్రా పలు రకాలుగా ఆమె భారీ స్థాయిలో లబ్ధి పొందారని ఆమెపై ఆరోపణ. ఎంపీ హోదాలో ఉంటూ డబ్బుల కోసం జాతీయ భద్రతనే ఆమె ప్రమాదంలో పడవేశారని లోక్‌సభ స్పీకర్‌కు దూబే గతంలో ఫిర్యాదు చేయడం తెల్సిందే. దాంతో 15 మంది ఎంపీలతో కూడిన లోక్‌సభ నైతిక విలువల కమిటీ ఈ ఉదంతంపై దర్యాప్తు చేస్తోంది. కమిటీ గత భేటీకి హాజరైన మొయిత్రా, చైర్మన్ తనను అసభ్యకరమైన ప్రశ్నలు అడిగారని ఆరోపిస్తూ వాకౌట్ చేయడం విదితమే. ఈ ఉదంతంపై కమిటీ గురువారం మరోసారి భేటీ కానుంది. డబ్బులకు ప్రశ్నలడిగిన ఉదంతంలో మొయిత్రాను దోషిగా తేలుస్తూ స్పీకర్‌కు కమిటీ నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం. అదే జరిగితే దానితో విభేదిస్తూ కమిటీలోని విపక్ష సభ్యులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి (కాంగ్రెస్), కున్వర్ దానిష్ అలీ (బీఎస్పీ) నోట్ ఇస్తారని చెబుతున్నారు.

'వందే సాధారణ్' ట్రయల్ రన్ విజయవంతం

ముంబై: రైల్వే శాఖ దేశంలో తొలిసారిగా ప్రవేశపెడుతున్న 'వందే సాధారణ్' రైలు ట్రయల్ రన్ విజయవంతమైంది. తొలి వందే సాధారణ్ రైలును బుధవారం ముంబై-అహ్మదాబాద్ మధ్య విజయవంతంగా నడిపినట్లు రైల్వే శాఖ పేర్కొంది. సంబంధిత వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్‌అవుతోంది. కొంతకాలం క్రితం ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లు దేశవ్యాప్తంగా పలు మార్గాల్లో విజయవంతంగా నడుస్తుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాధారణ ప్రయాణికుల కోసం అదే తరహాలో 'వందే సాధారణ్' రైళ్లు తేవాలని రైల్వే శాఖ గతంలోనే నిర్ణయించడం తెల్సిందే. వందేభారత్ రైళ్లలో పూర్తిగా ఏసీ కోచ్‌లు ఉండగా 'వందే సాధారణ్' నాన్ ఏసీ కోచ్‌లతో నడవనున్నాయి. వీటిలో మొత్తం 22 స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయి. రెండువైపులా ఇంజన్లుండటం వీటి ప్రత్యేకత. సీసీటీవీ నిఘా, సెన్సార్ ఆధారిత సౌకర్యాలు, తదితర సదుపాయాలను ఈ కోచ్‌లలో కల్పించనున్నారు. ఒక్కో రైలులో 1,800 మంది దాకా ప్రయాణించవచ్చు. ఇవి గంటకు 130 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయని రైల్వే శాఖ చెబుతోంది. దేశంలో 500 కిలోమీటర్లు దాటిన ప్రఖ్యాతిగాంచిన పలు మార్గాల్లో ఈ కొత్తతరహా రైలు సర్వీసులను ప్రారంభించాలని రైల్వేశాఖ యోచిస్తోందని సమాచారం. ముంబై-న్యూఢిల్లీ, పట్నా-న్యూఢిల్లీ, హౌరా-న్యూఢిల్లీ, హైదరాబాద్-న్యూఢిల్లీ, ఎర్నాకులం-గువాహటి మార్గాలు ఈ రూట్‌ల జాబితాలో ఉన్నాయి.

నెల రోజులుగా నెత్తురోడుతోంది

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

- సాధారణ నివాస ప్రాంతాలపై క్షిపణుల ప్రయోగం
- గాజా స్ట్రిప్ చిన్నపిల్లల శ్మశానంగా మారుతోంది
- ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో ఆందోళన

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం మొదలై నెల రోజులు దాటింది. గాజాపై భూతల దాడులను తాత్కాలికంగా నిలిపివేసిన ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులను కొనసాగిస్తోంది. బుధవారం గాజా అంతటా క్షిపణులు, రాకెట్లు ప్రయోగించింది. గాజా గత 24 గంటల వ్యవధిలో 214 మంది మరణించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నెల రోజులకుపైగా సాగుతున్న యుద్ధంలో హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం పైచేయి సాధిస్తోంది. గాజాలో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 10,569కి చేరుకుంది. గాజాలో పెరిగిపోతున్న మరణాలపై ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. గాజా స్ట్రిప్ మొత్తం చిన్నపిల్లల శ్మశాన వాటికగా మారుతోందని చెప్పారు. మృతుల సంఖ్య పెరుగుతోంది అంటే ఇజ్రాయెల్ సైన్యం తప్పుడు దారిలో పయనిస్తున్నట్లు అర్థమని స్పష్టం చేశారు.

దాడులకు 4 గంటలు విరామం

ఇజ్రాయెల్ హెచ్చరికల నేపథ్యంలో ఉత్తర గాజా నుంచి నిత్యం వేలాది మంది దక్షిణ గాజాకు వలస వెళ్తున్నారు. ఇప్పటిదాకా దాదాపు 70 శాతం మంది వెళ్లిపోయినట్లు అంచనా. గాజా ఆసుపత్రుల్లో గుండెను పిండేసే దృశ్యాలు కనిపిస్తున్నాయి. విద్యుత్ లేక ఆసుపత్రుల్లో ఆపరేషన్లు నిలిచిపోయాయి. ఔషధాలు, వైద్య పరికరాలు లేక క్షతగాత్రులకు చికిత్స అందించడం లేదు. ఇంక్యుబేటర్లలో శిశువులు విగత జీవులుగా మారుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. చాలా హాస్పిటళ్లలో పెట్రోల్, డీజిల్ లేక జనరేటర్లు పనిచేయడంలేదు. ఇజ్రాయెల్ సైన్యం తొలిసారిగా బుధవారం గాజాపై దాడులను 4 గంటలపాటు నిలిపివేసింది. గాజాకు మానవతా సాయం చేరవేయడానికి వీలుగా దాడులు ఆపినట్లు వెల్లడించింది. హమాస్‌పై యుద్ధం ముగిశాక గాజా రక్షణ బాధ్యతను తాము స్వీకరిస్తామంటూ ఇజ్రాయెల్ ప్రధాని చేసిన ప్రకటనపై అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ స్పందించారు. గాజాను ఆక్రమించుకొనే ఆలోచన చేయొద్దని ఇజ్రాయెల్‌కు హితవు పలికారు.



బుధవారం దక్షిణ గాజాలోని రఫా పట్టణంలో ఆహారం కోసం పాలస్తీనియన్ల ఆరాటం

ఇజ్రాయెల్‌కు జీ7 దేశాల మద్దతు

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంపై జీ7 దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధులు జపాన్ రాజధాని టోక్యోలో చర్చలు జరిపారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ చర్చలు బుధవారం ముగిశాయి. ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్ల దాడిని వారు ఖండించారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించారు. ఆత్మరక్షణ చేసుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని తేల్చిచెప్పారు. గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందించానికి మార్గం సులభతరం చేయాలని, ఇందుకోసం హమాస్‌పై యుద్ధానికి కొంత విరామం ఇవ్వాలని జీ7 ప్రతినిధులు ఇజ్రాయెల్‌కు సూచించారు. కాల్పుల విరమణ పాటించాలని సూచించకపోవడం గమనార్హం.

50 వేల మందికి 4 టాయిలెట్లు

గాజాలో నెలకొన్న భయానక పరిస్థితులను అమెరికా నర్సు ఎమిలీ చలాహన్ మీడియాతో పంచుకున్నారు. గాజాలో క్షతగాత్రులకు సేవలందించిన ఎమిలీ ఇటీవలే అమెరికా చేరుకున్నారు. 26 రోజుల తర్వాత ఈరోజే స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నానని తెలిపారు. గాజాలో 26 రోజుల్లో ఐదు చోట్లకు మారాల్సి వచ్చిందన్నారు. ఒకచోట 35 వేల మంది నిరాశ్రయులు ఉన్నారని తెలిపారు. ముఖాలు, మెడ, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలున్న చిన్నారులు కనిపించారని వెల్లడించారు. 50 వేల మంది తలదాచుకుంటున్న ఓ శిబిరంలో కేవలం 4 మరుగుదొడ్లు ఉన్నాయని పేర్కొన్నారు. అక్కడ రోజుకు కొద్దిసేపు మాత్రమే నీటి సరఫరా జరిగేదని వివరించారు.

మానవ అక్రమ రవాణా కేసులో పలు రాష్ట్రాల్లో ఎన్ఐఏ దాడులు

న్యూఢిల్లీ: మానవ అక్రమ రవాణా కేసుల విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వేగవంతం చేసింది. బుధవారం దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాడులు కొనసాగించింది. ఈ కేసుకు సంబంధించి నిందితులను అరెస్టు చేసేందుకు ఏకకాలంలో దాడులు, సోదాలు నిర్వహించింది. త్రిపుర, అస్సాం, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, హరియాణా, రాజస్తాన్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరిలలో ఈ దాడులు చేశామని బుధవారం వెలువరించిన ఒక ప్రకటనలో ఎన్ఐఏ పేర్కొంది. ఐదు మాడ్యూల్స్‌ను బట్టబయలుచేయడంతోపాటు ఈ కేసుతోసంబంధం ఉన్న 44 మందిని అరెస్ట్‌చేశారు. 44 మందిలో అత్యధికంగా త్రిపురలో 21 మందిని అరెస్ట్‌చేసింది. తెలంగాణలో ఒకరిని అరెస్ట్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన సోదాల్లో మయన్మార్‌కు చెందిన రోహింగ్యా ముస్లిం జాఫర్ అలామ్‌సహా పలువురిని జమ్మూ, సాంబా జిల్లాల్లో బుధవారం అరెస్ట్‌చేశారు. ఇతడితోపాటు ఉన్న మరో వ్యక్తి పరారైనట్లు తెలుస్తోంది. మయన్మార్ నుంచి వలస వచ్చిన రోహింగ్యాలు ఉంటున్న ప్రాంతాల్లో ఈ దాడులు కొనసాగాయి. పాస్‌పోర్టు చట్టాల అతిక్రమణ, మానవ అక్రమ రవాణాకు సంబంధించిన గతంలో నమోదైన కేసుల విచారణలో భాగంగా ఎన్ఐఏ ఈ దాడులు చేసింది. అక్టోబర్‌లో శ్రీలంకకు చెందిన పలువురిని తమిళనాడు మీదుగా బెంగళూరు, మంగళూరుకు అక్రమంగా తరలించిన కేసులో ఇమ్రాన్ ఖాన్ అనే వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అరెస్టు చేశారు.

క్లుప్తంగా...

హైదరాబాద్‌లో మల్లికార్జున ఖర్గే



సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం హైదరాబాద్‌కు వచ్చారు. ఇండియాటుడే ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఖర్గే.. బుధవారం రాత్రి ఇక్కడే ఉండి గురువారం ఉదయం ఢిల్లీ వెళతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. కాగా, శంషాబాద్ విమానాశ్రయంలో ఖర్గేకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావ్ చవాన్, టీపీసీసీ ప్రొటోకాల్ చైర్మన్ హర్కర వేణుగోపాల్‌రావు తదితరులు స్వాగతం పలికారు.

ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకుడిగా రమేశ్ చెన్నితల

కేరళకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితలను తెలంగాణ ఎన్నికల కోసం ప్రత్యేక పరిశీలకుడిగా నియమిస్తూ ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కె.సి.వేణుగోపాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిశీలకుడిగా ఎస్.హెచ్. శివశంకర్‌రెడ్డి, నల్లగొండకు రాజశేఖర్ బి.పాటిల్, నిజామాబాద్‌కు అంజలి నింబాల్కర్, మెదక్‌కు యు.వి.వెంకటేశ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

గడ్డం తీసే రోజులు దగ్గర పడ్డాయి: ఎంపీ ఉత్తమ్



కోదాడ: తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని, తనకు గడ్డం తీసే రోజులు కూడా దగ్గర పడ్డాయని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు గడ్డం తీయనని గతంలో తాను ప్రకటించినప్పటి నుంచి అలాగే ఉంటున్నానని చెప్పారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడలో విలేకరులతో ఉత్తమ్ మాట్లాడారు. బీఆర్ఎస్ అవినీతి అక్రమాలకు విసుగు చెందిన ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో 75 నుంచి 80 సీట్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన నాగార్జునసాగర్, శ్రీశైలం పాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరలేదని, మూడేళ్ల కిందట లక్ష కోట్ల అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతోందని విమర్శించారు. దీనికి కారణం సీఎం కేసీఆర్ అవినీతేనని ఆరోపించారు. నవంబర్ 3వ తేదీ వరకు రైతుబంధు ఇవ్వాలని తాను కోరితే రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ ఫిర్యాదు చేసిందని సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. రైతుబంధుపై తమకు ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని రాష్ట్ర ఎన్నికల అధికారి స్పష్టం చేసినా.. సీఎం మళ్లీ మళ్లీ అబద్ధాలు చెప్పడానికి కారణం బీఆర్ఎస్ ఓడి పోతోందనే అక్కసు మాత్రమేనని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వైపే ప్రజల చూపు

- సినీ నిర్మాత బండ్ల గణేశ్



సాక్షి, హైదరాబాద్: రాజకీయ పార్టీలు నేతలను మేనేజ్ చేయొచ్చు కానీ.. ప్రజలను మేనేజ్ చేయలేవని సినీ నిర్మాత బండ్ల గణేశ్ వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, కాంగ్రెస్‌కు ఓటేసేందుకు నవంబర్ 30 ఎప్పుడు వస్తుందా.. అని ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతం సృష్టిస్తుందని, డిసెంబర్ 9వ తేదీన ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన స్పష్టం చేశారు. తాను పుట్టినప్పటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తనని, ఇప్పటివరకు వేరే పార్టీకి ఓటేయలేదని చెప్పారు.

ఉద్యమకారుల సమస్యలను మేనిఫెస్టోలో చేర్చాలి

- గన్‌పార్క్ నుంచి గాంధీభవన్‌కు ఉద్యమకారుల ర్యాలీ

లక్డీకాపూల్ (హైదరాబాద్): తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుల డిమాండ్లను రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని ఉద్యమకారుల హక్కుల సాధన సమితి అధ్యక్షుడు వల్లపు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తొలి, మలి దశ ఉద్యమకారుల సాధన సమితి ఆధ్వర్యంలో గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి నాంపల్లిలోని గాంధీభవన్‌లో మాజీ ఎంపీ, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవికి వినతిపత్రాన్ని అందించారు. అలాగే బీజేపీ కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అబ్జర్వర్ బన్సల్‌లాల్‌కి, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డికి, బీఎస్పీ కార్యాలయంలో పార్టీ ఉపాధ్యక్షుడు దయానంద్‌కి మెమోరాండం అందజేశారు. ఆయా పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో ఉద్యమకారుల సమస్యలను చేర్చి, గెలిచిన పార్టీలు తమ డిమాండ్లను అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో 1969 ఉద్యమకారుల సంఘం సెక్రెటరీ జనరల్ సుదర్శన్‌రావుతో పాటు తొలి, మలి దశ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేస్తాం

ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ కీలక హామీ!

- మొత్తం 36 అంశాలతో రెడీ అవుతున్న ప్రజా మేనిఫెస్టో
- కేసీఆర్ కిట్‌కు కౌంటర్‌గా వస్తువులు, నగదు సాయం పెంచుతూ మరో పథకం
- ఆటో డ్రైవర్లకు ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం
- విద్యార్థినులకు స్కూటీల స్థానంలో ల్యాప్‌టాప్‌లు!



సాక్షి, హైదరాబాద్: అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతం అమలవుతున్న కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వనుంది. దాని స్థానంలో పాత పింఛన్ విధానాన్ని (ఓపీఎస్)ను పునరుద్ధరిస్తామని చెప్పనుంది. ఈ మేరకు తన ఎన్నికల ప్రణాళికలో చేర్చనుంది. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు ఇవ్వాల్సిన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టో కోసం మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని కమిటీ దాదాపు గత నెలరోజులుగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలుమార్లు సమావేశమైన కమిటీ మొత్తం 36 అంశాలతో మేనిఫెస్టోకు తుది మెరుగులు దిద్దినట్టు తెలుస్తోంది. తాజాగా బుధవారం రాత్రి కూడా గాంధీభవన్‌లో కమిటీ సమావేశమైంది. ఒకట్రెండు అంశాలపై స్పష్టత రాకపోవడంతో పార్టీ పెద్దలను సంప్రదించిన తర్వాత ఆ అంశాలను పొందుపరిచి నాలుగైదు రోజుల్లోపు మేనిఫెస్టోను విడుదల చేసే అవకాశం ఉందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

కొత్త స్కీములు..కౌంటర్ పథకాలు

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ప్రతి ఏటా ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తామని, ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీ కేలండర్‌ను విడుదల చేయడంతో పాటు ఐదేళ్లలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వనుంది. కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాన్ని 25 శాతం పెంచుతామనే హామీని కూడా మేనిఫెస్టోలో పొందు పరుస్తున్నారు. బాలింతలకు ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న కేసీఆర్ కిట్‌కు కౌంటర్‌గా మరో పథకాన్ని ప్రకటిస్తారని, కిట్‌లోని వస్తువులతో పాటు ఆర్థిక సాయం పెంచుతారని సమాచారం. అదే విధంగా రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లందరికీ ప్రతి ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం పథకాన్ని కూడా ప్రకటించనున్నారు. చదువుకుంటున్న విద్యార్థినులందరికీ స్కూటీలు ఇస్తామని గతంలో ప్రకటించినప్పటికీ, తాజాగా వాటి స్థానంలో ల్యాప్‌టాప్‌లిస్తామని మేనిఫెస్టోలో వెల్లడించే అవకాశం ఉందని తెలుస్తోంది.

అందరి సంక్షేమమే లక్ష్యం..!

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికను ప్రజా మేనిఫెస్టో పేరుతో విడుదల చేయనున్నారు. ఇందులో తెలంగాణ ఉద్యమ, అమరవీరుల సంక్షేమ, వ్యవసాయం-రైతు సంక్షేమం, నీటి పారుదల, యువత-ఉపాధి కల్పన, విద్య, వైద్య రంగాలు, గృహ నిర్మాణం, భూపరిపాలన, పౌరసరఫరాలు, నిత్యావసరాల పంపిణీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ/ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమం, విద్యుత్ రంగం, టీఎస్ఆర్టీసీ సంక్షేమం, మద్య విధానం, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, సింగరేణి కార్మికులు, కార్మికులు, న్యాయవాదులు, సీనియర్ సిటిజన్లు, జర్నలిస్టులు, గల్ఫ్ ఎన్నారైలు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, క్రీడారంగం, పోలీస్-శాంతి భద్రతల వ్యవస్థ, పర్యాటక రంగం, జానపద, సినిమా-సాంస్కృతిక రంగం, ధార్మిక రంగం, పర్యావరణం, గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి తదితర అంశాలతో కూడిన మేనిఫెస్టోకు కాంగ్రెస్ నేతలు రూపకల్పన చేస్తుండడం గమనార్హం.

తుమ్మల నివాసంలో సోదాలు

- సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదుతోనే తనిఖీలు
- ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీలత వెల్లడి
- తెరుచుకోని పాత బ్రీఫ్‌కేస్‌ను పగులగొట్టిన వైనం



తుమ్మల ఇంట్లో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం బారుగూడెం పరిధి శ్రీసిటీలోని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసంలో బుధవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోదాలు చేశారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీలత, ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. తుమ్మల ఇంట్లోని అన్ని గదుల్లో బీరువాలు, మేడపై వాటర్ ట్యాంక్ ఇలా అన్నిచోట్ల నిశితంగా పరిశీలించారు. కాగా, ఇంట్లో ఒక పాత బ్రీఫ్‌కేస్ తెరుచుకోకపోవడంతో రాడ్‌తో పగులగొట్టారు. ఈ సందర్భంగా అధికారి శ్రీలత మాట్లాడుతూ...సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు తనిఖీలు చేపట్టామని.. ఎలాంటి నగదు, బంగారం, సామగ్రి లభించలేదని తెలిపారు. కాగా, అధికారులు వచ్చిన సమయంలో తుమ్మల ప్రచారంలో ఉండగా, ఆయన సతీమణి అనుమతితో ఇంట్లో తనిఖీలు చేశారు.

నాపై ఐటీ దాడులు జరగొచ్చు!: పొంగులేటి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కేంద్ర దర్యాప్తు సంస్థలు తెలంగాణలో కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులపైనే ఫోకస్ పెట్టాయని, ఎన్నికల ఫలితాలను ముందుగానే ఊహించిన కేంద్రంలోని బీజేపీ.. ఇన్‌కం ట్యాక్స్, ఈడీ బృందాలను కాంగ్రెస్‌పై ఎక్కుపెట్టిందని మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఖమ్మంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా పర్వాలేదనే ఆలోచనలో బీజేపీ ఉందన్నారు. తనపై, తన కుటుంబీకులు, నాయకులపై కూడా త్వరలోనే బీఆర్ఎస్ సూచనల మేరకు ఐటీ దాడులకు వ్యూహం పన్నారని పొంగులేటి ఆరోపించారు. కాళేశ్వరం వంటి అద్భుతమైన ప్రాజెక్టును ప్రపంచంలోనే ఎవరూ కట్టలేదని సీఎం కేసీఆర్ గొప్పగా చెప్పినా, ప్రాజెక్టు నిజస్వరూపం బయటపడిందని విమర్శించారు. కాళేశ్వరంను ఏటీఎంలా వాడుకున్నారని, రూ.లక్షల కోట్లు దోచుకున్నారని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఆధారాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ విజిలెన్స్‌తోపాటు సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని, లేని పక్షంలో విలువైన డాక్యుమెంట్లను మాయం చేసే ప్రమాదం ఉందని పొంగులేటి తెలిపారు. తిరుమలాయపాలెం మండలానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీపీ, నలుగురు ఎంపీటీసీలు, నలుగురు సర్పంచ్‌లు పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి పాల్గొన్నారు.

తప్పులుంటే చెప్పండి

- అఫిడవిట్‌లో సరిదిద్దేందుకు అభ్యర్థులకు అవకాశం ఇవ్వండి
- సీఈఓకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వినతి
- ఎన్నికల ఏర్పాట్లపై పార్టీలతో సీఈఓ సమావేశం
- రేవంత్‌పై చర్యలు తీసుకోవాలన్న బీఆర్ఎస్
- నాగర్ కర్నూల్ పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు: కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల అఫిడవిట్లలో తప్పులుంటే అభ్యర్థులకు తెలియజేసి సరిదిద్దేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు విజ్ఞప్తి చేశాయి. రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఏర్పాట్లపై సీఈఓ వికాస్‌రాజ్ బుధవారం తన కార్యాలయంలో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలతో సమావేశమై చర్చించారు. సమావేశం అనంతరం ఆయా పార్టీల ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. 43లక్షల మంది ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని, మరో 7లక్షల కార్డుల పంపిణీ చేయాల్సి ఉందని సీఈఓ తెలిపినట్టు వెల్లడించారు. అనుబంధ ఓటర్ల జాబితాను ఈ నెల 10న ప్రకటిస్తామని సీఈఓ తెలిపారన్నారు.

ఆ అధికారులను తప్పించాలి: కాంగ్రెస్

నాగర్‌కర్నూల్‌జిల్లా పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ నేతలపై కేసులు పెడుతున్నారని, అక్కడి డీఎస్పీ, ఇతర పోలీసు అధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఫిర్యాదు చేసినట్టు టీపీసీసీ ఉపాధ్యక్షులు నిరంజన్, మల్లు రవి తెలిపారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి నామినేషన్ పత్రాలను నింపడంలో అభ్యర్థులకు సహకరించాలని కోరామన్నారు. సీఈఓ కార్యాలయం నుంచి ఉన్నత స్థాయి అధికారులు ఫోన్ చేసినా క్షేత్ర స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల పరిశీలకుల వివరాలను సీఈఓ కార్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సూచించారు.

రేవంత్‌పై చర్యలు తీసుకోవాలి: బీఆర్ఎస్

అభ్యర్థుల బీ-ఫారాలను చాలా యాంత్రికంగా తిరస్కరిస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ నేత సోమా భరత్ తెలిపారు. చిన్న చిన్న పొరపాట్లు జరిగినా ఎన్నికల సంఘం సరిగ్గా పనిచేయడం లేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోందని తప్పుబట్టారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి మహిళల ముందే బూతులు మాట్లాడారని, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశామన్నారు. రేవంత్‌కి భాష తెలియకపోతే తన భార్య, పిల్లల వద్ద నేర్చుకోవాలన్నారు.

చర్యలు తీసుకోకపోతే ఎన్నికలు ఆపండి: బీజేపీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు బీఆర్ఎస్ కార్యకర్తలుగా పనిచేస్తున్నారని, వాళ్లపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ లీగల్‌సెల్ నేత ఆంథోని రెడ్డి అన్నారు. చర్యలు తీసుకోకుంటే ఢిల్లీలో ఎన్నికల సంఘాన్ని కలిసి ఎన్నికలను నిలుపుదల చేయాలని కోరుతామన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా రేవంత్ రెడ్డి, కేటీఆర్‌లు అభ్యంతరకర భాషలో మాట్లాడకుండా నియంత్రించాలని కోరామన్నారు.

పరిశీలనకు నలుగురికి అనుమతి




నామినేషన్ల పరిశీలనలో ఒక్కో అభ్యర్థి తరఫున నలుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. ఎన్నికల ఏజెంట్, ప్రపోజర్, మరో వ్యక్తితో కలసి పరిశీలన ప్రక్రియలో పాల్గొనేందుకు గాను అభ్యర్థి ముందుగా రాతపూర్వకంగా ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ఏర్పాట్లపై బుధవారం ఆయన తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై అవగాహన కల్పించారు. నామినేషన్ల ఉపసంహరణకు సంబంధించిన దరఖాస్తులను అభ్యర్థులు స్వయంగా గాని, తనను ప్రతిపాదించిన వ్యక్తి/ఎన్నికల ఏజెంట్ ద్వారా రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి స్వయంగా రాని పక్షంలో, తనను ప్రతిపాదించిన వ్యక్తి/ ఎన్నికల ఏజెంట్‌కి అధికారం ఇస్తున్నట్టు రాతపూర్వకంగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి 9 రోజుల్లోగా 40 మందికి మించకుండా స్టార్ క్యాంపైనర్ల జాబితాను రాజకీయ పార్టీలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రచార అనుమతుల కోసం సువిధ పోర్టల్‌ను వినియోగించాలన్నారు.

సగానికి పైగా ఫిర్యాదులు వాస్తవమే: ఈ నెల 10 నుంచి బీఎల్ఓల ద్వారా ఓటరుఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ ప్రారంభిస్తామని వికాస్‌రాజ్ తెలిపారు. కోడ్ ఉల్లంఘనలపై సీ-విజిల్ యాప్ ద్వారా 3205 ఫిర్యాదులు అందగా, 1961 ఫిర్యాదులు వాస్తవమేనని తేలిందన్నారు.

ఎంత మందికి ఇళ్లు కట్టించారో కేసీఆర్ చెప్పాలి

కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కంటే మంచి ఇల్లు కట్టిస్తామని గత ఎన్నికల్లో ఓట్లు దండుకున్న కేసీఆర్.. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని ఎంత మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇచ్చారో చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ డిమాండ్ చేశారు. తొమ్మిది నెలల్లోపు ప్రగతిభవన్ కట్టుకున్న కేసీఆర్‌కు.. పేదలకు ఇళ్లు కట్టించేందుకు ఐదేళ్లు సరిపోలేదా అని ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి, ఉపాధ్యక్షులు రాములు నాయక్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇళ్లు కట్టివ్వకపోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ చేతగానితనమని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే సామాన్యులకు ఇళ్లు కట్టించే అంశాన్ని ప్రాధాన్యతగా పెట్టుకుంటామని చెప్పారు. ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని, పిల్లల భవిష్యత్తును ఆలోచించి ఈ ఎన్నికల్లో ఓటేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ఈ ప్రాంత ప్రజల భవిష్యత్తు బాగుపడుతుందని ఖుర్షీద్ చెప్పారు.

కాళేశ్వరం రీడిజైనింగ్ సరికాదు: శ్రీధర్ బాబు



పెద్దపల్లి రూరల్: గోదావరి నదీజలాలను రివర్స్ పంపింగ్ ద్వారా మళ్లించాలనే నిర్ణయమే సరికాదని మాజీమంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రీడిజైనింగ్ పేరిట రూ.లక్షకోట్లు దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. పెద్దపల్లిలో బుధవారం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి శ్రీధర్ మాట్లాడారు. పెద్దపల్లి, మంథని సభల్లో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. నిధుల దుర్వినియోగంపై వివరణ ఇవ్వలేక పోయారని అన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పులను ఎత్తి చూపితే వాటిపై విపక్ష పార్టీలను విమర్శించడం మానుకుని బాధితుల సమస్యలు తీర్చేలా ధరణిలో సవరణలు చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పాలనలో ఇసుక, మట్టి, బూడిదలాంటి సహజ సంపదలను మాఫియాలు దోచుకుంటున్నాయని శ్రీధర్‌బాబు ఆరోపించారు.

నేడు కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ గురువారం మైనార్టీ డిక్లరేషన్‌ను ప్రకటించనుంది. నాంపల్లిలోని హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీమంత్రి సల్మాన్ ఖుర్షీద్, టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఈ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన జాతీయస్థాయి మైనార్టీ నేతలు నాసిర్ హుస్సేన్, ఇమ్రాన్ ప్రతాప్ ఘడీ, షకీల్ అహ్మద్, జమీరుద్దీన్ ఈ డిక్లరేషన్ ప్రకటన కార్యక్రమానికి హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం చేపట్టబోయే కార్యక్రమాలను కూడా ఈ కార్యక్రమంలో వెల్లడించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

టికెట్ రాలేదని ఆత్మహత్యాయత్నం

- పురుగు మందు తాగిన బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి
- ఐసీయూలో చికిత్స పొందుతున్న కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో ఆ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్..బుధవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కార్యకర్తలు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నిజామాబాద్ ఆస్పత్రిలో ఐసీయూలో ఉన్న ఆయన కోలుకుంటున్నట్లు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి..కామారెడ్డి జిల్లా బాన్సువాడ టికెట్ కోసం బాల్‌రాజ్ విశ్వప్రయత్నాలు చేశారు. అయితే అధిష్టానం ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డికి సీటు ఖరారు చేసింది. దీంతో బాల్‌రాజ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంగళవారం బాన్సువాడలో తన ఇంట్లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. 2014 నుంచి పార్టీని నమ్ముకుని కార్యకర్తలను కాపాడుకుంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తే చివరకు తనను కాదని, వేరే ప్రాంతం వ్యక్తికి టికెట్ ఇవ్వడం ఏమిటంటూ కన్నీరు పెట్టుకున్నారు.

ఆమరణ దీక్షకు దిగి ఇంతలోనే..

కాంగ్రెస్ అధిష్టానం మరోమారు టికెట్ విషయంలో పునరాలోచించాలని కోరుతూ బుధవారం ఉదయం బాల్‌రాజ్ తన ఇంటి ముందు ఆమరణ దీక్షకు పూనుకున్నారు. మధ్యాహ్నం సమయంలో తనతో పాటు దీక్షలో కుర్చున్న కార్యకర్తలను భోజనం చేయండంటూ ఇంట్లోకి పంపించారు. తాను బాత్‌రూమ్‌కు వెళ్లి వచ్చారు. వెంటనే వాంతులు చేసుకోవడం ప్రారంభించడంతో కార్యకర్తలు కంగారు పడిపోయారు. కొందరు బాత్‌రూం లోపలికి వెళ్లి చూశారు. మోనో-65 పురుగుల మందు డబ్బా కనిపించడంతో బాల్‌రాజ్‌ను హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీజేపీ బాన్సువాడ అభ్యర్థి యెండల లక్ష్మీనారాయణ ఆస్పత్రికి చేరుకుని బాల్‌రాజ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్‌లో తేలని పటాన్‌చెరు పంచాయితీ

నీలం మధుకి బీఫారం ఇవ్వని పార్టీ పెద్దలు

- శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ ఇవ్వాలని దామోదర పట్టు.. ఢిల్లీలోనే మకాం
- మధుకు బీఫారం ఇవ్వకపోవడంపై జగ్గారెడ్డి నిరసన?
- నామినేషన్ వాయిదా?



తన మద్దతుదారులతో కలసి గాంధీభవన్ వద్ద ఆందోళన చేస్తున్న నీలం మధు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో పటాన్‌చెరు టికెట్ పంచాయితీ ఇంకా పరిష్కారం కాలేదు. ఏఐసీసీ ప్రకటించిన జాబితాలో తన పేరు ఉండడంతో బీఫారం తీసుకునేందుకు నీలం మధు ముదిరాజ్ తన అనుచరులతో కలిసి బుధవారం గాంధీభవన్‌కు వచ్చారు. అయితే, ఏఐసీసీ నుంచి ఇంకా క్లియరెన్స్ రాలేదని, స్పష్టత వచ్చిన తర్వాత బీఫారం ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు ఆయనకు చెప్పారు. దీంతో మధు అనుచరులు కొంతసేపు గాంధీభవన్‌లో హడావుడి చేశారు. టికెట్ ప్రకటించి బీఫాం ఎందుకు ఇవ్వరంటూ ఆందోళన నిర్వహించారు. ఈ టికెట్ విషయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ గట్టి పట్టు పడుతున్నారు. ఏఐసీసీ ప్రకటించిన విధంగా మధుకు కాకుండా తన సన్నిహితుడు కాట శ్రీనివాస్‌గౌడ్‌కే టికెట్ ఇవ్వాలంటూ ఆయన ఢిల్లీలో మకాం వేశారు. ఈ విషయంలో తన ప్రమేయం లేదని చెపుతున్న సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా తన షెడ్యూల్‌ను రద్దు చేసుకున్నారు. వాస్తవానికి బుధవారమే ఆయన నామినేషన్ వేయాల్సి ఉన్నా ఆ కార్యక్రమానికి వెళ్లలేదు. తనకు జ్వరం వచ్చినందున బుధ, గురువారాల్లో నిర్ణయించిన షెడ్యూల్‌ను వాయిదా వేస్తున్నానని, ఈనెల 10న తాను నామినేషన్ వేస్తానని ఆయన ప్రకటించారు. అయితే, మధుకు బీఫాం ఇవ్వాలని జగ్గారెడ్డి కోరుతున్నారని, ఈ కోణంలోనే తనదైన శైలిలో నిరసన వ్యక్తం చేశారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

సంగిశెట్టి, సలీం రాజీనామా

టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ముషీరాబాద్ టికెట్ ఆశించిన సంగిశెట్టి జగదీశ్వర్‌రావు పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. పార్టీలో బీసీలకు అన్యాయం చేసినందున తాను రాజీనామా చేస్తున్నట్టు ఆయన చెప్పారు. తన రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. మైనార్టీ నేత సలీం కూడా కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు ఆయన తన రాజీనామా లేఖను పంపారు.

కాంగ్రెస్‌లో చేరిన తీన్మార్ మల్లన్న

తీన్మార్ మల్లన్నగా గుర్తింపు పొందిన చింతపండు నవీన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయనకు రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు బోసురాజు, గురుదీప్ సిప్పల్, ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథ్, రోహిత్ చౌదరి, మన్సూర్ అలీఖాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, నవీన్ భార్యకు తుంగతుర్తి టికెట్ కేటాయించనున్నట్టు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అలాగే, ఇబ్రహీంపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట మున్సిపల్ చైర్ పర్సన్ చెవుల స్వప్న చిరంజీవి తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు

బుధవారం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం ఉదయమే జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున కార్యకర్తలు చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

అల్పాహారానికి అగచాట్లు

నిధులే ఇవ్వకుంటే నడిపేదెలా?

- మంజూరుకాని పెండింగ్ బిల్లులు
- ఎన్నాళ్లు సొంత డబ్బులు పెట్టుకోవాలంటున్న వంట కార్మికులు
- నిధులొచ్చేదాకా వండలేమంటున్న వైనం

సాక్షి, హైదరాబాద్: ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్, రవ్వ కిచిడీ, టమాటో బాత్... ఇలా రోజుకో వంట చొప్పున విద్యార్థులకు అల్పాహారం పెట్టే పథకానికి చిక్కులు ఎదురవుతున్నాయి. విద్యాశాఖ నుంచి స్పష్టమైన విధివిధానాలు కొరవడటంతో ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహారానికి ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అన్నిచోట్లా వంట కార్మికులు అల్పాహారం నిర్వహణపై విముఖత చూపుతున్నారు. విద్యార్థులకు స్కూల్ మొదలవ్వడానికి 45 నిమిషాల ముందే అల్పాహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఆలోచనతో దేశానికే రాష్ట్రం ఆదర్శవంతమవుతుందని పేర్కొంది. వాస్తవానికి ఈ పథకాన్ని దసరా తర్వాత నుంచి మొదలు పెట్టాలనుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్న సంకేతాలతో అక్టోబర్ 6న అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గానికో స్కూలు చొప్పున ప్రారంభించారు. దసరా సెలవుల తర్వాత క్రమంగా దీన్ని విస్తరిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. మండలానికి ఒక స్కూలు చొప్పున ప్రస్తుతం అల్పాహారం ఇస్తున్నారు. కానీ ఆయా బడుల్లో కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

డబ్బులు ఇచ్చే వరకూ వండేదే లేదు..

ప్రస్తుతం ఉన్న మధ్యాహ్న భోజనం వంట కార్మికులే వీటిని తయారు చేయాలని ఆదేశించారు. ఒక్కో విద్యార్థికి రూ. 10.80 చొప్పున చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని వంట కార్మికులు అల్పాహారానికి అవసరమైన వస్తువుల కోసం వినియోగించాలి. కార్మికులకు నెల వారీ గౌరవ వేతనం అందుతుంది. అయితే, ఇప్పటివరకూ అల్పాహార నిధులపై ప్రభుత్వం ఎలాంటి జీవో విడుదల చేయలేదు. నిధులూ మంజూరవ్వలేదు. పథకానికి సంబంధించిన విధివిధానాలను ఉన్నతాధికారులు ఇప్పటివరకూ వెల్లడించలేదు. దీంతో తామే సొంత డబ్బులతో సరుకులు తెస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. చాలాచోట్ల మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులూ పెండింగ్‌లో ఉన్నాయని వాపోతున్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వక, అల్పాహారానికి నిధులు ఇవ్వకపోతే తాము ఎంతకాలం సొంత డబ్బులు పెట్టుకుంటామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బడుల్లో అల్పాహారం వండేందుకు కార్మికులు ఇష్టపడటం లేదు. డబ్బులు ఇచ్చే వరకూ వండేదే లేదని తెగేసి చెబుతున్నారు. హెచ్ఎంలు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేసినా, వారి నుంచి స్పందన ఉండట్లేదని పలువురు హెచ్ఎంలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 27147 స్కూళ్లలో... 23 లక్షల మందికి అల్పాహారం అందించాల్సి ఉంటుంది. వెయ్యి మంది ఉండే స్కూల్లో కార్మికులు రోజుకు రూ. 10 వేలు వెచ్చించాల్సి ఉంటుంది. ఇది తమకు శక్తికి మించిన వ్యవహారమేనని వారు అంటున్నారు.

స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి

విద్యా సంస్థల్లో అల్పాహారం పథకాన్ని అమలు చేయాలని చెప్పిన అధికారులు... అవసరమైన నిధులపై మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పేద కుటుంబాల నుంచి వచ్చే కార్మికులు సొంత డబ్బులతో ఈ పథకాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తారు? అధికారులు తక్షణమే విధివిధానాలకు సంబంధించిన సర్క్యులర్ ఇవ్వడంతోపాటు అల్పాహారానికి ఖర్చయ్యే నిధులు విడుదల చేయాలి.

–ఎస్వీ రమ (మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి)

క్లుప్తంగా...



రామన్నకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న లక్ష్మణ్

కేసీఆర్ తెలంగాణను అమ్మకానికి పెట్టారు

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్
- బీజేపీలో చేరిన కొల్లాపూర్ బీసీ నేత సింగోట రామన్న

సాక్షి, హైదరాబాద్: అమ్మ వంటి తెలంగాణను సీఎం కేసీఆర్ అమ్మకానికి పెడుతున్నారు.. అలాగే దేశాన్ని కాంగ్రెస్ పార్టీ అమ్మకోవాలని చూసిందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలోని బీసీలనే కాదు.. అన్ని వర్గాలనూ కేసీఆర్ వంచించారన్నారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ ఇస్తే కూడా కేసీఆర్ తట్టుకోలేదన్నారు. బీజేపీ బీసీ సీఎం అని ప్రకటిస్తే, 2 శాతం ఓట్లు వస్తాయని బీసీలను రాహుల్ హేళన చేసేలా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామన్నారు. బుధవారం కత్రియా హోటల్ మీడియా సెంటర్‌లో కొల్లాపూర్‌కు చెందిన బీసీ నేత, సంఘ సేవకుడు సింగోట రామన్న బీజేపీలో చేరారు. రామన్నకు కండువా కప్పి లక్ష్మణ్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు ఆశీర్వదించి ఓటేస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతారని ప్రధాని మోదీ ప్రకటించారన్నారు. మోదీ బీసీ బహిరంగ సభపై ప్రజల్లో అద్భుతమైన చర్చ జరుగుతోందన్నారు. బీసీ అభ్యర్థి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో ఒక కుటుంబం కోసం, కాంగ్రెస్ దేశంలోని ఒక కుటుంబం కోసం పని చేసే పార్టీలని మండిపడ్డారు.

ఏం పాపం చేశారని సంజయ్‌ను పక్కన పెట్టారు: వీహెచ్

ఏపీకీ ప్రత్యేక హోదా ఏమైందో మోదీని పవన్ అడగాలి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు వచ్చాయని బీజేపీ నేతలు జై బీసీ అంటున్నారని, వారికి బీసీల అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు విమర్శించారు. రాష్ట్రం మొత్తం తిరిగి పార్టీ కోసం కష్టపడిన ఎంపీ బండి సంజయ్ ఏం పాపం చేశారని ఆయన్ను పక్కనపెట్టారో బీజేపీ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ...బీసీ బిడ్డను అధ్యక్ష పదవిని తొలిగించి బీసీలను సీఎంని చేస్తామని బీజేపీ చెబితే నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. మోదీ ప్రధాని అయినా జాతీయ స్థాయిలో బీసీల కులగణన చేయలేద ని, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయ లేదని విమర్శించారు. ఇప్పుడు బీసీ మంత్రం పఠిస్తున్నారని, బీసీ సంఘాలు, బీసీ వర్గాలకు చెందిన ప్రజలు బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రధాని మోదీని జనసేన అధ్యక్షుడు పవన్ సమర్థించేముందు ఏపీకి ప్రత్యేక హోదా ఏమైందో మోదీని అడగాలని కోరారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి: బూర



సాక్షి, హైదరాబాద్: బీసీలను ఉద్దేశించి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. రాహుల్ చేసిన వ్యాఖ్యలు ప్రతి బీసీ మనసును గాయపరిచాయని ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడు తూ రాష్ట్రంలో 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీకి బీసీని సీఎం చేసే దమ్ము, ధైర్యం లేకుండా పోయిందన్నారు. గతంలో దేవెగౌడ ప్రధాని అయితే పది నెలల్లోనే పడగొట్టి బీసీ వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ నిరూపించుకుందని నర్సయ్య గుర్తుచేశారు. ఎల్బీ స్టేడియంలో బీసీ ఆత్మ గౌరవ సభలో మోదీ గర్జించారన్నారు.

కాళేశ్వరం వరదాయిని కావాలి

సాక్షి, హైదరాబాద్: రూ.లక్ష కోట్ల ప్రభుత్వ ధనం ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కలకాలం తెలంగాణ ప్రజలకు వరదాయినిగా ఉండాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి కోరారు. కానీ స్వల్పకాలంలోనే ప్రాజెక్టు దెబ్బ తినడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రచారంలో బాలల్ని వినియోగించవద్దు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలు బాలలను ఉపయోగించుకోవడం నిషిద్ధమని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ, ఎన్నికలు, రిటర్నింగ్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలకు సూచనలు కూడా పంపిందని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

జగనే ఎందుకంటే..

నాలుగున్నరేళ్ల అభివృద్ధి-సంక్షేమ పాలనపై నేటి నుంచి భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం

- తొలిరోజు రాష్ట్రంలో 711 సచివాలయాల పరిధిలో ప్రారంభం.. ఆయా చోట్ల చేకూర్చిన లబ్ధి వివరాలతో సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ
- స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం.. పాల్గొననున్న గృహ సారథులు, పార్టీ సానుభూతిపరులు, సీఎం జగన్ అభిమానులు
- గత సర్కారుకు - వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని చాటి చెప్పేందుకు సన్నద్ధం
- మరుసటి రోజు నుంచి ఇంటింటి ప్రచారం.. 24 పేజీలతో ప్రత్యేక బుక్‌లెట్ పంపిణీ.. ఒక రోజు ముందే కార్యక్రమం వివరాలతో ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం
- వలంటీర్ల ఆధ్వర్యంలో రోజుకు 15 కుటుంబాలను సందర్శించేలా షెడ్యూల్.. 23వతేదీ వరకు 7,610 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహణ



సాక్షి, అమరావతి: చరిత్ర పుటలు ఎరుగని విప్లవాత్మక పాలనతో నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును వివరిస్తూ రూపొందించిన భారీ కార్యక్రమం 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..) గురువారం నుంచి ప్రారంభం కానుంది. పరిపాలనా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాల ద్వారా దేశమంతా ప్రశంసించేలా మన రాష్ట్రం సాధించిన పురోభివృద్ధిని అందరికీ క్షుణ్నంగా తెలియజెప్పేలా దీనికి రూపకల్పన చేశారు. మండలం ప్రాతిపదికన ప్రతి మండలంలో రోజుకొక సచివాలయం పరిధిలో ఈ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా 711 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వేడుకగా ప్రారంభం కానుంది. గ్రామాలు, పట్టణాలు, నగరాలలో ఏయే పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారనే వివరాలతో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సంక్షేమ అభివృద్ధి బోర్డులను ఆవిష్కరిస్తారు. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్య ఆయా సచివాలయాల పరిధిలో దీన్ని నిర్వహిస్తారు. స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో చేపట్టే ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ప్రముఖులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తారు. గృహ సారథులు, పార్టీ సానుభూతిపరులు, సీఎం వైఎస్ జగన్ అభిమానులు ఇందులో పాల్గొంటారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా జరిగిన ప్రగతి, సాకారమైన మార్పులను తెలియచేయడంతోపాటు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తారు. సచివాలయ పరిధిలోని ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ఒక రోజు ముందే వివరాలను ఎస్‌ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. ఆ తర్వాత రోజు నుంచి వలంటీర్లు వారి పరిధిలో రోజుకు 15 ఇళ్ల చొప్పున సందర్శించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కొత్తగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి చెప్పడంతో పాటు ఆయా కుటుంబాలకు ఎలాంటి లబ్ధి చేకూరింది? ఆ గ్రామానికి ఎంత మేలు జరిగింది? అనే వివరాలను సమగ్రంగా వెల్లడిస్తారు. ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ఐదు రోజుల పాటు, వార్డు సచివాలయం పరిధిలో దాదాపు 7 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సచివాలయాల వారీగా ఏర్పాటు చేసే సంక్షేమ, అభివృద్ధి బోర్డులను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఇప్పటికే ఆయా ప్రాంతాలకు చేరవేసింది.

24 పేజీలతో ప్రత్యేక బుక్‌లెట్లు

వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..) పేరుతో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా 24 పేజీలతో కూడిన ప్రత్యేక బుక్‌లెట్లను రూపొందించారు. వలంటీర్లు ఇంటింటి సందర్శనకు వెళ్లిన సమయంలో వీటిని ప్రతి నివాసంలోనూ పంపిణీ చేస్తారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రజలకు ప్రభుత్వ సేవలను గడప వద్దే అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సచివాలయాలు - వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పిన విషయం తెలిసిందే. పునర్విభజనతో 26 జిల్లాల ఏర్పాటు, వివక్షకు తావులేకుండా సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాల అమలు, నవరత్నాల పథకాల ద్వారా ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాల కల్పన, సామాజిక న్యాయం నినాదంతో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు సముచిత స్థానం, మహిళా సాధికారితకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరిస్తూ సీఎం జగన్ తనదైన ముద్రతో చేపట్టిన పాలనా సంస్కరణలతో ప్రత్యేకంగా బుక్‌లెట్‌ను రూపొందించారు. అభివృద్ధిపై జాతిపిత గాంధీజీ మొదలు రాజ్యాంగ రూపకర్త బీఆర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, నోబెల్ గ్రహీతలు అమర్త్యసేన్, అభిజిత్ బెనర్జీ, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తదితరుల నిర్వచనాలను బుక్‌లెట్‌లో ప్రత్యేకంగా ప్రచురించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల జీవితాల్లో చోటు చేసుకున్న మార్పులు, తలసరి ఆదాయం, జీఎస్‌డీపీ పెరుగుదల, పారిశ్రామిక వృద్ధి రేటు, పరిశ్రమల ఏర్పాటు, ఎంఎస్‌ఎంఈల ద్వారా కొత్తగా ఉద్యోగాల కల్పన, సమగ్ర భూ సర్వే, రైతు భరోసా, ఇతర కార్యక్రమాల ద్వారా అన్నదాతలకు అందిస్తున్న తోడ్పాటు, వ్యవసాయ వృద్ధి రేటులో పెరుగుదల, అమ్మ ఒడి, నాడు - నేడు ద్వారా మారిపోయిన ప్రభుత్వ స్కూళ్ల స్వరూపం, ఆరోగ్య ఆసరా, ఫ్యామిలీ డాక్టర్ లాంటి వినూత్న కార్యక్రమాలతో పాటు వైద్య రంగంలో భారీ మౌలిక వసతుల కల్పనతో పేదలకు సులభంగా అందుతున్న వైద్య సేవలు, పింఛన్లు, సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో చోటు చేసుకున్న మార్పులు, దిశ యాప్, పొదుపు సంఘాలకు ప్రోత్సాహం, మహిళా సాధికారిత కోసం చేపట్టిన చర్యలు, రాష్ట్రంలో కొత్తగా పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణం, పేదలందరికీ ఇళ్లు, మౌలిక వసతుల కల్పన లాంటి వివరాలను బుక్‌లెట్‌లో పొందుపరిచారు. మొత్తంగా వివిధ కార్యక్రమాల ద్వారా నాలుగున్నరేళ్లలో ప్రతి ఒక్కరికీ చేకూరిన లబ్ధి, గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు ప్రజలకు జరిగిన మేలును సోదాహరణంగా వివరిస్తూ బుక్‌లెట్ రూపుదిద్దుకుంది. పేదల జీవితాలు బాగు పడేవరకు ఈ కార్యక్రమాలు కొనసాగాలన్న సీఎం జగన్ ఆకాంక్షను బుక్‌లెట్‌లో ప్రత్యేకంగా ఉదహరించారు.

వలంటీర్లు రోజుకు 15 ఇళ్ల సందర్శన

నాలుగున్నరేళ్లలో ప్రతి గడపకూ జరిగిన మంచిని వలంటీర్లు ఇంటింటి సందర్శన సమయంలో ఆయా కుటుంబ సభ్యులందరికీ సమగ్రంగా తెలియజెప్పేలా రోజుకు 15 ఇళ్ల చొప్పున మాత్రమే సందర్శించేలా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందించింది. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సచివాలయం పరిధిలో ఎంత ప్రయోజనం పొందుతున్నారో వలంటీర్లు ప్రతి కుటుంబానికి తెలియజేస్తారు. ఒకవేళ ఎవరికైనా ఏమైనా అందకుంటే సత్వరమే వారికి అందించి ప్రయోజనం చేకూర్చేలా చర్యలు చేపడతారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా సాకారమైన మార్పులను వివరిస్తారు. ఇంగ్లీషు మీడియం, స్కూళ్లలో 6వ తరగతి నుంచే ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, 8వ తరగతిలో ట్యాబ్‌లు పంపిణీ వరకూ మారిపోయిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ గురించి తెలియచేస్తారు. వైద్య రంగంలో విలేజ్ క్లినిక్స్‌తో సహా గ్రామంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, ఆర్బీకేలు లాంటి వ్యవస్థతో వ్యవసాయ రంగంలో మునుపెన్నడూ చూడని మార్పుల గురించి ప్రతి ఇంటికీ వివరిస్తారు. పథకాల అమలులో పూర్తి పారదర్శకత, సోషల్ ఆడిట్‌తో ప్రజలకు అందుతున్న నాణ్యమైన సేవల తీరును వివరిస్తారు. దిశ యాప్, ప్రభుత్వ పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు గురించి వలంటీర్లు తెలియజేస్తారు. ఆర్థిక ప్రగతిలో గతంలో ఎలా ఉన్నాం? ఇప్పుడు ఎలా ఉన్నాం? అన్న అంశాలను ప్రతి ఇంటికీ చాటి చెబుతారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్ కోసం ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది? గడప గడపకూ మన ప్రభుత్వం సమయంలో ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారం కోసం చేసిన వ్యయం వివరాలను వలంటీర్లు ఇంటింటికీ వివరించి చెప్పనున్నారు.

షెడ్యూల్ వివరాలతో సచివాలయాలకు సమాచారం..

రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు గురువారం 711 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో కలిపి మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా మండలాల ప్రాతిపదికన రోజుకొక సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని ఆరంభిస్తారు. నగరాలు, పెద్ద పట్టణాల్లో సులభంగా కొనసాగించేలా చిన్న ప్రాంతాలుగా వర్గీకరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో కలిపి మొత్తం దాదాపు 900 మండలాల ప్రాతిపదికన కార్యక్రమం అమలుకు కార్యాచరణ సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈవోపీఆర్‌డీ, పట్టణ ప్రాంతాల్లో అడిషనల్ కమిషనర్లు దీనికి నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు. ఈ నెల 23వతేదీ వరకు 7,610 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఏ రోజు, ఎక్కడ కార్యక్రమాన్ని నిర్వహిస్తారనే వివరాలతో ఇప్పటికే షెడ్యూల్ రూపొందించి కలెక్టర్ల ద్వారా ఆయా సచివాలయాలకు సమాచారం అందించినట్లు అధికారులు వెల్లడించారు. మిగతా సచివాలయాలకు కూడా త్వరలో షెడ్యూల్ ఖరారు కానుంది. సచివాలయాల పరిధిలో 'సంక్షేమం, అభివృద్ధి బోర్డు' ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే ఎవరెవరు దీనికి హాజరయ్యారనే వివరాలతోపాటు ఫోటోను ఆయా మండల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ప్రభుత్వాల చెలగాటం... 'న్యాక్'కు నిధుల సంకటం

- స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు అవాంతరం
- చివరకు కార్పొరేట్ సంస్థల సాయంతో శిక్షణ కొనసాగిస్తున్న న్యాక్
- ఏడాదిగా రెండు కార్పొరేట్ కంపెనీలు, నాబార్డ్ సాయం
- మరిన్ని సంస్థల కోసం ఎదురు చూస్తున్న సంస్థ



సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక పరమైన అంశాల్లో నెలకొన్న వివాదాలు ఇప్పుడు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు అడ్డంకిగా మారాయి. ఈ వివాదం వల్ల న్యాక్‌కు నిధులు రావటం నిలిచిపోవటంతో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహణ ఇబ్బందిలో పడింది. ఏడాదిగా నిధుల కోసం నానాతిప్పలు పడుతున్న నాక్ యంత్రాంగం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద బడా సంస్థల వద్దకు వెళ్లి నిధులు సమీకరించుకుని కార్యక్రమాలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు కార్పొరేట్ సంస్థలతో పాటు, నాబార్డ్ చేసిన ఆర్థిక సాయంతో కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇప్పుడు మరిన్ని సంస్థలు ముందుకొచ్చి సాయం చేస్తే, కొత్త బ్యాచ్‌లను ఏర్పాటు చేసి మరిన్ని బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వాలని యత్నిస్తున్నారు. గతంలో విదేశీ యువతకు కూడా శిక్షణ ఇచ్చి అంతర్జాతీయంగానూ ఖ్యాతి పొందిన న్యాక్‌కు.. ప్రభుత్వ విభాగాలు ఆర్థిక క్రమశిక్షణ తప్పటంతో నిధుల కోసం రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించింది.

నిధుల వ్యయంపై అభిప్రాయభేదాలు..

న్యాక్ కోర్సులకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోంది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇస్తోంది. ఇది 70:30 దామాషాగా విడుదలవుతున్నాయి. తాను ఇస్తున్న నిధులకు సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సరిగా దాఖలు కావటం లేదని, కొన్ని నిధులు ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని కేంద్రం సందేహాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ విషయంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ విభాగాల మధ్య అభిప్రాయభేదాలు నెలకొన్నాయి. అవి రానురాను పెద్దవి కావటంతో ఏడాది క్రితం కేంద్రం నిధుల విడుదలను ఆపేసినట్టు తెలిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా నిలిచిపోయి, న్యాక్‌కు నిధుల సమస్య ఉత్పన్నమైంది. మూడు నెలల కోర్సులను బ్యాచ్‌ల వారీగా నిర్వహిస్తున్న న్యాక్ వద్ద పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పోగయ్యాయి. ఈ తరుణంలో చేతిలో నిధులు లేకుండా పోయాయి. దీంతో న్యాక్ ఉన్నతాధికారులు కార్పొరేట్ కంపెనీలను సంప్రదించటం ప్రారంభించారు. అలా తొలుత తాన్లా ప్లాట్‌ఫామ్స్, జీఐపీఎల్ సంస్థలు 350 మంది శిక్షణకు కావాల్సిన నిధులు అందించాయి. ఒక్కో అభ్యర్థికి రూ. లక్ష వరకు ఫీజు ఉండే కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోర్సు, క్వాంటిటీ సర్వే కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ లాంటి పీజీ కోర్సులు కూడా వాటితో నిర్వహిస్తుండటం విశేషం. ఇక మరో 200 మంది అభ్యర్థులతో కూడిన బ్యాచ్‌ల శిక్షణకు కావాల్సిన నిధులను నాబార్డు సమకూర్చింది. వీటితో ఇప్పటి వరకు శిక్షణ నిర్వహిస్తున్నారు.

మరిన్ని సంస్థలు ముందుకొస్తే విస్తరిస్తాం...

"సీఎస్ఆర్ నిధులతో శిక్షణ కార్యక్రమాలు విస్తరించాలని నిర్ణయించాం. ఇప్పటికి తాన్లా ప్లాట్‌ఫామ్స్, జీఐపీఎల్, నాబార్డు నిధులు అందించాయి. ఈ డిసెంబరులో కేంద్ర ప్రభుత్వ నిధులు కొన్ని రాబోతున్నాయి. వాటికి అదనంగా సీఎస్ఆర్ కింద కార్పొరేట్ కంపెనీలు సాయం అందిస్తే న్యాక్ మరింత ఉన్నతంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుంది'అని న్యాక్ డీజీ బిక్షపతి పేర్కొన్నారు. పెద్దపెద్ద నిర్మాణ సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి న్యాక్ శిక్షణార్థులను ఎంపిక చేసుకుంటున్నందున కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ నిధులతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని న్యాక్ ప్లేస్‌మెంట్ డైరక్టర్ శాంతిశ్రీ కోరారు.

ఇదీ పరిస్థితి..

ఉన్నత విద్య చదువుకోలేని పరిస్థితిలో చదువు మానేసిన ఎంతోమంది యువతీయువకులకు భవన నిర్మాణ రంగానికి సంబంధించిన వివిధ విభాగాల్లో న్యాక్ శిక్షణ ఇస్తోంది. ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్, ఫాల్స్ సీలింగ్, భవన నిర్మాణ సూపర్‌వైజింగ్, వెల్డింగ్, కన్‌స్ట్రక్షన్ సర్వే అంశాల్లో తర్ఫీదు పొందుతున్న అభ్యర్థులకు దేశవిదేశాల్లోని నిర్మాణ సంస్థల్లో ఉపాధి దొరుకుతోంది. గతంలో కేవలం భవన నిర్మాణంలోని వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చిన న్యాక్.. ఆ తర్వాత పీజీ కోర్సులను కూడా ప్రారంభించింది. బీటెక్ సివిల్ అభ్యర్థులు, ఇంజినీర్లకు కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కోర్సు, క్వాంటిటీ సర్వే కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులు నిర్వహిస్తోంది. ఇలాంటి తరుణంలో నిధుల సమస్య ఉత్పన్నమై న్యాక్‌ను గందరగోళంలో పడేసింది.



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జరిగిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

అదే హోరు.. అదే జోరు

- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారయాత్రకు జననీరాజనం
- సాలూరు, పాలకొల్లు, కనిగిరి నియోజకవర్గాల్లో యాత్ర గ్రాండ్ సక్సెస్

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయనగరం/సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అదే నినాదం.. 'జగనే రావాలి - జగనే కావాలి'.. అదే హోరు.. అదే జోరు.. బుధవారం రాష్ట్రంలో జరిగిన సామాజిక సాధికార యాత్ర దృశ్యమిది. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మేలును వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలుకుతున్నారు. బుధవారం పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు, ప్రకాశం జిల్లాలో కనిగిరి నియోజకవర్గాల్లో యాత్ర సాగింది. మూడు నియోజకవర్గాల్లోనూ యాత్రకు జనం పోటెత్తారు. సామాజిక న్యాయ సారథి సీఎం వైఎస్ జగన్‌కు జేజేలు పలికారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ నినదించారు. గురువారం సామాజిక సాధికార యాత్ర అనకాపల్లి జిల్లా అనకాపల్లి, కృష్ణా జిల్లా పామర్రు, నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గాల్లో జరుగుతుంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



జర్నలిస్టుల సంఘం నాయకులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

99.5% హామీలు నెరవేర్చాం

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల హామీనీ నిలబెట్టుకున్నాం
- ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సీఎం జగన్‌ను కలిసిన జర్నలిస్టు సంఘం నాయకులు, సీనియర్ జర్నలిస్టులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్న నిర్ణయం ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొన్నామని, దాంతోపాటు మేనిఫెస్టోలో పేర్కొన్న 99.5 శాతం హామీలను నెరవేర్చామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘం నాయకులు సీఎం వైఎస్ జగన్‌ను బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సమావేశంలో అధికారులు కూడా పాల్గొన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయమని సీఎం జగన్ అధికారులను అక్కడే ఆదేశించారు. జాప్యానికి తావులేకుండా భూముల గుర్తింపు, ఇతర అన్ని అంశాలపై నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వెళ్లాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. పురోగతిని ఎప్పటికప్పుడు తనకు నివేదించాలన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన పాత్రికేయులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నందుకు సీఎం వైఎస్ జగన్‌కి జర్నలిస్టు సంఘం నాయకులు, సీనియర్ పాత్రికేయులు కృతజ్ఞతలు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఇళ్ల స్థలాలు ఇచ్చారని వారు గుర్తుచేశారు. అప్పుడు ఇళ్ల స్థలాలు పొందిన జర్నలిస్టులు ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత సీఎం జగన్ మాత్రమే ఇళ్ల స్థలాలు ఇస్తున్నారని అన్నారు. ఇందుకు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సీఎంతో అన్నారు. కొందరికే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అర్హత ఉన్న ప్రతి జర్నలిస్టుకీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, సమాచార, పౌర సంబంధాల కమిషనర్ టి. విజయకుమార్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఎం జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పాత్రికేయుల్లో ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు (జాతీయ మీడియా) దేవులపల్లి అమర్, సాక్షి దినపత్రిక రెసిడెంట్ ఎడిటర్ ఎం.రమణమూర్తి, సాక్షి టీవీ మేనేజింగ్ ఎడిటర్ నేమాని భాస్కర్, ఏపీయూడబ్ల్యూజెఎఫ్ నేతలు జి.ఆంజనేయులు, ఎస్.వెంకటరావు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి.వి.ఆర్. కృష్ణంరాజు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ భాస్కర్, స్వర్ణాంధ్ర పత్రిక ఎడిటర్ కె.బి.జి. తిలక్, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి దారా గోపి, ది హిందూ ప్రతినిధి అప్పాజీ రెడ్డిమ్, దక్కన్ క్రానికల్ ప్రతినిధి ఎండీ ఇలియాస్, సీనియర్ జర్నలిస్టులు కోన సుధాకర్ రెడ్డి, ఎ.రవీంద్రారెడ్డి, రెహానా, ఎస్.హసీనా తదితరులు ఉన్నారు.

ఏపీ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ భార్య ప్రసవం

- మగబిడ్డ జననం..తల్లీబిడ్డ క్షేమం
- ఆదర్శంగా నిలిచిన కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఆయన ఆ జిల్లాకే ప్రధాన అధికారి. ఆయన తలచుకుంటే కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందగలరు. కానీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. ధైర్యంగా తన భార్యకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం చేయించారు. పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆయన మరెవరో కాదు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్. వివరాల్లోకి వెళితే...పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ భార్య కరుణ బుధవారం సాయంత్రం మగబిడ్డకు జన్మనిచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, వైద్యులు త్రివేణి, చిన్నపిల్లల వైద్యుడు బి.గణేష్ చైతన్య వైద్యసేవలందించి సుఖప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ గతంలో రంపచోడవరం ఐటీడీఏ పీవోగా పనిచేసిన సమయంలో అక్కడి సమీపంలోని ప్రభుత్వాస్పత్రిలోనే ఆయన భార్య తొలి సంతానంగా ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అలాగే పార్వతీపురంలో పనిచేసిన జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ భార్య కూడా ఇటీవల 108 వాహనంలో వెళ్లి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోనే మగబిడ్డకు జన్మనిచ్చిన సంగతి తెలిసిందే.



కలెక్టర్ దంపతులకు అభినందనలు తెలుపుతున్న పార్వతీపురం ప్రభుత్వాస్పత్రి వైద్యబృందం

బీసీ సీఎం ప్రకటన విడ్డూరం



సాక్షి, హైదరాబాద్: కులగణనను వ్యతిరేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణలో బీసీని సీఎం చేస్తామనడం విడ్డూరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధికారాలను కల్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తానన్న మోదీ మోసపు ఉపన్యాసాన్ని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణలో వెట్టిచాకిరీ నిర్మూలన కోసం జరిగిన సాయుధ పోరాటంతో పాటు, కొమురంభీం ఇచ్చిన 'జల్ జంగల్ జమీన్'నినాదాన్ని అమలు చేస్తామన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగించాయని తమ్మినేని పేర్కొన్నారు.

ఉప్పల్ టి20 మ్యాచ్ బెంగళూరుకు తరలింపు



భారత్, ఆస్ట్రేలియా మధ్య టి20 సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లో జరగాల్సిన చివరిదైన ఐదో టి20 మ్యాచ్ వేదిక మారింది. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 3న ఈ మ్యాచ్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరగాల్సి ఉంది. అయితే అదే రోజు తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు ఉన్న నేపథ్యంలో తాము భద్రత కల్పించలేమని పోలీసులు స్పష్టంగా చెప్పేశారు. దాంతో ఈ మ్యాచ్‌ను బీసీసీఐ బెంగళూరుకు మార్చింది. ఈ విషయంపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కొత్త కమిటీ బీసీసీఐ అధికారులతో సమావేశమైంది. మరో తేదీన తమకు మ్యాచ్ నిర్వహించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసినా... ఆసీస్ టీమ్ స్వదేశం తిరిగి వెళ్లే ఏర్పాట్లలో మార్పు చేసే అవకాశం లేదని చెప్పిన బోర్డు ఈ మ్యాచ్‌ను బెంగళూరులో నిర్వహించేందుకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా ఈ నెల 23న విశాఖపట్నంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి పోరు జరుగుతుంది.

నంబర్‌వన్ గిల్

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో తొలిసారి అగ్రస్థానానికి
- బౌలింగ్‌లో సిరాజ్‌కు మళ్లీ టాప్ ర్యాంక్





దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ 830 రేటింగ్ పాయింట్లతో నంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. ఏప్రిల్ 2021 నుంచి టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్న పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ (824)ను గిల్ రెండో స్థానానికి నెట్టాడు. 2023లో అద్భుత ఫామ్‌లో ఉన్న గిల్ 26 వన్డేల్లో 63 సగటుతో 1449 పరుగులు చేశాడు. సచిన్, ధోని, కోహ్లి తర్వాత భారత్ తరఫున వన్డేల్లో ఐసీసీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్న నాలుగో ఆటగాడిగా గిల్ నిలిచాడు. బౌలింగ్‌లో హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ (709 రేటింగ్ పాయింట్లు) మరోసారి నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. గతంలో రెండుసార్లు 'టాప్'నకు చేరి ఆ తర్వాత తన స్థానాన్ని కోల్పోయిన సిరాజ్ వరల్డ్ కప్‌లో 10 వికెట్ల ప్రదర్శనతో మళ్లీ అగ్ర స్థానానికి వచ్చాడు. నంబర్‌వన్‌గా ఉన్న షాహీన్ అఫ్రిది (పాక్) ఐదో స్థానానికి పడిపోయాడు. భారత్ నుంచి టాప్-10లో కుల్దీప్ (4వ స్థానం), బుమ్రా (8వ స్థానం), షమీ (10వ స్థానం)లో ఉన్నారు. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. కొన్నాళ్లుగా టెస్టు, వన్డే, టి20 టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టే టాప్ ర్యాంక్‌లో ఉంది. టి20 బ్యాటింగ్‌లో సూర్యకుమార్.. టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అశ్విన్... టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో జడేజా నంబర్‌వన్‌గా ఉన్నారు.

బెన్ స్టోక్స్ సెంచరీ

- ఎట్టకేలకు ఇంగ్లండ్ ఖాతాలో రెండో విజయం
- 160 పరుగులతో నెదర్లాండ్స్ చిత్తు

పుణే: వరల్డ్‌కప్‌లో వరుసగా ఐదు మ్యాచ్‌లలో ఓడి సెమీఫైనల్ అవకాశాలు కోల్పోయిన తర్వాత ఇంగ్లండ్ టోర్నీలో తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. టోర్నీ తొలి పోరులో న్యూజిలాండ్ చేతిలో ఓడి, అనంతరం బంగ్లాదేశ్‌పై నెగ్గిన ఇంగ్లండ్.. ఆపై వరుసగా అఫ్గానిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్, ఆస్ట్రేలియా జట్ల చేతిలో చిత్తయింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 160 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బెన్ స్టోక్స్ (84 బంతుల్లో 108; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... డేవిడ్ మలాన్ (74 బంతుల్లో 87; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), క్రిస్ వోక్స్ (45 బంతుల్లో 51; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఒకదశలో 133/1తో మెరుగైన స్థితిలో కనిపించిన ఇంగ్లండ్.. తర్వాతి 15 ఓవర్లలో 59 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి 192/6 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో స్టోక్స్, వోక్స్ ఏడో వికెట్‌కు 13.3 ఓవర్లలోనే 129 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నారు. అనంతరం నెదర్లాండ్స్ 37.2 ఓవర్లలో 179 పరుగులకే ఆలౌటైంది. తేజ నిడమనూరు (34 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... స్కాట్ ఎడ్వర్డ్స్ (38), వెస్లీ బరేసి (37), సైబ్రాండ్ (33) ఫర్వాలేదనిపించారు. తాజా విజయంతో ఏడో స్థానానికి చేరిన ఇంగ్లండ్ 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశాలను ప్రస్తుతానికి సజీవంగా ఉంచుకుంది.



బెన్ స్టోక్స్

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: బెయిర్‌స్టో (సి) మీకెరెన్ (బి) దత్ 15; మలాన్ (రనౌట్) 87; రూట్ (బి) వాన్ బీక్ 28; స్టోక్స్ (సి) సైబ్రాండ్ (బి) వాన్ బీక్ 108; బ్రూక్ (సి) అకెర్‌మన్ (బి) డి లీడ్ 11; బట్లర్ (సి) తేజ (బి) మీకెరెన్ 5; అలీ (సి) డి లీడ్ (బి) దత్ 4; వోక్స్ (సి) ఎడ్వర్డ్స్ (బి) డి లీడ్ 51; విల్లీ (సి) సైబ్రాండ్ (బి) డి లీడ్ 6; అట్కిన్సన్ (నాటౌట్) 2; రషీద్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 339.** వికెట్ల పతనం: 1-48, 2-133, 3-139, 4-164, 5-178, 6-192, 7-321, 8-327, 9-334. బౌలింగ్: ఆర్యన్ దత్ 10-0-67-2, వాన్ బీక్ 10-0-88-2, మీకెరెన్ 10-0-57-1, డి లీడ్ 10-0-74-3, వాన్‌డర్ మెర్వ్ 3-0-22-0, అకెర్‌మన్ 7-0-31-0.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: వెస్లీ బరేసి (రనౌట్) 37; మ్యాక్స్ ఒ డౌడ్ (సి) అలీ (బి) వోక్స్ 5; అకెర్‌మన్ (సి) బట్లర్ (బి) విల్లీ 0; సైబ్రాండ్ (సి) వోక్స్ (బి) విల్లీ 33; ఎడ్వర్డ్స్ (సి) మలాన్ (బి) అలీ 38; డి లీడ్ (బి) రషీద్ 10; తేజ నిడమనూరు (నాటౌట్) 41; వాన్ బీక్ (సి) మలాన్ (బి) రషీద్ 2; వాన్‌డర్ మెర్వ్ (సి) రషీద్ (బి) అలీ 0; దత్ (బి) రషీద్ 1; మీకెరెన్ (స్టంప్డ్) బట్లర్ (బి) అలీ 4; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (37.2 ఓవర్లలో ఆలౌట్) 179.** వికెట్ల పతనం: 1-12, 2-13, 3-68, 4-90, 5-104, 6-163, 7-166, 8-167, 9-174, 10-179. బౌలింగ్: వోక్స్ 7-0-19-1, విల్లీ 7-2-19-2, అట్కిన్సన్ 7-0-41-0, మొయిన్ అలీ 8.2-0-42-3, ఆదిల్ రషీద్ 8-0-54-3.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	8	4	4	8	-0.338
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

న్యూజిలాండ్ × శ్రీలంక
వేదిక: బెంగళూరు
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రెండు స్వర్ణాలపై జ్యోతి సురేఖ గురి

వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఫైనల్ చేరిన భారత స్టార్ • ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్

బ్యాంకాక్: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ రెండు స్వర్ణ పతకాల కోసం విజయం దూరంలో నిలిచింది. విజయవాడకు చెందిన 27 ఏళ్ల జ్యోతి సురేఖ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీఫైనల్లో జ్యోతి సురేఖ 148-145తో హువాంగ్ జౌ (చైనీస్ తైపీ)పై నెగ్గింది. నేడు జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్‌తో సురేఖ ఆడుతుంది. రెండో సెమీఫైనల్లో పర్ణీత్ కౌర్ 147-145తో విక్టోరియా లియాన్ (కజకిస్తాన్)ను ఓడించింది. భారత్‌కే చెందిన ప్రపంచ చాంపియన్ అదితి స్వామి ప్రిక్వార్టర్ ఫైనల్లో 145-146తో బొన్నా అక్తర్ (బంగ్లాదేశ్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, అదితి స్వామి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 228-217తో థాయ్‌లాండ్ జట్టును ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో చైనీస్ తైపీ జట్టుతో సురేఖ బృందం ఆడుతుంది. మరోవైపు పురుషుల కాంపౌండ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ, ప్రియాంశ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత జట్టు కాంస్య పతకం గెలిచింది.



జాతీయ అండర్-9 చెస్ చాంప్ సంహిత



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో తెలంగాణ అమ్మాయి పుంగవనం సంహిత టైటిల్ సాధించింది. జంషెడ్‌పూర్‌లో బుధవారం ముగిసిన ఈ టోర్నీలో సంహిత నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌గా అవతరించింది. సంహిత పది గేముల్లో గెలిచి, ఒక గేమ్‌లో ఓడిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పంచుమర్తి భవన్య, రిషిత ఎనిమిది పాయింట్లతో వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. మరోవైపు అండర్-9 ఓపెన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వి.జయప్రకాశ్ తొమ్మిది పాయింట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ జోడీ పరాజయం



సాక్షి, హైదరాబాద్: మొజెల్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పోరాటం ముగిసింది. ఫ్రాన్స్‌లోని మెట్జ్ నగరంలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ (భారత్)-స్టీవెన్స్ బార్ట్ (నెదర్లాండ్స్) ద్వయం 2-6, 4-6తో నాలుగో సీడ్ సాదియో దుంబియా-ఫాబియన్ రెబుల్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. తొలి రౌండ్‌లో అనిరుధ్-స్టీవెన్స్ 6-3, 6-4తో థియో అరిబెజ్-లుకా శాంచెజ్ (ఫ్రాన్స్)లపై నెగ్గారు. అనిరుధ్-స్టీవెన్స్ జోడీకి 5,220 యూరోల (రూ. 4 లక్షల 65 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ప్రస్తుతం ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో అనిరుధ్ 91వ ర్యాంక్‌లో ఉన్నాడు.

భారత్ సెమీస్ ప్రత్యర్థి ఎవరో?

నాలుగో బెర్త్ రేసులో న్యూజిలాండ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్



రచిన్ రవీంద్ర

ప్రపంచకప్‌లో భారత్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్నాయి. లీగ్ దశలో 40 మ్యాచ్‌లు ముగియగా... మరో 5 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో భారత్-నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ మ్యాచ్‌లకు ప్రాధాన్యత లేదు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు మాత్రమే రెండు, మూడు స్థానాల్లో ఉంటాయి కాబట్టి ఒక సెమీస్‌లో ఈ రెండు జట్లు తలపడతాయి. 'టాప్' ర్యాంక్‌ను ఖరారు చేసుకున్న భారత్ నాలుగో స్థానంలో నిలువనున్న జట్టుతో మరో సెమీఫైనల్లో తలపడతుంది. ఒకవేళ పాకిస్తాన్ ముందంజ వేస్తే మాత్రం భారత్ 16న కోల్‌కతాలో పాక్‌తో రెండో సెమీఫైనల్ ఆడుతుంది. న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్‌లలో ఒక జట్టు సెమీస్‌కు చేరితే భారత్ 15న ముంబైలో తొలి సెమీఫైనల్ ఆడుతుంది.

ప్రస్తుతం నాలుగో సెమీఫైనల్ బెర్త్ కోసం న్యూజిలాండ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్ మధ్య పోటీ ఉంది. మూడు జట్లకు ప్రస్తుతం సమాన పాయింట్లు (8) ఉన్నా... తక్కువ రన్‌రేట్‌తో (-0.338) అఫ్గానిస్తాన్ వెనుకబడి ఉంది. రేసులో కనీసం నిలవాలంటే శుక్రవారం తమ ఆఖరి పోరులో ఆ జట్టు భారీ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించాల్సి ఉంటుంది. దానికి ముందు నేడు జరిగే మ్యాచ్‌లో శ్రీలంకతో న్యూజిలాండ్ తలపడుతుంది. పాకిస్తాన్ (0.036)కంటే మెరుగైన రన్‌రేట్ ఉండటం న్యూజిలాండ్ (0.398)కు సానుకూలాంశం. లంకపై గెలిస్తే చాలు కివీస్ ముందంజ వేసినట్లే. పాక్ శనివారం తమ చివరి పోరులో ఇంగ్లండ్‌పై భారీ తేడాతో నెగ్గాల్సి ఉంటుంది. ఇంగ్లండ్ బలహీనంగా కనిపిస్తున్నా సరే... ఇది పాక్‌కు అంత సులువు కాదు. అయితే అందరికంటే చివరగా మ్యాచ్ ఆడనుండటంతో పాక్‌కు తాము ఏం చేయాలనే దానిపై స్పష్టత ఉంటుంది. నేడు లంక చేతిలో కివీస్ ఓడినా...వర్షంతో మ్యాచ్ రద్దయినా రన్‌రేట్‌తో సంబంధం లేకుండా ఇంగ్లండ్‌పై పాక్ గెలిస్తే చాలు సెమీఫైనల్ చేరుతుంది.

సినిమా

ఇటలీ నుంచి ఇంటికి...



• ప్రభాస్

దాదాపు రెండు నెలల ఇటలీ ట్రిప్‌ను ముగించుకుని బుధవారం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు ప్రభాస్. ఇక ముందుగా విడుదలకు సిద్ధంగా ఉన్న 'సలార్' చిత్రం తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' సినిమా షూటింగ్‌ను పూర్తి చేస్తారట ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'సలార్: సీజ్‌ఫైర్' చిత్రం డిసెంబరు 22న విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న 'కల్కి 2898 ఏడీ', మారుతి దర్శకత్వంలోని 'రాజాడీలక్స్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాల షూటింగ్స్‌లో సమాంతరంగా పాల్గొనేలా ప్రభాస్ ప్లాన్ చేస్తున్నారని సమాచారం.

విజయవాడకు భారతీయుడు



• కమల్ హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). 1996లో కమల్, శంకర్ కాంబినేషన్‌లోనే రూపొంది, బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'ఇండియన్' సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' రూపొందుతోంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ విజయవాడలో ప్రారంభం కానున్నట్లుగా తెలిసింది. ఆల్రెడీ దర్శకుడు శంకర్ కొన్ని లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేశారని తెలిసింది. దాదాపు పదిరోజుల పాటు జరిగే ఈ సినిమా షూటింగ్‌లో కమల్‌హాసన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా, కీలక సన్నివేశాల చిత్రీకరణను ప్లాన్ చేశారు. అలాగే విజయవాడ షెడ్యూల్ తర్వాత వైజాగ్‌లో కూడా కొంత షూటింగ్ జరుగుతుందని సమాచారం. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రకుల్‌ప్రీత్ సింగ్, బాబీ సింహా, సిద్ధార్థ్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. 'ఇండియన్ 2'కు కొనసాగింపుగా ప్లాన్ చేసిన 'ఇండియన్ 3' షూటింగ్‌ను కూడా ఆల్రెడీ శంకర్ ఆరంభించారని, ఇందుకు కమల్ అదనంగా 40 రోజుల కాల్‌షీట్స్‌ను కేటాయించవలసి వచ్చిందని భోగట్టా. 'ఇండియన్ 2'ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో, 'ఇండియన్ 3'ని దీపావళికి విడుదల చేస్తారనే టాక్ వినిపిస్తోంది.

మాస్ జాతర



• అల్లు అర్జున్

జాతరలో మాస్ ఫైట్ చేస్తున్నారు పుష్పరాజ్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'పుష్ప'. ఈ చిత్రం తొలి భాగం 'పుష్ప: ది రైజ్' సూపర్ హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం 'పుష్ప' మలిభాగం 'పుష్ప: ది రూల్' సినిమా షూట్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. ప్రజెంట్ ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోంది. జాతర నేపథ్యంలో వచ్చే ఓ పాట, ఆ జాతరకు ముడిపడి ఉన్న ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ జాతర బ్యాక్‌డ్రాప్ సీన్స్ అన్నీ ఇంట్రవెల్ సమయంలో రానున్నాయని భోగట్టా. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అనసూయ, సునీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది.

సంక్రాంతికి కెప్టెన్ మిల్లర్



• సందీప్ కిషన్

సంక్రాంతికి థియేటర్స్‌కు రావడానికి రెడీ అయ్యారు 'కెప్టెన్ మిల్లర్'. ధనుష్ టైటిల్ రోల్ చేస్తున్న హై బడ్జెట్ పీరియాడికల్ ఫిల్మ్ ఇది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి.శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మిస్తున్నారు. ప్రియాంకా అరుళ్ మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

న్యూజిల్యాండ్‌లో కన్నప్ప



• విష్ణు

విష్ణు మంచు హీరోగా ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో 'కన్నప్ప' చిత్రం తెరకెక్కుతోంది. అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ న్యూజిల్యాండ్‌లో జరుగుతున్న సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ- ''దేవుడి సృష్టిలో న్యూజిల్యాండ్ అనేది అందమైన పెయింటింగ్‌లాంటిది. 'కన్నప్ప' సినిమాకు పర్ఫెక్ట్ లొకేషన్. 'లార్డ్ ఆఫ్ ది రింగ్స్' వంటి హాలీవుడ్ చిత్రాన్ని ఇక్కడే షూట్ చేశారు. మా 'కన్నప్ప' షూటింగ్ 80 శాతం ఇక్కడే జరగనుంది. రాబోవు తరాల వారికి గుర్తుండిపోయేలా ఓ కళా ఖండంగా 'కన్నప్ప'ను తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రంలో హీరో ప్రభాస్‌తో పాటు మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, శరత్‌కుమార్ వంటి అగ్రనటులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

అలుపెరుగని కలం యోధుడా...



• సురేశ్ బాబు, ప్రభాకర్ జైనీ

ప్రముఖ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కాళోజీ పాత్రలో మూల విరాట్ నటించారు. విజయలక్ష్మి జైనీ నిర్మించిన ఈ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. యస్‌యస్ ఆత్రేయ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అలుపెరుగని అవిశ్రాంత కలం యోధుడా...' పాటను నిర్మాత డి. సురేష్ బాబు విడుదల చేసి, మాట్లాడుతూ-''ఈ పాట చాలా బాగుంది. ఇలాంటి వీరుల కథతో సినిమా తీసిన విజయలక్ష్మి, ప్రభాకర్‌లకు అభినందనలు'' అన్నారు. ''ప్రజా ఉద్యమ నాయకుడైన కాళోజీగారి బయోపిక్ తీసినందుకు సెన్సార్ సభ్యులు అభినందించారు. ఇకపైనా ఇలాంటి గొప్ప వ్యక్తుల సినిమాలు తీసేందుకు ప్రేక్షకుల ప్రోత్సాహం కావాలి'' అన్నారు ప్రభాకర్ జైనీ. ''ఇలాంటి మంచి సినిమాలో పాటలు రాసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు బిక్కి కృష్ణ. ఈ చిత్రానికి కెమెరా: రవి కుమార్ నీర్ల, నేపథ్య సంగీతం: మల్లిక్ యంవీకే.

టచ్చింగ్.. టచ్చింగ్



• కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్

కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో రేపు (శుక్రవారం) రిలీజవుతోంది. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్నపూర్ణ స్టూడియోస్ విడుదల చేస్తోంది. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమాలోని 'టచ్చింగ్.. టచ్చింగ్..' అంటూ సాగే పూర్తి వీడియో సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, ఇంద్రావతి చౌహాన్‌తో కలిసి హీరో కార్తీ పాడారు. ''జపాన్' నుంచి ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. 'టచ్చింగ్ టచ్చింగ్..' పాటలో కార్తీ, అనూ డ్యాన్స్, కెమిస్ట్రీ అదిరిపోతుంది. కార్తీ వాయిస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని మేకర్స్ అన్నారు.

అలా జీవితం మారిపోవాలి - సాయి రాజేష్



• సాయి రాజేష్, హెబ్బాపటేల్, దినేష్, శ్రీధర్


''అలా నిన్ను చేరి' టీజర్, ట్రైలర్, సంగీతం బాగున్నాయి. 'బేబి' సినిమాతో మా జీవితాలు మారిపోయాయి. 'అలా నిన్ను చేరి'తో దినేష్ జీవితం మారిపోవాలి. ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి. శ్రీదేవిగారికి ఆర్జీవీగారిలా.. హెబ్బా పటేల్‌కు నేను పెద్ద ఫ్యాన్‌ని'' అని దర్శక-నిర్మాత సాయి రాజేష్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణలు ప్రధాన పాత్రల్లో మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి సాయి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కొమ్మాలపాటి శ్రీధర్, కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ- ''మంచి ఫీల్ గుడ్ మూవీ 'అలా నిన్ను చేరి'. అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు. ''మా సినిమా ఏ ఒక్కర్నీ నిరాశపరచదు'' అన్నారు మారేష్ శివన్, దినేష్ తేజ్. ''నాకు మంచి పాత్ర ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు హెబ్బా పటేల్. ఈ వేడుకలో పాయల్ రాధాకృష్ణ, కెమెరామేన్ ఆండ్రూ, సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడారు.

వారి రుణం తీర్చుకోలేను - సుధీర్

''నేనీ రోజు ఈ స్థాయికి చేరుకున్నానంటే నా అభిమానుల ప్రేమే కారణం. టీవీ షోలు చేసినా, సినిమాలు చేసినా నా ఫ్యాన్స్ సపోర్ట్ చేశారు.. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేను. త్వరలోనే 'కాలింగ్ సహస్ర' సినిమాతో థియేటర్స్‌లో సందడి చేస్తాం''అని హీరో సుధీర్ అన్నారు. అరుణ్ విక్కీరాలా దర్శకత్వంలో సుధీర్, డాలీషా జంటగా నటించిన చిత్రం 'కాలింగ్ సహస్ర'. షాడో మీడియా ప్రొడక్షన్స్, రాధా ఆర్ట్స్‌పై విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. మోహిత్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'కనుల నీరు రాలదే..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌మీట్‌లో సుధీర్ మాట్లాడుతూ- ''మోహిత్ మంచి సంగీతాన్ని అందించారు. జిత్తు మాస్టర్ ఈ పాటని చక్కగా కొరియోగ్రఫీ చేశారు'' అన్నారు. ''సినిమా చాలా బాగా వచ్చింది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయాల్. ''కాలింగ్ సహస్ర' తర్వాత సుధీర్ సూపర్ స్టార్ అవుతాడు'' అన్నారు అరుణ్ విక్కీరాల. ఈ కార్యక్రమంలో డాలీషా, కెమెరామేన్ శశికిరణ్, మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్, నిర్మాత బెక్కెం వేణుగోపాల్, రామచంద్రరావు మాట్లాడారు.



• డాలీషా, సుధీర్



అజయ్ దేవగన్, రణ్‌వీర్ సింగ్, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, దీపికా పదుకోన్, కరీనాకపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'సింగమ్ ఎగైన్'. ఈ సినిమాలో అవనీ కామత్ పాత్రలో కరీనా కపూర్ నటిస్తున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. ''ఫోర్స్‌లో రీ జాయిన్ అవుతున్నాను. సింగమ్ స్ట్రైక్స్ అవనీ కామత్‌ని కలవండ'' అని అవనీ కామత్ ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు కరీనా కపూర్.

10న శ్రీవారి దర్శన, గదుల కోటా విడుదల

తిరుమల: డిసెంబర్ 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, శ్రీవాణి దర్శన టికెట్లు, గదుల కోటాను నవంబర్ 10న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. రూ.300 ప్రత్యేక దర్శనానికి సంబంధించి 2.25 లక్షల టికెట్లను ఉదయం 10 గంటలకు, రోజుకు 2 వేల చొప్పున 20 వేల శ్రీవాణి దర్శన టికెట్లను మధ్యాహ్నం 3 గంటలకు, గదుల కోటాను సాయంత్రం 5 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

అణగారిన వర్గాలకు భగవంతుడుని దగ్గర చేస్తాం

టీటీడీ బోర్డు చైర్మన్ బి.కరుణాకర్‌రెడ్డి



డీవీఆర్‌కే ప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బి. కరుణాకర్‌రెడ్డి

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): సమాజానికి, అణగారిన వర్గాలకు భగవంతుడుని దగ్గర చేయడం కోసం టీటీడీ దళిత గోవిందం అనే కార్యక్రమం తీసుకువచ్చిందని టీటీడీ బోర్డు చైర్మన్ బి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. రామ కోటిలా గోవింద కోటి రాసిన వారికి వేంకటేశ్వర స్వామి వారి వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామని చెప్పారు. హిమాయత్ నగర్ టీటీడీ లోకల్ అడ్వయిజరీ కమిటీ అధ్యక్షుడిగా డీవీఆర్‌కే ప్రసాద్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బుధవారం హిమాయత్ నగర్ టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, హైందవ ధర్మాన్ని అందరూ ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరముందని, హైందవ ధర్మ వ్యాప్తి కోసం వేద సారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేద సంస్కృతిని కాపాడటంతో పాటు వేద విద్యార్థుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేలా ఎప్పటికప్పుడు టీటీడీ అనుబంధ విశ్వ విద్యాలయాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం డీవీఆర్‌కే ప్రసాద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీవీఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించినందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, టీటీడీ బోర్డు చైర్మన్ బి.కరుణాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జీఎంఆర్ కార్గోలో ప్రత్యేక దిగుమతుల టెర్మినల్



ప్రత్యేక టెర్మినల్ ప్రారంభించిన ప్రదీప్ ఫణీకర్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కార్గోలో ప్రత్యేక దిగుమతుల టెరిమ్నల్‌ను బుధవారం ప్రారంభించారు. కొరియర్ దిగుమతుల్లో వేగవంతమైన ప్రక్రియకు ఈ టెర్మినల్ ఏర్పాటు మరింత సులభతరంగా మారుతుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సీఈఓ ప్రదీప్ ఫణీకర్ చెప్పారు. కొత్త సౌకర్యం వినియోగదారులకు మరింత మేలుచేస్తుందని తెలిపారు. జీఎంఆర్ కార్గో 120 మెట్రిక్ టన్నులకు పైగా కొరియర్ల నిర్వహణ చేపడుతుందని వెల్లడించారు.

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

ఎంజీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై



మహాత్మాగాంధీ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న గవర్నర్ తమిళిసై, పక్కన వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ (నల్లగొండ రూరల్): దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని రాష్ట్ర గవర్నర్, వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. బుధవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో నిర్వహించిన 3వ స్నాతకోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఓయూ మాజీ వీసీ రామచంద్రంతో కలిసి 17 మంది పీహెచ్‌డీ అభ్యర్థులకు డాక్టరేట్లు, 40 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడాలని, నేటి విద్యార్థులు రేపటి స్నాతకోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు. ఇల్లు కట్టుకునే సమయంలో ఒక రీడింగ్ రూం కూడా నిర్మించుకోవాలనే ఆలోచన ఉండాలన్నారు. ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తే ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని తెలిపారు. బ్రిటీష్ కాలం నాటి పద్ధతుల్లోనే ఇంకా ఈ డ్రెస్ కోడ్‌ను ధరిస్తున్నామని.. మళ్లీ వచ్చే స్నాతకోత్సవంలో చేనేత దుస్తులు ధరించాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ ఎస్.రామచంద్రం మాట్లాడుతూ.. గుర్రంపోడు మండలం చామలోని బావి గ్రామానికి చెందిన తాను ఉన్నత స్థాయికి ఎదిగిన విధానాన్ని వివరించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని సాధించుకునేందుకు యూనివర్సిటీ నుంచే లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి యూనివర్సిటీలో ఉన్న సౌకర్యాలను, అభివృద్ధిని వెల్లడించారు. సమావేశంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, పరీక్షల నియంత్రణ అధికారి దుగ్యాల రమేశ్, పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ కాయిన్ కేసులో పురోగతి

- చెన్నైలో క్వెస్ట్ నెట్ డైరెక్టర్ కామాక్షి అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: బంగారు నాణెం కొనుగోలు పేరిట మల్టీలెవల్ మార్కెటింగ్ మోసానికి పాల్పడిన క్వెస్ట్‌నెట్ ఎంటర్‌ప్రైజెస్ ఇండియా ప్రై.లిమిటెడ్ కేసులో సీఐడీ అధికారులు పురోగతి సాధించారు. ఈ కేసులో 15 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఆ కంపెనీ డైరెక్టర్ కామాక్షి రంగనాథన్‌ను తెలంగాణ సీఐడీ ప్రత్యేక బృందం మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. కామాక్షి రంగనాథన్‌పై నాన్‌బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉండటంతో ఎస్పీ బి.రామ్‌రెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక బృందం చెన్నైలోని బీసెంట్ నగర్‌లో అరెస్టు చేసినట్టు చెప్పారు. క్వెస్ట్ నెట్ కంపెనీ నుంచి మాధవ రావు, జి విద్యావతిలు తనను బంగారు నాణెంపై పెట్టుబడి పెట్టాలంటూ మోసానికి పాల్పడినట్టు ఫిర్యాదు చేశారు. దీనిపై తొలుత వరంగల్ మట్వాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. తర్వాత సీఐడీకి కేసు బదిలీ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీ అధికారులు మంగళవారం కామాక్షి రంగనాథన్‌ను అరెస్టు చేసి బుధవారం హన్మకొండ కోర్టులో హాజరుపర్చారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన ఇన్‌స్పెక్టర్ ఉదయ్ శంకర్, ఎస్సై తిరుపతి, ఇతర సిబ్బందిని అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+8 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 229

గురువారం 9-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయవచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మొటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మొటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్



డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?

దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్లు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లి దండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజు కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలార్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి


ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు. ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో' పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు. ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగో చెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్ది మందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానిష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్య్రం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.

సాక్షి **బిజినెస్**
గురువారం
9-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
33	37
64,976	19,443

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,629	▽	11
డోజోన్స్	34,116	▽	37
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,407	▽	4
డాక్స్	15,223	▲	71
షాంఘై	3,052	▽	5
నికాయ్	32,166	▽	15

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	59,830
బంగారం (22 క్యారెట్)	56,980
వెండి (కిలో)	76,500

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.44	84.56
£	బ్రిటన్ పౌండ్		100.25	103.45
€	యూరో		86.59	90.56
¥	జపాన్ ఎన్ (100)		53.95	55.96
AUS$	ఆస్ట్రేలియా డాలర్		51.85	54.75
S$	సింగపూర్ డాలర్		59.20	61.65
SAR	సౌదీ రియాల్		21.21	22.78
UAE D	యూఏఈ దిర్హామ్		21.59	23.45
¥	చైనా యువాన్		10.31	12.39

వచ్చే ఏడాది స్విగ్గీ మెగా ఐపీవో?

7 ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుల ఎంపిక!



ముంబై: ఫుడ్ డెలివరీ కంపెనీ స్విగ్గీ వచ్చే కేలండర్ ఏడాది(2024)లో పబ్లిక్ ఇష్యూకి వచ్చే అవకాశ ముంది. పీఈ దిగ్గజం సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడు లున్న సంస్థ ఇందుకు సలహాదారులుగా 7 ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో కొటక్ మహీంద్రా క్యాపిటల్, సిటీ, జేపీ మోర్గాన్, బీవోఎఫ్ఏ సెక్యూరిటీస్, జెఫరీస్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్, అవెండస్ క్యాపిటల్ చేరే అవకాశమున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. స్విగ్గీ ఐపీవో పరిమాణాన్ని బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,300 కోట్లు)గా అంచనా వేస్తున్నారు. 2024 మార్చిలో స్విగ్గీ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనున్నట్లు అంచనా. వెరసి మార్కెట్లు అనుకూలిస్తే జూలై–ఆగస్ట్‌కల్లా ఐపీవో వెలువడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో అంటే 2022 నవంబర్‌లో యూఎస్ తరహాలో సెబీ సైతం రహస్య(కాన్ఫిడెన్షియల్) ఫైలింగ్స్‌కు తెరతీసింది. తద్వారా కంపెనీ పబ్లిక్ ఇష్యూ వివరాలను వెల్లడించేవరకూ సమాచారం వెల్లడికాదు. ఐపీవో కోసం తొలిసారి డీటీహెచ్ ప్లాట్‌ఫామ్ టాటా ప్లే(టాటా స్కై) రహస్య ఫైలింగ్ చేపట్టింది.



స్వదేశ్ స్టోర్ ప్రారంభం

రిలయన్స్ రిటైల్ స్వదేశ్ తొలి ఔట్‌లెట్‌ను హైదరాబాద్‌లో బుధవారం ప్రారంభించిన సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ నీతా అంబానీ.

భారత్ ఆర్గానిక్స్ బ్రాండ్ ఆవిష్కరణ




'భారత్ ఆర్గానిక్స్' ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోమ్, సహకార శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

న్యూఢిల్లీ: కేంద్ర హోమ్, సహకార శాఖల మంత్రి అమిత్ షా నేషనల్ కోఆపరేటివ్ ఆర్గానిక్స్ లిమిటెడ్ (ఎన్‌సీఓఎల్)– 'భారత్ ఆర్గానిక్స్' బ్రాండ్‌ను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో ఇది భారత్ అలాగే విదేశాలలో అత్యంత ''విశ్వసనీయ'' బ్రాండ్‌గా ఉద్భవించనుందని ఉద్ఘాటించారు. ఇందులో భాగంగా, జాతీయ వృక్ష సంరక్షణ సంస్థ (ఎన్‌పీపీఓ) ఆమోదించిన ప్రస్తుత 34 ల్యాబ్‌ల సంఖ్యను దేశవ్యాప్తంగా మరింత పెంచనున్నట్లు వివరించారు. ప్రారంభంలో ఎన్‌సీఓఎల్ భారతదేశంలో ఆర్గానిక్ ఉత్పత్తులను విక్రయిస్తుందని, అటు తర్వాత ఇతర దేశాల్లోకి విక్రయాలను విస్తరిస్తుందని అమిత్ షా తెలిపారు. 'సహకార సంస్థల ద్వారా ఆర్గానిక్ ప్రొడక్టుల ప్రమోషన్' అన్న అంశంపై ఎన్‌సీఓఎల్ న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక సింపోజియంలో ఎన్‌సీఓఎల్ లోగో, వెబ్‌సైట్, బ్రోచర్, కొన్ని ఉత్పత్తులను కూడా షా ఆవిష్కరించారు. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) సేంద్రియ ఎరువును కూడా ఆయన ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. ఐదు సహకార సంఘాలకు ఎన్‌సీఓఎల్ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)చీఫ్ ప్రమోటర్‌గా మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ యాక్ట్, 2002 కింద ఈ ఏడాది జనవరి 25న ఎన్‌సీఓఎల్ రిజిస్టర్ అయ్యింది. గుజరాత్ కేంద్రంగా పనిచేస్తోంది. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన మూడు కొత్త సహకార సంస్థలలో ఎన్‌సీఓఎల్ ఒకటి. మిగిలిన రెండు సహకార సంఘాలు విత్తనాలు– ఎగుమతుల రంగంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 7.89 కోట్ల సహకార సంఘాలు ఉండగా వీటిలో మొత్తం 29 కోట్ల మంది సభ్యులు ఉన్నారు.

టాటా పవర్ లాభం అప్

క్యూ2లో రూ. 1,017 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం టాటా పవర్ పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం వృద్ధితో రూ. 1,017 కోట్లను అధిగమించింది. గతేదాది(2022–23) ఇదే కాలంలో రూ. 935 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,181 కోట్ల నుంచి రూ. 16,030 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో కంపెనీ క్లీన్ ఎనర్జీ పోర్ట్‌ఫోలియో 5,500 మెగావాట్ల మైలురాయికి చేరినట్లు టాటా పవర్ సీఈవో, ఎండీ ప్రవీర్ సిన్హా పేర్కొన్నారు. వెరసి మొత్తం విద్యుదుత్పాదక సామర్థ్యంలో 38%కి చేరినట్లు వెల్లడించారు. తమిళనాడులో కొత్తగా ఏర్పాటు చేస్తున్న సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ ప్లాంట్ తొలి మాడ్యూల్‌ను రూపొందించినట్లు తెలియజేశారు. ఈ బాటలో క్యూ4(జనవరి–మార్చి)కల్లా తొలి సెల్‌ను విడుదల చేసే వీలున్నట్లు పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో టాటా పవర్ షేరు 2% బలపడి రూ. 255 వద్ద ముగిసింది.

ఒడిదుడుకులున్నా స్వల్ప లాభాలు



ముంబై: ట్రేడింగ్‌లో సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనైనా బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. ఇంట్రాడేలో 273 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 33 పాయింట్లు పెరిగి 64,976 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 63 పాయింట్ల పరిధిలో కదలాడింది. ఆఖరికి 37 పాయింట్ల లాభంతో 19,443 వద్ద నిలిచింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు రోజంతా లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ఆటో, ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఇంధన, ఆయిల్‌అండ్ గ్యాస్ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లు రాణించాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.80%, 0.60 శాతం ర్యాలీ చేశాయి. మరోవైపు ఫైనాన్సియల్ సర్వీసెస్, ఐటీ, బ్యాంకులు, టెక్ రంగాల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. విదేశీ ఇన్వెస్టర్లు 11 రోజూ అమ్మకాలకు పాల్పడుతూ రూ.85 కోట్ల విలువైన ఈక్విటీను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.524 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ పావెల్ ప్రసంగానికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- సెప్టెంబర్ క్వార్టర్‌లో నికర లాభం రెండున్నర రెట్లు వృద్ధి చెందడంతో అపోలో టైర్స్ షేరు 6.50% పెరిగి రూ.410 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 7% బలపడి రూ.412 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- ఇటీవల లిస్టైన ఐడియాఫోర్జ్ టెక్నాలజీ షేరు 7% పతనమై రూ.809 వద్ద ముగిసింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో కంపెనీ లాభం 77.6% క్షీణించడంతో షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో 10% నష్టపోయి రూ.785 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది.
- ప్రభుత్వరంగ చమురు శుద్ధి కంపెనీలైన హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ షేర్లు వరుసగా 7%, 3%, 1% చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు 3 నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు రెండో త్రైమాసికంలో మూడు సంస్థల నికరలాభం రూ.27,295 కోట్లుగా నమోదవడం కలిసొచ్చింది.

ప్రొటీన్ ఈగవ్ టెక్ ఐపీవోకు క్యూ

చివరి రోజుకల్లా 24 రెట్లు బిడ్స్

ఐటీ ఆధారిత సొల్యూషన్ల కంపెనీ ప్రొటీ న్ ఈగవ్ టెక్ పబ్లిక్ ఇష్యూ సక్సెస్ అయ్యింది. చివరి రోజు బుధవారానికల్లా 24 రెట్లు అధికంగా స్పందన లభించింది. కంపెనీ 43,78,700 షేర్లను ఆఫర్ చేయగా.. 10.44 కోట్లకుపైగా షేర్ల కోసం డిమాండ్ నమోదైంది. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) నుంచి 47 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 32 రెట్లు, రిటైలర్ల నుంచి 9 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రూ. 752–792 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 490 కోట్లు సమీకరించింది.

జర్మనీ నుంచి టెస్లా దిగుమతులు!



న్యూఢిల్లీ: జర్మనీ ఫ్యాక్టరీలో తయారైన కార్లను దిగుమతి చేసుకోవడం ద్వారా భారత మార్కెట్లో ఎంట్రీ ఇవ్వాలని ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా భావిస్తోంది. చైనాలోనూ ఫ్యాక్టరీ ఉన్నప్పటికీ ఆ దేశంతో నెలకొన్న ఉద్రిక్తతలరీత్యా అక్కణ్నుంచి దిగుమతులపై భారత్ అంత సుముఖంగా లేకపోవడంతో టెస్లా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చైనా నుంచి కార్లను దిగుమతి చేసుకోవద్దంటూ టెస్లా టాప్ మేనేజ్‌మెంట్‌కు కేంద్ర ప్రభుత్వ శాఖలు సూచించినట్లు వివరించాయి. దీంతో భారత్‌తో సత్సంబంధాలున్న జర్మనీ నుంచి దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. జర్మనీలోని బ్రాండెన్‌బర్గ్‌లో టెస్లాకు గిగాఫ్యాక్టరీ ఉంది. భారత మార్కెట్లో 25,000 యూరోల (సుమారు రూ. 20 లక్షలు) కారును ప్రవేశపెట్టే యోచనలో కంపెనీ ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, జర్మనీ నుంచి దిగుమతి చేసే విద్యుత్ వాహనాలపై కస్టమ్స్ సుంకాల నుంచి మినహాయింపులు ఇవ్వాలని కూడా టెస్లా కోరుతున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఒకవేళ వాటిపై సుంకాలను 20–30 శాతం మేర తగ్గిస్తే టెస్లా మాత్రమే కాకుండా జర్మనీ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే మెర్సిడెస్, బీఎండబ్ల్యూ, ఆడి వంటి పలు లగ్జరీ కార్ల తయారీ సంస్థలకు కూడా ప్రయోజనం లభించవచ్చని పేర్కొన్నాయి.

నష్టాల్లో బీహెచ్ఈఎల్

క్యూ2లో రూ. 238 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బీహెచ్ఈఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో లాభాలను వీడి రూ. 238 కోట్లకుపైగా నికర నష్టం ప్రకటించింది. గతేదాది(2022–23) ఇదే కాలంలో రూ. 12 కోట్ల నికర లాభం లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,419 కోట్ల నుంచి తగ్గి రూ. 5,305 కోట్లకు పరిమితమైంది. కాగా.. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లోనూ కంపెనీ రూ. 344 కోట్ల కన్సాలిడేటెడ్ నికర నష్టం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో బీహెచ్ఈఎల్ షేరు 3 శాతం నీరసించి రూ. 125 వద్ద ముగిసింది.

యాంఫీ కొత్త సీఈవోగా వెంకటనాగేశ్వర్ చలసాని



ముంబై: మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ కొత్త సీఈవోగా వెంకటనాగేశ్వర్ చలసాని నియమితులయ్యారు. వరుసగా రెండు సార్లు సీఈవోగా వ్యవహరించిన ఎన్ఎస్ వెంకటేష్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపడతారు. బ్యాంకింగ్, ట్రెజరీ విభాగంలో చలసానికి దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐలో డిప్యూటీ ఎండీగా వ్యవహరించడంతో పాటు ఆర్‌బీఐ, ఆర్థిక శాఖలు ఏర్పాటు చేసిన కమిటీల్లోనూ సభ్యుడిగా సేవలు అందించారు. దేశీ మ్యూచువల్ ఫండ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసే దిశగా ఇటు పరిశ్రమ, అటు నియంత్రణ సంస్థతో కలిసి పని చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

సెలెక్ట్ మొబైల్స్ 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' ఆఫర్లు



హైదరాబాద్: దీపావళి సందర్భంగా సెలెక్ట్ మొబైల్స్ 'గ్రేట్ ఫెస్టివల్ డేస్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'స్కాన్ అండ్ విన్' కాన్సెప్ట్ ద్వారా స్మార్ట్ ఫోన్‌పై 25% డిస్కౌంట్ పొందవచ్చని సంస్థ సీఎండీ గురు తెలిపారు. ఎల్ఈడీ టీవీ రూ.999లకు, ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి ఆఫర్లు, డీల్స్‌ని సొంతం చేసుకోవచ్చన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈజీఈఎంఐపై 10% తక్షణ తగ్గింపు, ఐసీఐసీఐ ఫైనాన్స్‌పై రూ.10 వేల వరకు, బజాజ్ ఫిన్‌సర్వ్‌పై రూ.9 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్ కార్డులపై 5%, క్లైవర్‌పే పై 15% వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు. స్మార్ట్ ఫోన్‌లకు మాత్రమే పరిమితం కాకుండా టీవీ, ల్యాప్‌టాప్, యాక్సెసరీస్‌లపైనా గ్రేట్ సేవింగ్ ఆఫర్లు పొందవచ్చని గురు వివరించారు.

భవిత

ఇంటర్‌తో ఆర్మీలో లెఫ్టినెంట్

ఆర్మీ జాబ్స్

ఇండియన్ ఆర్మీ 2024, జులైలో ప్రారంభమయ్యే 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 51 బ్యాచ్‌కు ప్రకటన విడుదల చేసింది. ఇందులో మొత్తం 90 ఖాళీలను భర్తీ చేస్తారు. ఎంపికైన వారు ఉచితంగా బీటెక్ చదువుతోపాటు ఆర్మీలో లెఫ్టినెంట్ కొలువు సొంతం చేసుకోవచ్చు. ఇంటర్ మార్కులు, జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా దరఖాస్తులు షార్ట్‌లిస్ట్ చేసి, రెండు దశల్లో వివిధ పరీక్షలు నిర్వహించి కోర్సులోకి తీసుకుంటారు. విధుల్లో చేరినవారికి నెలకు రూ.లక్ష వేతనం లభిస్తుంది.

» ఎంపీసీ విద్యార్థులకు చక్కటి అవకాశం

మొత్తం ఖాళీలు: 90

» **అర్హతలు:** జేఈఈ మెయిన్ 2023లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టులతో 60 శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» **వయసు:** 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే.. 2 జనవరి 2005– 1 జనవరి 2008 మధ్య జన్మించినవారు అర్హులు.

ఎంపిక ఇలా

ఇంటర్ మార్కులు, జేఈఈ మెయిన్స్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇందులో ఎంపికైన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో బెంగళూరులో అయిదు రోజుల పాటు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. మొదటి రోజు స్టేజ్–1 స్క్రీనింగ్ (ఇంటెలిజెన్స్) పరీక్షల్లో అర్హత సాధించిన వారిని స్టేజ్–2కి ఎంపిక చేస్తారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే వివిధ పరీక్షల్లో అన్ని విభాగాల్లోనూ రాణించినవారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

శిక్షణ

ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఇందులో ఏడాది పాటు ఆఫీసర్ ట్రెనింగ్ అకాడమీ–గయాలో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్ నిర్వహిస్తారు. అనంతరం నాలుగేళ్లపాటు టెక్నికల్ ట్రైనింగ్ పుణె, సికింద్రాబాద్, మావ్‌ల్లోని ఆర్మీ కేంద్రాల్లో ఏదో ఒకచోట శిక్షణ కొనసాగుతుంది. ఇందులో రెండు దశలు..ఫేజ్–1 మూడేళ్ల ప్రీ కమిషన్ ట్రైనింగ్, ఫేజ్–2 ఏడాది పోస్ట్ కమిషన్ ట్రైనింగ్ ఉంటాయి.

బీటెక్

నాలుగేళ్ల శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదా సొంతమవుతుంది. ట్రైనింగ్, కోర్సు పూర్తయిన తర్వాత వీరికి ఇంజనీరింగ్(బీటెక్) డిగ్రీని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. అనంతరం పూర్తిస్థాయిలో విధుల్లోకి తీసుకుంటారు.

వేతనాలు

లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరిన వారికి లెవల్–10 ప్రకారం మూలవేతనం లభిస్తుంది. ఇలా ప్రతి నెల రూ.56,100తో పాటు మిలటరీ సర్వీస్ పే కింద రూ.15,500 అందుతాయి. వీటికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ప్రోత్సాహకాలు లభిస్తాయి. విధుల్లో చేరిన మొదటి నెల నుంచే వీరు అన్ని కలుపుకుని సీటీసీ రూపంలో నెలకు దాదాపు లక్ష రూపాయాలు అందుకోవచ్చు.

ఉన్నత హోదాలు

ఈ పోస్టులకు ఎంపికైన వారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో చేరిన రెండేళ్ల తర్వాత కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **దరఖాస్తులకు చివరి తేదీ:** నవంబర్ 12, 2023

» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

విద్య, ఉద్యోగ సమాచారం

పశ్చిమ గోదావరి జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 19 పోస్టులు

పశ్చిమ గోదావరి జిల్లా మహిళా, శిశు, సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 19

» **పోస్టుల వివరాలు:** జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాన్–ఇన్‌స్టిట్యూషనల్ కేర్–01, సోషల్ వర్కర్–01, డేటా అనలిస్ట్–01, అసిస్టెంట్ కమ్ డేటాఎంట్రీ ఆపరేటర్–01, అవుట్‌రీచ్ వర్కర్స్–02, మేనేజర్/కోఆర్డినేటర్(మహిళలు)–01, సోషల్ వర్కర్ కమ్–ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేటర్(మహిళలు)–01, నర్సు(మహిళలు)–01, డాక్టర్(పార్ట్‌టైమ్)–01, ఆయా(మహిళలు)–06, చౌకీదార్(మహిళలు)–01.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 42 ఏళ్లు మించకూడదు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా చిరునామకు పంపించాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2023.

» **వెబ్‌సైట్:** westgodavari.ap.gov.in

పరిశోధనలకు.. యూజీసీ చేయూత!

పరిశోధనల దిశగా యువతను ప్రోత్సహించేలా.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) పలు చర్యలు చేపడుతోంది. తాజాగా సైన్స్, హ్యుమానిటీస్, సోషల్‌సైన్సెస్ విభాగాల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(ఎస్ఆర్ఎఫ్) మొత్తాలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో.. యూజీసీ అందిస్తున్న రీసెర్చ్ ఫెలోషిప్‌లు, తాజా పెంపుదల, అర్హతలు తదితర వివరాలు..

» తాజాగా జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్‌ల పెంపు

» పలు స్కీమ్‌ల పరిధిలోని రీసెర్చ్ స్కాలర్స్‌కు మేలు

» ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధనలకు ఊతం

పీహెచ్‌డీలో చేరి పరిశోధనలు సాగించే విద్యార్థులకు యూజీసీ ఫెలోషిప్‌ల రూపంలో పలు స్కీమ్‌ల ద్వారా ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. రీసెర్చ్ వ్యవధికి అనుగుణంగా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ల పేరిట ఈ ఆర్థిక ప్రోత్సాహకాల్ని అందిస్తోంది. ముఖ్యంగా ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో ఫెలోషిప్‌లను ఇస్తోంది. తాజాగా పలు స్కీమ్‌ల పరిధిలో ఫెలోషిప్ మొత్తాలను పెంచింది.

ఫెలోషిప్ మొత్తాల పెంపు

- యూజీసీ.. తాజాగా 2023, జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చేలా ఫెలోషిప్ మొత్తాలను పెంచింది. సైన్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్‌లో జేఆర్ఎఫ్‌ను నెలకు రూ.31 వేల నుంచి రూ.37 వేలకు పెంచింది. ఇలా రెండేళ్ల పాటు నెలకు రూ.37 వేలు చొప్పున జేఆర్ఎఫ్ అందిస్తారు.
- జేఆర్ఎఫ్ తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌న(ఎస్ఆర్ఎఫ్)కు ఎంపికైన వారికి ప్రస్తుతం ఇస్తున్న రూ.35 వేల ఫెలోషిప్‌ను రూ.42 వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని నిర్దిష్ట వ్యవధి వరకు ఇస్తారు.
- కుటుంబంలో ఒక ఆడపిల్ల మాత్రమే ఉన్న విద్యార్థినులకు ఉద్దేశించిన సావిత్రి జ్యోతిబా పూలే ఫెలోషిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్ ఫెలోషిప్ పరిధిలో జేఆర్ఎఫ్‌ను రూ.31 వేల నుంచి రూ.35 వేలకు; ఎస్ఆర్ఎఫ్‌ను రూ.37 వేల నుంచి రూ.42 వేలకు పెంచారు.
- డాక్టర్.డి.ఎస్.కొఠారి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పరిధిలోనూ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లను పెంచారు. మొదటి ఏడాది నెలకు రూ.47 వేలుగా ఉన్న మొత్తాన్ని రూ.58 వేలకు; రెండో ఏడాది నెలకు రూ.49 వేలుగా ఉన్న ఫెలోషిప్‌ను రూ.61 వేలకు; మూడో ఏడాది నెలకు రూ. 54 వేలుగా ఉన్న ఫెలోషిప్‌ను రూ. 67 వేలకు పెంచారు.
- అదే విధంగా హయ్యర్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పేరిట మొత్తం వ్యవధికి ప్రస్తుతం నెలకు రూ.54 వేలను ఫెలోషిప్‌గా ఇస్తుండగా.. దానిని రూ.67 వేలకు పెంచారు.
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ఫర్ ఎస్‌సీ/ఎస్‌టీ, పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఉమెన్‌లకు ఇస్తున్న ఫెలోషిప్‌లను కూడా పెంచారు. మొదటి ఏడాది నెలకు రూ.47 వేల నుంచి రూ.58 వేలకు; రెండో ఏడాది నెలకు రూ.49 వేల నుంచి రూ.61 వేలకు; మూడో ఏడాది నుంచి నెలకు రూ.54 వేల నుంచి రూ.67 వేలకు పెంచారు.

నెట్‌తో జేఆర్ఎఫ్

- ఆర్ట్స్, సోషల్ సైన్సెస్ పీజీ ఉత్తీర్ణులు ఎన్‌టీఏ నిర్వహించే యూజీసీ–నెట్‌లో అర్హత సాధించడం ద్వారా జేఆర్ఎఫ్ పొందొచ్చు.
- సైన్సెస్‌లో పీహెచ్‌డీలో చేరి జేఆర్ఎఫ్ పొందాలంటే..యూజీసీ–సీఎస్ఐఆర్‌లు సంయుక్తంగా నిర్వహించే సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది.
- యూజీసీ మార్గనిర్దేశాల ప్రకారం–మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్‌ను అందిస్తారు. ఈ సమయంలో అభ్యర్థుల ప్రతిభను పరిశీలించి వారికి ఎస్ఆర్ఎఫ్‌కు అర్హత కల్పిస్తారు. ఈ ఎస్ఆర్ఎఫ్‌ను గరిష్ఠంగా మూడేళ్లపాటు అందిస్తారు.

నెట్‌కు అర్హత

- ఆర్ట్స్, సోషల్‌సైన్సెస్‌లో జేఆర్ఎఫ్‌కు అవకాశం కల్పించే యూజీసీ–నెట్‌కు హాజరవ్వాలంటే.. 55 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు ఇస్తారు.
- సైన్సెస్ విభాగంలో జేఆర్ఎఫ్‌కు దారి చూపే సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌కు హాజరవ్వాలంటే.. ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్/బీఎస్/బీటెక్/బీఫార్మసీ/ ఎంబీబీఎస్ కోర్సుల్లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

సావిత్రి జ్యోతిబాపూలే ఫెలోషిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్

- యూజీసీ పరిధిలోని ప్రముఖమైన ఫెలోషిప్ స్కీమ్.. సావిత్రి జ్యోతిబా పూలే ఫెలోషిప్ ఫర్ సింగిల్ గర్ల్ చైల్డ్. కుటుంబంలో ఏకైక సంతానంగా ఉన్న మహిళా విద్యార్థులు ఈ ఫెలోషిప్‌నకు అర్హులు. గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్, యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో నమోదు చేసుకుని ఉండాలి లేదా ఇప్పటికే పీహెచ్‌డీ చేస్తూ ఉండాలి. జనరల్ కేటగిరీలో 40 ఏళ్ల లోపు, ఎస్‌సీ/ఎస్‌టీ/ఓబీసీ/పీడబ్ల్యూడీ కేటగిరీలో గరిష్ఠంగా 45 ఏళ్లలోపు ఉండాలి.
- గరిష్ఠంగా అయిదేళ్ల వ్యవధికి ఫెలోషిప్ ఇస్తారు. తొలి రెండేళ్లు నెలకు రూ.37 వేలు చొప్పున జేఆర్ఎఫ్, తర్వాత మూడేళ్ల నెలకు రూ.42 వేలు చొప్పున అందిస్తారు.
- హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ పీహెచ్‌డీ అభ్యర్థులకు తొలి రెండేళ్లు ఏడాదికి రూ.పది వేలు చొప్పున, మిగతా మూడేళ్లకు ఏడాదికి రూ.20,500 చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ అందిస్తారు. సైన్సెస్ విభాగాల్లో ఈ మొత్తాలు తొలి రెండేళ్లు ఏడాదికి రూ.12 వేలు, మిగతా మూడేళ్లకు రూ.25 వేలు చొప్పున నిర్ణయించారు.
- అభ్యర్థులు పీహెచ్‌డీలో చేరిన మూడు నెలల లోపు యూజీసీ వెబ్‌సైట్ ద్వారా ఫెలోషిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



హయ్యర్ ఎడ్యుకేషన్

డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్

పీహెచ్‌డీ పూర్తి చేసుకుని.. పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించే వారికి అందుబాటులో ఉన్న ఫెలోషిప్ స్కీమ్.. డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్. సైన్సెస్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, లాంగ్వేజెస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న వారికి ఈ ఫెలోషిప్‌నకు అర్హత లభిస్తుంది. దీని ద్వారా అభ్యర్థులు సొంతంగా పరిశోధనలు సాగించే అవకాశం లభిస్తుంది. ప్రతి ఏటా మొత్తం 900 మందికి ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు. తాజా నిర్ణయం ప్రకారం మొదటి ఏడాది నెలకు రూ.58 వేలు; రెండో ఏడాది నెలకు రూ. 61 వేలు, మూడో ఏడాది నెలకు రూ. 67 వేలు చొప్పున ఫెలోషిప్ అందిస్తారు. వీటితో పాటు ఏటా రూ.50 వేలు చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ మంజూరు చేస్తారు. దరఖాస్తు చేసుకునే నాటికి జనరల్ కేటగిరీ అభ్యర్థులు 35 ఏళ్లలోపు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 40ఏళ్ల లోపు ఉండాలి.

డాక్టర్.ఎస్ కొఠారి రీసెర్చ్ గ్రాంట్

యూజీసీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్, యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీల్లో కొత్తగా అధ్యాపకులుగా నియమితులైన వారికి ఉద్దేశించిన ఫెలోషిప్ స్కీమ్.. డాక్టర్ ఎస్.కొఠారి రీసెర్చ్ గ్రాంట్. ఆయా ఇన్‌స్టిట్యూట్స్, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన వారు ఈ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం అయిదేళ్ల వ్యవధిలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం పొందిన తేదీ నుంచి రెండేళ్ల లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైతే మొదటి ఏడాది నెలకు రూ.58 వేలు చొప్పున, రెండో ఏడాది నెలకు రూ.61 వేలు చొప్పున, మూడో ఏడాది నెలకు రూ.67 వేలు చొప్పున ఫెలోషిప్ మంజూరు చేస్తారు. ప్రతి ఏటా 167 మందికి ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఉమెన్

పీహెచ్‌డీ పూర్తి చేసి ఎలాటి ఉపాధి లేకుండా ఉన్న మహిళలను పరిశోధన కేంద్రాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా ప్రోత్సహించే ఉద్దేశంతో యూజీసీ ప్రవేశపెట్టిన స్కీమ్.. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఉమెన్. సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో రీసెర్చ్ సెంటర్లలో పోస్ట్ డాక్టోరల్ కార్యకలాపాలు నిర్వహించే వారికి ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు. ప్రతి ఏటా 100 మందిని ఈ స్కీమ్‌కు ఎంపిక చేస్తారు. ఎంపికైన వారికి మొదటి ఏడాది నెలకు రూ.58 వేలు; రెండో ఏడాది నెలకు రూ.61 వేలు; మూడో ఏడాది నుంచి రూ.67 వేలు చొప్పున ఫెలోషిప్ ఇస్తారు. దీంతో పాటు అయిదేళ్ల పాటు ఏడాదికి రూ.50 వేలు చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ మంజూరు చేస్తారు. ఓపెన్ కేటగిరీలో 55 ఏళ్ల లోపు వారు, రిజర్వ్‌డ్ కేటగిరీలలో 60ఏళ్ల లోపువారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎస్‌సీ/ఎస్‌టీ

సైన్స్, ఇంజనీరింగ్, టెక్నాలజీ, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ చేయాలనుకునే ఎస్‌సీ, ఎస్‌టీ వర్గాలకు చెందిన వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన స్కీమ్.. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఫర్ ఎస్‌సీ/ఎస్‌టీ. పీహెచ్‌డీ పూర్తి చేసి.. 50ఏళ్ల లోపు ఉన్న ఎస్‌సీ, ఎస్‌టీ కేటగిరీల అభ్యర్థులు ఈ ఫెలోషిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి ఏటా 100మందికి ఈ ఫెలోషిప్ కల్పిస్తారు. ఎంపికైన వారికి తొలి ఏడాది నెలకు రూ. 58 వేలు; రెండో ఏడాది నెలకు రూ.61 వేలు; మూడో ఏడాది నుంచి రూ.67 వేలు చొప్పున ఫెలోషిప్ ఇస్తారు. దీంతోపాట ఏడాది రూ. 50 వేలు చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ మంజూరు చేస్తారు.

ఎంపిక ఇలా

యూజీసీ అందిస్తున్న ఫెలోషిప్ స్కీమ్‌లకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులకు సంబంధించిన ప్రకటనలను యూజీసీ విడుదల చేస్తుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత అభ్యర్థులకు యూజీసీ ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. వీటిలో విజయం సాధించిన వారిని ఫెలోషిప్‌నకు ఎంపిక చేస్తారు.

నేడు ఇక్కడ.. రేపు ఢిల్లీలో..

గెలుపు ఖాయం అంటున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ నేతలు గల్లీలో గులాబీలు.. ఢిల్లీలో గులాములు

కేటీఆర్‌వి ఉద్దెర మాటలు... కర్ణాటక పోలీసులు వచ్చి గుంజుకుపోతే తెలుస్తుంది

టీడీపీ వాళ్లు నాకే ఓటేస్తానంటే ఆహ్వానించదగిందే కదా..? అందులో తప్పేముంది?

75-80 స్థానాల్లో గెలుస్తున్నాం... బీఆర్ఎస్‌కు 25 కంటే ఎక్కువ రావు

మేకల కళ్యాణ్ చక్రవర్తి

నిన్న కర్ణాటకలో గెలిచాం..ఇప్పుడు తెలంగాణలో గెలుస్తాం... రేపు ఢిల్లీలోనూ గెలిచి తీరుతాం అని అంటున్నారు టీపీసీసీ చీఫ్ అనుముల రేవంత్‌రెడ్డి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 75-80 స్థానాలను గెలుచుకుని అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారాయన. బీఆర్ఎస్‌కు 25, బీజేపీ, ఎంఐఎంలకు కలిపి 10 స్థానాలే వస్తాయని జోస్యం చెప్పారు. నామినేషన్ల దాఖలు కార్యక్రమం జోరుగా సాగుతున్న నేపథ్యంలో ఐదు రోజుల రాష్ట్ర వ్యాప్త పర్యటనకు బయలుదేరిన సందర్భంగా రేవంత్‌రెడ్డి 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలకాంశాలపై ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

కామారెడ్డిలో సీఎంపై పోటీ ఎందుకు చేస్తున్నారు?

రాష్ట్రంలో ఎన్నో నియోజకవర్గాలున్నా కేసీఆర్ కామారెడ్డికి వెళ్లడం వెనుక రాజకీయ కోణం ఉంది. అసదుద్దీన్ ఒవైసీ, కేసీఆర్ కలిసి మా పార్టీలోని సీనియర్ మైనార్టీ నేత షబ్బీర్‌అలీని ఓడించేందుకు కుట్ర చేశారు. ఆయన స్థానంలో నేను అక్కడ పోటీ చేస్తే పదేళ్ల కేసీఆర్ వైఫల్యాలు, తప్పులను ప్రజలకు చేరవేయడం సులభమవుతుంది. కేసీఆర్ పాలనా వైఫల్యాలపై జాతీయస్థాయిలో చర్చ జరగడంతో పాటు కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గట్టిగా పోరాడుతుందనే సంకేతాన్ని పంపాలనేది మా అధిష్టానం ఉద్దేశం.

అభ్యర్థులను ప్రకటించిన తర్వాత మళ్లీ ఎందుకు మార్పులు చేస్తున్నారు?

అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఢిల్లీ నుంచి ఫీల్డ్ సర్వే నిర్వహించారు. కిందిస్థాయిలో ప్రజల అభిప్రాయాలు, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో పార్టీ అవసరాలను కూడా అంచనా వేసి అధిష్టానం ఒకట్రెండు మార్పులు చేసింది.

మీ పార్టీలో ఉన్న నేతలు బలంగా లేరనే వేరే పార్టీల నుంచి వచ్చిన వారిని తీసుకుని టికెట్లు ఇస్తున్నారా? లేదంటే కాంగ్రెస్ బలహీనంగా ఉందా?

పార్టీ వేరు, నాయకులు వేరు కాదు. కాంగ్రెస్ పార్టీలోని బలమైన 160 మంది నేతలను కేసీఆర్ తన పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడు వచ్చిన వారిలో చాలా మంది పాత కాంగ్రెస్ వాళ్లే. వివేక్ వెంకటస్వామి, రాజగోపాల్‌రెడ్డి లాంటి వారు బయటకు వెళ్లి కేసీఆర్‌ను ఓడించాలనుకున్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మళ్లీ పార్టీలోకి వచ్చారు. కొన్ని సందర్భాల్లో వారు మమ్మల్ని సంప్రదిస్తే మరికొన్ని సార్లు మేమే వాళ్లను సంప్రదించి టికెట్లు ఆఫర్ చేశాం.

టికెట్ల కేటాయింపులో రేవంత్ వర్గానికే ప్రాధాన్యం ఉందా?

119 మంది కూడా నా వర్గమే. సోనియా, ఖర్గే వర్గమే. రేవంత్ ఒక్కడే టికెట్లు నిర్ణయించడు. సీఈసీ నిర్ణయిస్తుంది. ఆ సీఈసీలో 16 మంది ఉద్దండులుంటారు. టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీలో కూడా భట్టి, ఉత్తమ్, మధుయాష్కీ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. అది పార్టీ సమష్టి నిర్ణయం. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నాను కాబట్టి సహజంగానే జరుగుతున్న పరిణామాలన్నీ నాకు ఆపాదిస్తారు.

కాంగ్రెస్ కారణంగానే తెలంగాణ నాశనమైందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై మీరేమంటారు?

కేసీఆర్ విశ్వాసం కోల్పోయిన నాయకుడు. అంతర్జాతీయ విమానాశ్రయం, హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, మెట్రో, ఫ్లైఓవర్లు నిర్మించి రూ. 60వేల కోట్ల ఆదాయం ఇక్కడి నుంచి వచ్చేలా చేసింది కాంగ్రెస్ కాదా..? అభివృద్ధి చేస్తే నాశనం చేసినట్టా..? నాగార్జునసాగర్, శ్రీశైలం, బీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, ఎస్సారెస్పీ, దేవాదుల, శ్రీరాంసాగర్, ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ లాంటి ప్రాజెక్టులు కట్టినందుకు తెలంగాణ నాశనమైందా?

కాళేశ్వరం వైఫల్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో విఫలమయ్యారా?

రాహుల్‌గాంధీ, నేను, భట్టి విక్రమార్క వెళ్లి ప్రాజెక్టును చూసి ప్రపంచానికి నిజం చెప్పాం. అన్ని స్థాయిల్లో చర్చలు పెట్టాం. ఎన్నికల నేపథ్యంలో మీడియా అంతా ఎన్నికల వివాదాలపైనే ఎక్కువ ఫోకస్ చేస్తోంది. అందుకే చర్చ జరగడం లేదు.

సింహం సింగిల్‌గానే వస్తుందని, కోహ్లీలాగా మళ్లీ సెంచరీ కొడతామని మంత్రి కేటీఆర్ అంటున్నారు కదా?

కృష్ణానగర్ పోతే ఇలాంటి మాటలు చెప్పేటోళ్లు చాలా మంది ఉంటారు. అవన్నీ ఉద్దెర మాటలు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఏదో లేఖ రాశారని అబద్ధం చెప్పి కేటీఆర్ ఇరుక్కున్నాడు. తర్వాత ఫేక్ అని ఒప్పుకున్నాడు. సైలెంట్ అయిపోయాడు. ఒక్కరోజు వార్తతో లబ్ధి పొందాలని చూశాడు. సైబర్ క్రైమ్‌లో కేసు అయ్యింది. కర్ణాటక పోలీసులు వచ్చి గుంజుకుని పోయి జైల్లో వేస్తే కానీ కేటీఆర్‌కు అర్థం కాదు.

ఢిల్లీ దొరల మధ్య తెలంగాణ ప్రజల మధ్య పోటీ జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు కదా?

సిగ్గులేకుండా బరితెగించి మాట్లాడడంలో పోటీ పెడితే కేసీఆర్ కుటుంబమే ఫస్ట్ వస్తుంది. ఢిల్లీకి పోయి నా కొడుకుని సీఎం చేస్తానని మోదీని అడిగింది మేమా? కేసీఆరా? అడుక్కున్నది కేసీఆర్. ఢిల్లీకి బానిసలై ఇక్కడ గులాబీలమని చెప్పే వారికి ఇతర పార్టీల మీద ఆరోపణలు చేసే హక్కు లేదు.

టికెట్లు అమ్ముకున్నారని మీ పార్టీలో టికెట్లు రాని వారంటున్నారు... ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు మీ పేరు మార్చి పిలుస్తున్నారు కదా?

టికెట్లు అమ్ముకున్నారనడంలో వాస్తవం లేదు. టికెట్ల నిర్ణయంలో రేవంత్‌రెడ్డి ఒక్కడికే ఆ అధికారం లేదు. అసలు కాంగ్రెస్ పార్టీ తరఫున నిలబడేందుకు అభ్యర్థులే కరువయ్యారని బిల్లా అంటుంటే... కోట్ల రూపాయలకు సీట్లు అమ్ముకుంటున్నారని రంగా అంటున్నాడు. బిల్లా రంగాల మధ్యనే ఈ విషయంలో వైరుధ్యం ఉంది. కాంగ్రెస్ టికెట్లు కోట్ల రూపాయల ధరలు పలుకుతున్నాయని అంటే ఓట్ల విషయంలో బాహుబలి కలెక్షన్లు వచ్చినట్టే కదా? వాళ్లు నోట్ల రూపంలో చూస్తే నేను ఓట్ల రూపంలో చూస్తున్నా.

వచ్చే ఎన్నికల్లో మీరు ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తారు?

కాంగ్రెస్ పార్టీకి 75-80 స్థానాలు వస్తాయి. బీఆర్ఎస్‌కు 25 కంటే ఎక్కువ రావు. బీజేపీకి 4 మించవు. ఎంఐఎంకు 5-6 మాత్రమే వస్తాయి.

తెలంగాణపై మీ పార్టీ అధిష్టానం ఎందుకు అధిక ఫోకస్ పెట్టింది?

నిన్న కర్ణాటక, నేడు తెలంగాణ, రేపు ఢిల్లీ... తెలంగాణలో గెలుపు ద్వారా ఢిల్లీ ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు మార్గం ఏర్పడుతుంది. అందుకే అధిష్టానం ఫోకస్ పెంచింది.

కాంగ్రెస్ పార్టీకి మేలు చేసేందుకే తెలంగాణలో టీడీపీ పోటీ చేయడం లేదా..?

టీడీపీ నుంచి పోయినోళ్లు 90 శాతం మంది బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులే. తలసాని, నిరంజన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌తో సహా కేసీఆర్ కూడా తెలుగుదేశం వాళ్లే కదా? మరి, టీడీపీ పోటీ పెట్టకపోతే వారికి లాభం వస్తుందని అనుకోవచ్చు కదా? తెలుగుదేశం సానుభూతిపరులందరూ నాకే ఓటు వేస్తే మంచిదే కదా? వారు వస్తే ఆహ్వానించదగ్గ విషయమే కదా? తప్పేముంది అందులో?



తెలంగాణ ప్రజలకు మీరిచ్చే పిలుపు ఏమిటి?

తెలంగాణ చాలా చైతన్యవంతమైన ప్రాంతం. ఇక్కడి ప్రజల నైజమే ధిక్కార స్వరం. నిజాంలయినా, సీమాంధ్ర పాలకులయినా, కేసీఆర్ అయినా పేర్లు మారాయి కానీ, విధానాలు ఒక్కటే. ప్రజలు తిరగబడే సందర్భంలో మనం వారి పక్కన నిలబడదం ప్రతిపక్షంగా మా బాధ్యత. రాష్ట్రానికి కేసీఆర్ నుంచి విముక్తి కలిగించి ప్రజల తెలంగాణ ఏర్పాటు చేయడంలో మేం ముందుంటాం. ప్రజలు కూడా మాకు అండగా నిలబడాలి.

జంగ్ తెలంగాణ

ప్రచారాస్త్రం.. 'నిజాం షుగర్స్'

- ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎన్నికలపై ప్రభావం
- 12 నియోజకవర్గాల్లో కీలకం కానున్న చెరకు రైతుల ఓట్లు
- గత పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాన్ని మార్చిన పసుపు బోర్డు అంశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: చెరకు రైతుల అంశం ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని 12 నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేయనుంది. పసుపు బోర్డు అంశం తరహాలోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీల పరిధిలోని చెరకు రైతుల విషయం ఉత్తర తెలంగాణలో రాజకీయ పార్టీలకు ప్రధాన ప్రచారాస్త్రమైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో పసుపు బోర్డు అంశం నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాన్ని శాసించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో చెరకు పంట విస్తీర్ణం పెంపు అంశం కీలకం కానుంది. బోధన్ (ఉమ్మడి నిజామాబాద్), మంబోజిపల్లి (ఉమ్మడి మెదక్), ముత్యంపేట (ఉమ్మడి కరీంనగర్) జిల్లాల్లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీలను రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే తెరిపిస్తామని ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కూడా ప్రకటించారు. దేశవ్యాప్తంగా పెట్రోల్‌లో ఇథనాల్ వాడకం పెరిగిన నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తుల నుంచి తయారీకి ఆయా పరిశ్రమల ఏర్పాటుపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే అంశాన్ని బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రచారాస్త్రాలుగా చేసుకుంటున్నాయి.

2002లో చంద్రబాబు విక్రయం..

నిజాం షుగర్స్ యూనిట్లను 2002లో డెల్టా పేపర్ మిల్స్ అనే ప్రైవేటు కంపెనీకి చంద్రబాబు ప్రభుత్వం విక్రయించింది. 2014 ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేస్తామన్నారు. అయితే 2015 డిసెంబర్ 23న ఫ్యాక్టరీ మూడు యూనిట్లు లేఆఫ్ ప్రకటించాయి. అయితే 2005-06లో చెరకు 35 వేల టన్నుల దిగుబడి ఉన్నప్పటికీ నడిపిన ఈ కర్మాగారాలను 2015లో లక్ష టన్నుల చెరకు దిగుబడి ఉన్నప్పటికీ మూసేయడం గమనార్హం. దీంతో రైతులు వరి వైపు మళ్లారు. నిజాం షుగర్స్ పరిధిలో చెరకు పండించే 12 నియోజకవర్గాల్లో గతంలో సుమారు 1.22 లక్షల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. చెరకు రైతులే ప్రధానాంశంగా బీజేపీ, కాంగ్రెస్‌లు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఇది చర్చనీయాంశమైంది.

చెరకు రైతులున్న నియోజకవర్గాలు, ఓటర్ల సంఖ్య ఇలా...

నియోజకవర్గం	సంఖ్య
బోధన్	2,16,131
ఆర్మూర్	2,06,468
బాన్సువాడ	1,93,032
నిజామాబాద్ రూరల్	2,48,451
బాల్కొండ	2,15,693
కోరుట్ల	2,36,772
జగిత్యాల	2,26,679
వేములవాడ	2,18,211
నిర్మల్	2,47,737
మెదక్	2,14,149
నర్సాపూర్	2,20,250
అందోల్	2,44,758

గాసిప్ టైమ్

సీఎం మీద గెలిస్తే జెయింట్ కిల్లరే!

సీఎం కేసీఆర్.. ఈ సార్‌తో ఎన్నికల్లో పోటీ అంటే.. అసలు మామూలు విషయం కాదు.. ఎప్పుడో నలభై ఏళ్ల కిందట ఒకే ఒక్కసారి స్వల్ప ఓట్లతో ఓడిపోయిన ఈయన ఆ తర్వాత.. ఇన్ని దశాబ్దాలుగా ఎంపీగా పోటీ చేసినా.. ఎమ్మెల్యేగా పోటీ చేసినా గెలుపు గుర్రంపై స్వారీ చేస్తూనే ఉన్నారు. రికార్డు మెజారిటీలు సాధిస్తూనే ఉన్నారు. అలాంటి కేసీఆర్‌పై తొలిసారి ఈ దఫా సీరియస్‌గా పోటీకి దిగుతున్నాయి ప్రతిపక్షాలు. ఓ రకంగా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఆ క్రమంలోనే గజ్వేల్‌లో కేసీఆర్‌పై బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్ పోటీ చేస్తుంటే... కామారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇద్దరికిద్దరూ కేసీఆర్‌ను ఓడిస్తామనే చెబుతున్నారు. ఒకవేళ ఓడిపోయినా.. పోయేదేం లేదు... సీఎం మీద పోటీ చేశాడు అనే పేరొస్తది. కానీ ఏమో గుర్రం ఎగరావచ్చు తరహాలో గెలిస్తే... జెయింట్ కిల్లర్ అనే ట్యాగ్‌లైన్ ఎప్పటికీ ఉంటుంది. ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీల్లో ఇదే అంశం చర్చనీయాంశమైంది. గజ్వేల్, కామారెడ్డిల్లో సీఎంపై గెలిచి.. ఒకవేళ ఆ గెలిచిన వాళ్ల పార్టీనే అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రిగా కూడా ముందు వరుసలో ఉండొచ్చనే దూరాలోచన కూడా పోటీకి కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.



ఓ సారి చరిత్ర చూస్తే

తెలంగాణలో ముఖ్యమంత్రిపై పోటీ చేసి గెలిచి జెయింట్ కిల్లర్‌గా పేరు పొందిన చరిత్ర మహబూబ్‌నగర్‌కు చెందిన చిత్తరంజన్ దాస్‌కు ఉంది. 1989 సాధారణ ఎన్నికల్లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గుడివాడ, హిందూపురంతో పాటు తెలంగాణలోని కల్వకుర్తి నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చిత్తరంజన్ దాస్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కాగా ఎన్టీ రామారావుపై గెలిచిన చిత్త రంజన్‌దాస్ ముఖ్యమంత్రి కాకపోయినా... కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగారు. ఈసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈటల రాజేందర్, రేవంత్‌రెడ్డిల పరిస్థితి ఏంటో డిసెంబర్ 3న తేలుతుంది.

ఇక్కడా సైకిల్ గుర్తే కావాలి

ఈసీ వద్ద సమాజ్‌వాదీ పార్టీ ప్రయత్నాలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: యూపీ కేంద్రంగా ఆవిర్భవించిన సమాజ్‌వాదీ పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పుట్టిన తెలుగుదేశం పార్టీల గుర్తులు ఒక్కటే. రెండుపార్టీలదీ సైకిల్ గుర్తే. కాలక్రమంలో ఎస్పీ జాతీయపార్టీగా ఆవిర్భవించింది. ఇదే క్రమంలో తెలంగాణ ఏర్పాటు తర్వాత టీడీపీ ప్రభ ఇక్కడ నానాటికీ మసకబారిపోతోంది. ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడం లేదు. కానీ, సమాజ్‌వాదీ పార్టీ మాత్రం పోటీ చేస్తోంది. అందుకే, తమకు సైకిల్ గుర్తు కావాలని పట్టుబడుతోంది. వాస్తవానికి ఇదే అంశంపై 2018లోనూ ఎస్పీ నేతలు ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. అయితే, అప్పటికే రాష్ట్రంలో టీడీపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్న నేపథ్యంలో అదే గుర్తును ఇవ్వలేమని ఎన్నికల సంఘం తేల్చి చెప్పింది. అయితే, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం బరిలో లేకపోవడంతో ఎస్పీ నేతలు ఇటీవల ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. కాగా, ఈసారి కూడా ఈసీ వారికి సైకిల్ గుర్తు ఇవ్వమని చెప్పినట్లు సమాచారం. అయితే, ఇంకా గుర్తుల కేటాయింపు పూర్తి కాలేదని, తాము మరోసారి ప్రయత్నం చేసి సైకిల్ గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తామని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

ఎన్నికలల పార్టీలు!

పుట్టగొడుగుల్లా పుడుతున్న కొత్త రాజకీయ పార్టీలు

అత్యధికంగా ఆవిర్భవిస్తున్నవి ఎన్నికల సమయంలోనే..

చిలుకూరి అయ్యప్ప

చట్టసభలకు జరిగే ఎన్నికల్లో జయాపజయాలు ప్రధానంగా రాజకీయ పార్టీల వ్యవహార శైలిపైనే ఆధారపడతాయి. ప్రజల్లో ఆయా పార్టీల పట్ల ఉన్న విశ్వసనీయతకుతోడు పోటీ చేస్తున్న అభ్యర్థుల వైఖరితో గెలుపోటములను ఓటర్లు నిర్ధారిస్తారు. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికల వేళ ఓటర్లను ఆకర్షించేందుకు, ప్రజల్లో ఊపును తీసుకొచ్చేందుకు కొత్తగా రాజకీయ పార్టీలు పుట్టుకొస్తుంటాయి. గత రెండున్నర దశాబ్దాల కాలంలో తెలుగు రాష్ట్రాల్లో కొత్త రాజకీయ పార్టీలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకురాగా మెజారిటీ పార్టీలు కాలగమనంలో కలసిపోయాయి. కానీ ఒకట్రెండు మాత్రం నిలదొక్కుకొని రాజ్యాధికారం దిశగా దూసుకువెళ్లాయి.

ఉద్ధండులు... కొత్త పార్టీలు

రాజకీయ పార్టీని స్థాపించడం..నిర్వహించడం ఆషామాషీ కాదు. పార్టీని స్థాపించే వ్యక్తికి ప్రజాక్షేత్రంలో చరిష్మా అత్యంత కీలకం. మాటలతో ప్రజలను మంత్రముగ్ధుల్ని చేయగలిగే సత్తా ఉండాలి. ప్రజలు వాటిని విశ్వసించేలా వ్యవహరించాలి. ఉమ్మడి రాష్ట్రంలో విస్తృత ప్రజాదరణ చూరగొన్న పలువురు నేతలు తమ రాజకీయ ఎజెండాలకు అనుగుణంగా సొంత పార్టీలను స్థాపించారు. ముఖ్యంగా తెలంగాణ సాధనే లక్ష్యంగా 2001లో తెలంగాణ రాష్ట్ర సమితిని కేసీఆర్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2001లోనే ఆలె నరేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ సాధన సమితి పుట్టుకొచ్చింది. 2005లో ప్రముఖ నటి విజయశాంతి సైతం తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించారు. 2006 అక్టోబర్‌లో జయప్రకాశ్ నారాయణ ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. తెలుగుదేశం పార్టీలో అత్యంత కీలక నేతగా వెలుగొందిన తూళ్ల దేవేందర్‌గౌడ్ సారథ్యంలో 2008లో నవ తెలంగాణ పార్టీ (ఎన్‌టీపీ) ఏర్పాటైంది. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన ప్రముఖ సినీనటుడు చిరంజీవి 2008 ఆగస్టులో ప్రజారాజ్యం పార్టీ (పీఆర్‌పీ)ని స్థాపించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుమారుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 2011లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటైంది. ప్రముఖనటుడు పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో 2014 మార్చిలో జనసేన ఆవిర్భవించింది. ఆ తర్వాత 2018 ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో తెలంగాణ జన సమితి (టీజేఎస్) ఏర్పాటైంది.



విలీనాలతో తెరమరుగు..

ఒకే లక్ష్యం దిశగా సాగుతున్న నేపథ్యంలో ఆలె నరేంద్రకు చెందిన తెలంగాణ సాధన సమితి 2002లో, విజయశాంతికి చెందిన తల్లి తెలంగాణ పార్టీ 2009లో అప్పటి టీఆర్ఎస్‌లో విలీనమయ్యాయి. లోక్‌సత్తా పార్టీ తరఫున 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ ఒక దఫా ఎమ్మెల్యేగా గెలుపొందగా... ఆ తర్వాత ఆ పార్టీ అభ్యర్థులెవరూ విజయం సాధించలేదు. దేవేందర్‌గౌడ్ తన నవ తెలంగాణ పార్టీని 2009 ఫిబ్రవరిలో ప్రజారాజ్యంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. పీఆర్‌పీ 2011 ఫిబ్రవరిలో కాంగ్రెస్‌లో విలీనమైంది. మరోవైపు తెలంగాణ జన సమితి ప్రధాన పార్టీలకు ఇప్పటివరకు ఎక్కడా గట్టి పోటీ ఇవ్వలేదు. ఇక చిన్నాచితకా పార్టీలు ఎప్పటికప్పుడు అలా వచ్చి పోటీ చేయడం తప్ప విజయం సాధించి నిలదొక్కుకున్న దాఖలాలు లేవు.

బరిలో బోలెడు రిజిస్టర్డ్ పార్టీలు..

1999 అసెంబ్లీ ఎన్నికల వేళ ఉమ్మడి రాష్ట్రంలో పోటీ చేసిన పార్టీలు 27 మాత్రమే. ఇందులో 6 జాతీయ పార్టీలుండగా..ప్రాంతీయ పార్టీ ఒకటి మాత్రమే ఉండేది. అలాగే 12 రిజిస్టర్డ్ పార్టీలు ఉండగా పొరుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలు 8 ఉండేవి. ఆ తర్వాత కాలంలో జరిగిన ఎన్నికల్లో జాతీయ, రాష్ట్ర పార్టీల సంఖ్య పెద్దగా మారనప్పటికీ కొత్తగా పుట్టుకొచ్చే పార్టీలు మాత్రం భారీగా పెరిగాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 93 పార్టీలు ఎన్నికల బరిలో నిలిచాయి. ఇందులో పోటీ చేసిన రిజిస్టర్డ్ పార్టీల సంఖ్య ఏకంగా 77. రెండున్నర దశాబ్దాల్లో రిజిస్టర్డ్ పార్టీల సంఖ్య ఆరు రెట్లకుపైగా పెరగడం గమనార్హం.

అధికారంలోకి రెండే పార్టీలు..

కొత్త పార్టీల్లో కేవలం టీఆర్ఎస్, వైఎస్సార్‌సీపీలు మాత్రమే ఎగిసిన కెరటంలా ఎదిగాయి. తెలంగాణలో టీఆర్ఎస్ 2014 నుంచి వరుసగా రెండుసార్లు అధికారం చేపట్టింది. అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పార్టీ బీఆర్ఎస్‌గా అవతరించింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో మొదలైన ఈ పార్టీ ఇప్పుడు ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. మరోవైపు ఏపీలో వైఎస్సార్‌సీపీ 2014 ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచి 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది.

ఇలా వచ్చి... అలా పోయి...

రెండున్నర దశాబ్దాలుగా జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన పార్టీల సంఖ్య ఇలా...

ఎన్నికలు	జాతీయ	రాష్ట్ర	రిజిస్టర్డ్	పొరుగువి	మొత్తం
1999	6	1	12	8	27
2004	5	1	25	6	37
2009	6	2	36	7	51
2014	6	4	52	7	69
2018	6	3	77	7	93

కోర్ సిటీలో కొట్లాటే!

పాత బస్తీలో ముస్లిం, హిందూ సామాజిక ఎజెండాలే
బీఆర్ఎస్ అభివృద్ధి మంత్రం
పట్టు కోసం కాంగ్రెస్.. ఉనికి కోసం బీజేపీ

మహ్మద్ హమీద్ ఖాన్

సాక్షి స్పెషల్

రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువైన హైదరాబాద్ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పాతనగరం పరిధిలో ఏడు, కొత్త నగరపరిధిలోకి ఎనిమిది అసెంబ్లీ స్థానాలు వస్తాయి. ఈ రెండు ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆలోచనాతీరు భిన్నంగా ఉంటాయి. పాతబస్తీలో రాజకీయాల ఒరవడే వేరుగా ఉంటుంది. మేనిఫెస్టోలు, ప్రచార ఆర్భాటాలు నడవవు. బలమైన ముస్లిం, హిందుత్వ సామాజిక ఎజెండాలే ఇక్కడి పార్టీల 'జెండా'లవుతాయి. నిజాం కాలంలో పురుడుపోసుకున్న మజ్లిస్–ఏ–ఇత్తేహదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) తొలి సార్వత్రిక ఎన్నికల నాటి నుంచి నేటి వరకు పాతబస్తీలో రాజకీయ ఆధిపత్యం కొనసాగిస్తూ వస్తోంది. హిందూ, ముస్లిం ఎజెండాలతో మజ్లిస్, బీజేపీ రాజకీయంగా తలపడుతున్నా.. ఫలితం మాత్రం ఒకవైపే మొగ్గు చూపుతోంది. బీజేపీ హిందూ ఎజెండాతో మజ్లిస్ కంచుకోటను ఢీకొట్టేందుకు ప్రతి ఎన్నికల్లో ప్రయత్నిస్తూనే ఉంది. మజ్లిస్ నుంచి చీలిన ఎంబీటీ కూడా మజ్లిస్‌ను ఢీ కొట్టేందుకు సర్వశక్తులూ ఒడ్డుతూనే ఉంది. పూర్వ వైభవం కోసం కాంగ్రెస్, ఉనికి కోసం బీఆర్ఎస్ పోటీ పడుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు అధికార బీఆర్ఎస్ ఇక్కడి నుంచి ఖాతా తెరవలేదు. ఇక కొత్త నగరంలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో రాజకీయ పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఇక్కడ మత రాజకీయాలు పనిచేయవు. ఆర్థిక బలం. అభివృద్ధి, సంక్షేమం, అభ్యర్థుల బలాలు, బలహీనతలు, రాజకీయ పార్టీల ప్రాధాన్యతను బట్టి ఓటర్లు మొగ్గు చూపుతూ ఉంటారు.



ఆశలపల్లకీలో బీజేపీ

బీజేపీ గతంలో చేజారిన స్థానాలతో పాటు కొత్తగా మరికొన్నింటిలో పాగా వేసేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. గత ఎన్నికల్లో గోషామహల్‌లో మాత్రమే విజయం సాధించిన బీజేపీ అంబర్‌పేట్, ముషీరాబాద్, ఖైరతాబాద్ సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. మరో వైపు పాతబస్తీలో పాగా వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉంది. గోషామహల్ సిట్టింగ్ ఎమ్మెల్యేపై సస్పెన్షన్ సైతం ఎత్తేసి తిరిగి బరిలోకి దింపింది. గతంలో అంబర్‌పేట, ముషీరాబాద్ స్థానాలకు ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు సీనియర్ నేతలు ఈసారి పోటీకి దూరంగా ఉన్నారు. ఖైరతాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే బరిలో దిగగా, అంబర్‌పేటలో ఇటీవల పార్టీలో చేరిన మరో మాజీ సీనియర్ ఎమ్మెల్యేకు అవకాశం ఇచ్చారు.

పాతబస్తీ దాటి పాగా వేసేనా..?

మజ్లిస్ పార్టీ పాతనగరం దాటి మరో రెండు స్థానాల్లో పోటీ చేయడం ఆసక్తి రేపుతోంది. ఈసారి ఏడు సిట్టింగ్ స్థానాలతో పాటు మరో రెండు స్థానాలను తమ ఖాతాలో వేసుకునేందుకు వ్యూహాత్మంగా ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది. ఎప్పుడూ పాతబస్తీకి మాత్రమే పరిమితమయ్యే మజ్లిస్ ఈసారి జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్‌లో కూడా బరిలోకి దిగింది. ఏ పార్టీ అధికారంలో ఉంటే మజ్లిస్ దాని చెంతన చేరుతోందన్నది బహిరంగ రహస్యమే. పదేళ్ల క్రితం వరకు వరకు కాంగ్రెస్‌తో కొనసాగించిన దోస్తానాకు కటీఫ్ చెప్పి..ఆ తర్వాత అధికార బీఆర్ఎస్‌కు మిత్రపక్షమైంది. అధికార పార్టీలు కూడా ప్రతి ఎన్నికలప్పుడు మజ్లిస్ సిట్టింగ్ స్థానాల్లో మొక్కుబడిగా అభ్యర్థులను దింపి పరోక్షంగా సహకరించడం ఆనవాయితీగా మారింది. మజ్లిస్ కూడా సిట్టింగ్ స్థానాలను చేజారకుండా పదిలపర్చుకుంటూ వస్తోంది.

సిట్టింగులతోనే...బీఆర్ఎస్

కోర్ సిటీలో అధికార బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు పదిలపర్చుకునేందుకు సంక్షేమం, అభివృద్ధి మంత్రం కలిసి వస్తుందని భావిస్తోంది. సిట్టింగ్‌లకు మరోమారు అవకాశం కల్పించి రంగంలోకి దింపింది. ఒక మంత్రి, ఐదుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఒక దివంగత ఎమ్మెల్యే కుమార్తె ఎన్నికల బరిలోకి దిగారు. బీజేపీ వహిస్తున్న గోషామహల్ స్థానం కూడా ఈసారి తమ ఖాతాలో వేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత ఎన్నికల్లో పాగావేసిన అంబర్‌పేట, ముషీరాబాద్, ఖైరతాబాద్ స్థానాలు ఈసారి బీజేపీకి చిక్కకుండా ఎత్తులకు పై ఎత్తులు వేస్తోంది. సనత్‌నగర్, జూబ్లీహిల్స్, కంటోన్మెంట్‌లలో గత పర్యాయం మాత్రమే పార్టీ పరంగా విజయం సాధించింది. అంతకు ముందు టీడీపీ గుర్తుపై గెలిచిన ముగ్గురు ఎమ్మెల్యేలు గులాబీ కండువా కప్పుకొని గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీ చేసి గెలుపొందారు. సికింద్రాబాద్ స్థానంలో ఇప్పటికి మూడు పర్యాయాలు టీఆర్ఎస్ గెలుపొందింది.

పూర్వ వైభవానికి కాంగ్రెస్ కసరత్తు

కాంగ్రెస్ పూర్వవైభవానికి పడరాని పాట్లు పడుతోంది. ఆరు గ్యారంటీ స్కీంలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదేళ్ల వైఫల్యాలను ప్రచారాస్త్రాలుగా మలుచుకుంది. గతంలో చేజారిన స్థానాలతోపాటు మరి కొన్నింటిలో ఖాతా తెరిచేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఇద్దరు మాజీ ఎంపీలను జూబ్లీహిల్స్, ముషీరాబాద్‌లలో, సెంటిమెంట్ సానుభూతిని అనుకూలంగా మరల్చుకునేందుకు దివంగత నేత పి జనార్ధన్‌రెడ్డి, దివంగత గద్దర్ కుమార్తెలను ఖైరతాబాద్, కంటోన్మెంట్ స్థానాల్లో, గోషామహల్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని ఎన్నికల బరిలోకి దింపింది. నాంపల్లి నియోజకవర్గంలో మూడు పర్యాయాలు స్వల్ప ఓట్లతో ఓటమి చవిచూసిన అభ్యర్థినే తిరిగి ఈసారి కూడా ఎన్నికల బరిలోకి దింపి సానుభూతి కలిసి వస్తోందని భావిస్తోంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, కంటోన్మెంట్, నాంపల్లి స్థానాలపై ఆశలు పెంచుకుంది. సనత్‌నగర్, అంబర్‌పేట ,సికింద్రాబాద్ స్థానాల్లో సైతం గట్టి పోటీ ఇచ్చేందుకు అవసరమైన బలాన్ని పెంచుకుంటోంది.


ఈసారి అభ్యర్థులను మార్చిన మజ్లిస్

దశాబ్దాల కాలంగా పాతబస్తీలోని గోషామహల్ మినహా చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, కార్వాన్ నియోజకవర్గాలు మజ్లిస్‌కు కంచుకోటగా మారగా, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మలక్‌పేట, నాంపల్లి, బహదూర్‌పురా నియోజకవర్గాలు కూడా మజ్లిస్‌కు పూర్తిగా అనుకూలంగా మారిపోయాయి. ఈసారి మజ్లిస్ పార్టీ సిట్టింగ్ స్థానాలకు మార్పులుచేర్పులు చేసి కొత్త వారికి అవకాశం కల్పించింది. చార్మినార్, యాకుత్‌పురా సీనియర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు రిటైర్మెంట్ ప్రకటించింది. నాంపల్లి నుంచి రెండుసార్లు ఎన్నికైన సిట్టింగ్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని యాకుత్‌పురాకు మార్చింది. చార్మినార్, నాంపల్లి స్థానాలకు ఇద్దరు మాజీ మేయర్లకు అవకాశం కల్పించింది. కొత్తగా పోటీ చేసే జూబ్లీహిల్స్ నుంచి జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌ను రంగంలోకి దింపింది. శివారులోని రాజేంద్రనగర్‌కు మాజీ కార్పొరేటర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. చాంద్రాయణగుట్ట, మలక్‌పేటల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలే తిరిగి బరిలో దిగారు. నాంపల్లిలో కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉండటాన్ని పసిగట్టి అభ్యర్థిని మార్పుచేసి ప్రచారంలో దూకుడు పెంచింది.

తెలంగాణ వాకిట్లో హామీల చెట్లు!

''ఆ బీఆర్ఎస్ వోళ్లజూస్తె..ఆసరా పెన్షన్లు పెంచుతమన్నారు. అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యమన్నారు. గ్యాస్ సిలిండరు నాలుగొందలకే అన్నరు. సౌభాగ్యలక్ష్మీ పథకమన్నారూ...సమాఖ్యలకు సొంత భవనాలు మహిళలకిస్తమన్నారు. ఇగ అటు పక్కజూస్తే..ఆ కాంగ్రెస్‌వాళ్లు కూడా ఆరు గ్యారంటీలన్నారు. మహిళలకు బస్సు ప్రయాణం ఉచితం అన్నారు. ఐదొందలకే సిలిండరూ... ఇంకా ఏమేమో అన్నారు. ఒక్క మనమే ఏమీ వాగ్దానం చెయ్యలే, ఒకవేళ చేసినా అది జనాలకు రీచ్ కాలే...ఒక్క బీసీలకే సీఎం పదవి అనేది తప్ప. అదిగూడ మనం ఏం జేసిన గెలవబోమని, ఆ వాగ్దానం చేశామని జనాలు అనుకునే అవకాశముంది'' అంటూ బాధపడ్డారు పువ్వు గుర్తు పార్టీ కార్యకర్తలు. మామూలు జనాల్లోకూడా ఇంచుమించూ అదే అభిప్రాయం. సరిగ్గా ఈ సిచ్యువేషన్‌లో మొన్ననే ఎల్బీ స్టేడియంకు వచ్చి.. ప్రసంగించారు దేశానికే పెద్దాయన లెక్క ఉండే ఓ పెద్దమనిషి. పైగా ఎప్పుడూ నవ్వుతూ మనదేశవాసులే కాకుండా, ప్రపంచంలో అందరి బాగోగులూ కోరుతూ ఉండే ''రేలంగి మామయ్య''లాంటి పెద్ద మనిషాయె ఆయన! ఆయన ఓటరునుద్దేశించి ప్రసంగించిన మాటలు వింటే తెలంగాణ వాకిట్లో హామీల చెట్లు కొన్ని మొలిచినట్లు అనిపించింది. ఆ చెట్ల పూలూ, ఫలాల సారమిలా అనిపించింది.

పాపం... ఎంత కంగారు పడిపోయార్రా
ఈ జనం!
ఈ రెండు నెలలపాటు అంతా
అల్లకల్లోలమైపోయింది.
ఏదేమైనా..అన్ని పార్టీలూ
భలే వాగ్దానాలిచ్చాయి..రా!
అటు కాంగ్రెస్సూ, ఇటు బీఆరెస్సూ
మంచి మంచి వాగ్దానాలిచ్చార్రా.
పాపం... జనాలు కూడా వాటిని భలేగా
తట్టుకున్నారు.
అలా ఉండాలి జనమంతా..
అదుంటే చాల్రా... ఆ తర్వాతే ఏదైనా!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

అదిగో చూడు... జనాల్లో కూటికి లేనోడున్నాడూ, ఇళ్లు లేవని ఏడ్చేవోడున్నాడు.
ఉద్యోగం కావాలనుకునే నిరుద్యోగున్నాడూ, డబుల్‌బెడ్రూమిల్లు కావాలనేవాడూ ఉన్నాడు. మామూలోడున్నాడూ, కంపెనీవోడున్నాడూ... కార్పొరేటోడున్నాడు.
ప్రతి వోడి గుంజాటనా ఒక్కటే.
దేవుడా నేను ఓటర్ను..నేను కోరుకున్నదియ్యీ... నేను కోరుకున్నదివ్వు.
వాళ్లను చూసి..వాళ్లు కోరుకున్నవన్నీ మనమిస్తామా, ఇవ్వగలమా?!
కానీ అవన్నీ నిజం కాదెహె.
కానీ... అవన్నీ నిజమని నమ్మేలా చేస్తామంతే!
అయినా ఓటర్లు మంచోళ్లు రా..ఓటర్లంటేనే మంచోళ్లు.
ఎప్పుడు ఎవరేం చెప్పినా వింటారు.
వాళ్లకు మనమేం ఇచ్చాం రా?
అకౌంట్లో పదిహేను లక్షలిచ్చామా, ఏడాదికి కోటి ఉద్యోగాలిచ్చామా?
రెక్కలిచ్చామూ పొయ్యి బతకండ్రా అన్నాం...
అయినా ఓటర్ల గొంతెమ్మ కోరికలకు మనమేం ఇవ్వగలం రా?
ఓ వందేభారత్ రైలిచ్చాం. పదిహేనుసార్లు జెండా ఊపాం.
అది కూడా బర్రె గుద్దినప్పుడల్లా సొట్టపడింది.
అంతకంటే పాలించే పార్టీగా మనమేమివ్వగలం రా ఈ దేశానికీ.
అంతకు మించినదేదైనా ఉందేంట్రా?
ఇదిగో... చెబుతున్నా విను... ఈ ఎన్నికల వరకే ఈ హామీలు.
ఈ ఎలక్షన్‌ల వరకే ఈ వాగ్దానాలు.
ఎన్నికల వరకూ ఎందుకురా, పోలింగ్ ముగిసిన మర్నాటికీ ఇవి గుర్తుంటాయో లేదో!
అయినా వాళ్లు వాగ్దానాలు చేసీ, వాళ్లు హామీలిస్తే ఏమీ?
అవన్నీ తీర్చేది కేంద్రంగా మనమేకాదా ఏమిటి?
అందుకే ఎదురొచ్చే ప్రతివాడినీ చిరునవ్వుతో పలకరిస్తూ వెళ్లిపోతే చాలు.
ఆ భగవంతుడిని మన కోసం మనమేమీ కోరుకోవాల్సిన అవసరం లేదు రా.
ఒకవేళ అలా కోరుకోవాల్సి వస్తే, పక్క పార్టీకి ఓటేసే వాడి గురించి కోరుకోవాలి.
''భగవంతుడా అటు కాంగ్రెస్‌కుగానీ, ఇటు బీఆర్ఎస్‌కు గానీ ఓటేసే
ప్రతివాడి ఓటూ మాకే పడేలా వరమివ్వు తండ్రీ.
ఏ ఒక్కడి ఓటూ వాళ్లకు పడనివ్వకు తండ్రీ అని.
బస్ అంతే.!!



ఆ ఐదు స్థానాలు...!

మధ్యప్రదేశ్‌లో అందరి దృష్టి వాటిపైనే ● బుధ్నిలో సీఎం శివరాజ్, ఛింద్వారాలో కమల్‌నాథ్

మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం పీక్స్‌కు చేరుతోంది. కాంగ్రెస్, అధికార బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. పోలింగ్‌కు పది రోజులు కూడా లేదు. పుంఖానుపుంఖాలుగా ప్రకటించిన, ప్రకటిస్తున్న పథకాలే తమ అధికారాన్ని కాపాడతాయని బీజేపీ ఆశ పడుతోంటే ఈసారి ఎలాగైనా నెగ్గాలని కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. ఈ క్రమంలో ఐదు అసెంబ్లీ స్థానాలు మాత్రం అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నాయి. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ బరిలోకి దిగుతున్న సీట్లు కూడా వీటిలో ఉండటం విశేషం!



బుధ్నీ


శివరాజ్‌సింగ్


విక్రం మస్తాల్

ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్న అసెంబ్లీ స్థానమిది. 2006 ఏడాదిలో దీనిని ఆయన తన కంచుకోటగా మార్చుకున్నారు. ప్రతిసారీ ఘన విజయం సాధిస్తూ వస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 58, 999 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. మొత్తం పోలైన ఓట్లలో 60 శాతం ఆయనకే దక్కా యి. 2013 లోనైతే 70 శాతం ఓట్ల షేరు తో ఏకంగా 84,805 ఓట్ల మెజారిటీ సా ధించారు! 2008లో శివరాజ్ 62 శాతం ఓ ట్ల షేరుతో 41,525 ఓట్ల మెజారిటీతో నెగ్గా రు. బీజేపీ అధిష్టానం ఈసారి రాష్ట్రంలో ఎవరినీ సీఎం అభ్యర్థిగా ప్రకటించని నేపథ్యంలో ఒకవేళ పార్టీ నెగ్గినా శివరాజ్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారా, లేదా అన్నదానిపై అందరిలోనూ అనుమానాలున్నా యి. కానీ బుధ్నీ నుంచి ఆయన మరోసారి విజయబావుటా ఎగరేస్తారనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు.

అభ్యర్థులు
శివరాజ్‌సింగ్ చౌహాన్ (బీజేపీ)
విక్రం మస్తాల్ (కాంగ్రెస్)

ఛింద్వారా


కమల్‌నాథ్


వివేక్ బంటీ

ఈ స్థానం పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ కంచుకోట. ఛింద్వారా లోక్‌సభ స్థానం నుంచి రికా ర్డు స్థాయిలో ఏకంగా తొ మ్మిది సార్లు నెగ్గిన ఘన చరిత్ర ఆయన సొంతం. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఆ శీర్వాదంతో అనుయాయుడు దీపక్ సక్సేనా కాంగ్రెస్ అభ్యర్థిగా ఇక్కడ బరిలో దిగి సునాయాసంగా విజయం సాధించారు. కమల్‌నాథ్ ఛింద్వారా ఎంపీగానే ఆ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. దాంతో కమల్‌నాథ్ అసెంబ్లీకి వెళ్లేందుకు వీలుగా దీపక్ రాజీనామా చేశారు. అలా 2019లో ఛింద్వారాలో జరిగిన ఉప ఎన్నికలో 25,800 ఓట్ల మెజారిటీతో ఇక్కడ కమల్‌నాథ్ నెగ్గారు. ఈసారి కూడా ఆయన విజయం ఖాయంగా కనిపిస్తోంది.

అభ్యర్థులు
కమల్‌నాథ్ (కాంగ్రెస్)
వివేక్ బంటీ సాహూ (బీజేపీ)

లహర్


అంబరీశ్ శర్మ


గోవింద్ సింగ్


కాంగ్రెస్‌కు కంచుకోట వంటి అసెంబ్లీ స్థానమిది. ఆ పార్టీ సీనియర్ నేత గోవింద్ సింగ్ 1990 నుంచీ ఇక్కడ వరుసగా గెలుస్తూ వస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ అనుచరునిగా ముద్ర పడ్డ ఆయన ఈసారీ ఇక్కడ హాట్ ఫేవరెట్. అయితే అంబరీశ్ వర్మ ఆయనకు గట్టి పోటీ ఇస్తారని బీజేపీ ధీమాగా ఉంది.

అభ్యర్థులు
అంబరీశ్ శర్మ (బీజేపీ)
గోవింద్ సింగ్ (కాంగ్రెస్)

– సాక్షి, నేషనల్ డెస్క్

నర్సింగ్‌పూర్


ప్రహ్లాద్‌సింగ్



లఖన్‌సింగ్

ఈ అసెంబ్లీ స్థానం బీజేపీకి చాలా మంచి పట్టు ఉన్న స్థానం. ఈసారి పార్టీ తరఫున గట్టి ఓబీసీ నేత, కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ బరిలో దిగుతున్నారు. అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే జలరాంసింగ్ పటేల్ ప్రహ్లాద్ సింగ్ తమ్ముడే. 2013లో ఇక్కడ ఆయనే నెగ్గారు. ఆ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఏకంగా 48,481 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. 2018లో మాత్రం జలరాం మెజారిటీ 14,903 ఓట్లకు తగ్గింది. ఏకంగా కేంద్ర మంత్రే బరిలో దిగడంతో ఈసారి కూడా ఇక్కడ బీజేపీ హవాయే కొనసాగుతుందని భావిస్తున్నారు.

అభ్యర్థులు
ప్రహ్లాద్‌సింగ్ పటేల్ (బీజేపీ)
లఖన్‌సింగ్ పటేల్ (కాంగ్రెస్)

ఇండోర్-1


కైలాస్ విజయవర్గీయ


సంజయ్ శుక్లా

ఈసారి హోరాహోరీ పోరు జరగనున్న ప్రముఖ అసెంబ్లీ స్థానాల్లో ఇదొకటి. ఇక్కడ 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గింది. 2018లో ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ బలమైన నేత సంజయ్ శుక్లాను బరిలో దించింది. అయినా ఆయన కేవలం 8,163 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. ఈసారి ఇండోర్–1 స్థానాన్ని ఎలాగైనా తిరిగి చేజిక్కించుకోవాలని బీజేపీ పట్టుదలగా ఉంది. అందుకే సీనియర్ నేత, జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాస్ విజయవర్గీయను బరిలో దించింది.

అభ్యర్థులు
కైలాస్ విజయవర్గీయ (బీజేపీ)
సంజయ్ శుక్లా (కాంగ్రెస్)

మధ్యప్రదేశ్‌లో 'రెబెల్స్‌తో తలనొప్పి'

బీజేపీ, కాంగ్రెస్‌ల సమీకరణాలపై రెబెల్స్ ప్రభావం
కీలకంగా మారిన సుమారు 12 స్థానాలు
రెబెల్స్‌ను ఒప్పించే పనిలో బిజీగా కాంగ్రెస్, బీజేపీలు

సాక్షి, న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లో అధికారాన్ని కాపాడుకొనేందుకు బీజేపీ, అధికారాన్ని దక్కించుకొనేందుకు కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. అదే సమయంలో ఈ రెండు పార్టీలకు తిరుగుబాటు నేతలు పెద్ద తలనొప్పిగా మారారు. టికెట్లను నిరాకరించడంతో సొంత పార్టీలపైనే తిరుగుబాటు బావుటా ఎగరేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ 39 మందిని, బీజేపీ 35 మంది నాయకులను తమ పార్టీల నుంచి బహిష్కరించింది. అయితే పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు రెబెల్స్‌గా బరిలో నిలవడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తలపట్టుకున్నాయి. కాగా ఈ నెల 17న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుండడంతో ఒకవైపు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా కేంద్రమంత్రులు బీజేపీ గెలుపు కోసం ప్రచారాన్ని ఉధృతంగా చేస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి వారు బీజేపీ ప్రచారాన్ని దీటుగా ఎదుర్కొంటున్నారు.

39 మందిని బహిష్కరించిన కాంగ్రెస్

మొత్తం 230 స్థానాలు ఉన్న మధ్యప్రదేశ్‌లో ఈసారి మెజారిటీ సీట్లు సాధిస్తామని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న ధీమాతో ఉన్న కాంగ్రెస్, బీజేపీలకు రెబెల్స్ తలనొప్పిగా మారారు. ఇప్పటికే తమ పార్టీ అభ్యర్థులకు పోటీగా స్వతంత్రంగా కానీ, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్‌సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ టికెట్లు సాధించి బరిలో నిలిచిన 39 మంది కాంగ్రెస్ నాయకులను కాంగ్రెస్ పార్టీ ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరించింది. బీజేపీ 35 మంది రెబెల్స్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. కీలకంగా ఉన్న సుమారు 12 స్థానాల్లో రెబెల్స్ బరిలో దిగడం, వారు ఆయా స్థానాల్లో తమదైన ముద్ర వేయడంతో ఈ రెండు పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. వీరిలో ఎక్కువ మంది నాయకులు బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి టిక్కెట్లు రాకపోవడంతో రెబెల్స్‌గా నామినేషన్ దాఖలు చేశారు. కొందరు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచి ప్రజలకు మరింత మెరుగైన సేవ చేస్తామని హామీలు ఇస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి వీరి సంఖ్య కాస్త ఎక్కువగానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో కొందరు మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఉండటం గమనార్హం. గత శాసనసభ ఎన్నికల్లో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా... ఈసారి వీరిలో ప్రదీప్ జైస్వాల్, విక్రమ్ సింగ్ రాణాలు బీజేపీ టికెట్‌పై పోటీ చేస్తున్నారు. కాగా, సురేంద్ర సింగ్ షేరా, కేదార్ డాబర్ కాంగ్రెస్ అభ్యర్థులుగా బరిలో దిగారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు స్వతంత్ర అభ్యర్థులు సుమారు 12 స్థానాల్లో పెద్ద అవరోధంగా తయారయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అంతర్‌సింగ్ దర్బార్‌కు కాంగ్రెస్ పార్టీ డాక్టర్ అంబేద్కర్‌నగర్ మహూ అసెంబ్లీ స్థానం సీటు నిరాకరించడంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సిప్నీ మాల్వా నుంచి ఓం రఘువంశీ, మల్హర్‌ఘడ్ నుంచి శ్యామ్‌లాల్ జోకీచంద్, ఆలోట్ నుంచి ప్రేమ్‌చంద్ గుడ్డు, ధార్ నుంచి కుల్దీప్ సింగ్ బుందేలా, గోటేగావ్ నుంచి శైలేంద్ర చౌదరి, హోషంగాబాద్ నుంచి భగవతి చౌరే, భోపాల్ నార్త్ నుంచి నసీర్ ఇస్లాం, ఆమీర్ అకీల్‌లు, బడ్‌నగర్ నుంచి రాజేంద్రసింగ్ సోలంకీ, హుజూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర డాగా, బర్గి నుంచి జైకాంత్ సింగ్, సిహోరా నుంచి మాజీ మంత్రి కౌశల్య గోటియా, జమునా మరావిలు స్వతంత్రులుగా బరిలో దిగారు. గోటేగావ్, బడ్‌నగర్‌లో గతంలో ప్రకటించిన అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ మార్చింది. దీంతో మనస్తాపానికి గురైన కాంగ్రెస్ నేతలు రెండు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగి నిరసన జెండా ఎగరేశారు. అయితే స్వతంత్రులుగా పోటీచేయకుండా వారిని నిలువరించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉందని చెప్పొచ్చు. బీజేపీ సీట్లు నిరాకరించడంతో సిద్ధి నుంచి కేదార్‌నాథ్ శుక్లా, బుర్హాన్‌పూర్ నుంచి హర్షవర్దన్ సింగ్ చౌహాన్, నివారి నుంచి రాష్ట్ర మంత్రి నంద్‌రాం కుష్వా హా, టీకమ్‌గఢ్ నుంచి కేకే శ్రీవాత్సవ, జబల్‌పూర్ నార్త్‌సెంట్రల్ స్థానం నుంచి కమ్లేశ్ అగర్వాల్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

గత 52 ఏళ్లుగా ఎన్నికల్లో పోటీ

- పేదలకు భూములు, సదుపాయాల కల్పనే లక్ష్యం
- రాజస్తాన్‌లో 78 ఏళ్ల ఉపాధిహామీ కూలీ పోరాటం

జైపూర్: 78 ఎనిమిదేళ్ల వయసులోనూ ఉపాధిహామీ కూలీగా పనిచేస్తూనే పేదలకు భూములు, సదుపాయాలు దక్కాలంటూ అలుపెరుగని రాజకీయ ఉద్యమం కొనసాగిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు తీతర్ సింగ్. రాజస్తాన్‌లోని కరణ్‌పూర్ నియోజకవర్గం దళిత సామాజికవర్గానికి చెందిన తీతర్.. గడిచిన 52 ఏళ్లలో పంచాయతీ ఎన్నికలు మొదలు లోక్‌సభ ఎన్నికల దాకా ప్రతీ ఎన్నికల్లో పోటీ చేయడం విశేషం. నవంబర్ 25వ తేదీ జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత 20 ఎలక్షన్‌లలో ఒక్కసారి కూడా డిపాజిట్ దక్కలేదు. 'అయినా సరే పోరాటం ఆపేది లేదు. పేదలకు భూములు సమకూర్చే బాధ్యతలను ఈ ప్రభుత్వాలు విస్మరించాయి. అందుకే ఈ వంతు ప్రయత్నంగా ఇలా ప్రతిసారీ ఎన్నికల్లో పోటీచేస్తున్నా' అని తీతర్ సింగ్ చెప్పారు.

ఎన్నికల విధులకు వెళ్లొస్తూ..

- ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు టీచర్ల దుర్మరణం

కొండగావ్: ఛత్తీస్‌గఢ్ తొలి విడత ఎన్నికల పోలింగ్ ముగిసినవేళ అక్కడ విషాదం సంభవించింది. పోలింగ్ విధులు ముగించుకొని వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం ఓ ట్రక్కును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. కొండగావ్ జిల్లా కేంద్రంలో ఈవీఎంలు అప్పగించి వీరంతా తిరుగు పయనమయ్యారు. మార్గమధ్యంలో బహిగావ్ గ్రామం దగ్గర బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతులను శివ్ నేతమ్, సంత్రం నేతమ్, హరీంద్ర యాకీలుగా గుర్తించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.